
ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



సిద్ధివినాయకుడు
(లేపాక్షి దేవాలయ, శిల్పము)

వార్తా చిత్రాలు




శాసనసభలో గాంధీజీ

మద్రాసు శాసనసభాభవనంలో మాన్యశ్రీ సి. రాజగోపాలాచార్యులుగారు (గవర్నరు జనరలు) ఇటీవలనే ఆవిష్కరించిన మహాత్ముని తైలవర్ణ చిత్రపు ప్రతికృతి. చిత్రాన్ని రచియించినవారు శ్రీ చామకూర సత్యనారాయణగారు




కాశ్మీరు కేసరి షేక్ అబ్దుల్లా

బొంబాయిలో కాశ్మీరు చిత్రకళాప్రదర్శనాన్ని ప్రారంభిస్తూ ఉపన్యసిస్తున్న దృశ్యము.



లేడీ నైకి వీడ్కోలు

తమ సంఘమునకు అధ్యక్షురాలుగా ఉండి మహత్తమమైన సేవచేసిన గవర్నరుసతి లేడీ నైకి వీడ్కోలిచ్చుటకై మద్రాసు మహిళాభ్యుదయసంఘమువారు గత మంగళవారమునాడు జరిపిన సభా సన్నివేశము.



ఢిల్లీలో పురాణఖిల్లావద్ద ఇటీవల పి. డబ్ల్యు. డి. వారు వివ-
కాలు సాగిస్తుండగా అక
బయటపడిన కొన్ని విగ్రహ



★



మదనపల్లి మహిళాసమాజము

మదనపల్లి మహిళాసమాజంవారు శ్రీమతి కె. రామసుబ్బమ్మగారి అధ్యక్షతను ఇటీవలజరిపిన వార్షికోత్సవసమావేశము.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును


ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)

సంపుటము **41**

సంచిక **1**


Founder : K. NAGESWARA RAO

సర్వధారి సంవత్సర భాద్రపద శుద్ధ షష్ఠి బుధవారము



ఏనుగు సవారీ

(ఒకానొక ప్రాచీన శిలాప్రతిమ)



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ సెప్టెంబరునెల 8-వ తేది బుధవారము

శాసనసభయెడల ఉదాసీనభావము

ఆంధ్రరాష్ట్ర ఆందోళననుగూర్చి ప్రధాని చేసిరన్న విమర్శల విషయమున రాష్ట్రశాసనసభయందు ప్రశ్న పరంపర వచ్చుటలో ఆశ్చర్యము లేదు. ప్రధానిపక్షమున సభానాయకుడు గోపాలరెడ్డిగారిచ్చిన సమాధానములు తృప్తికరముగ లేకపోయినను, ఆయన స్థితిలో మరొకరు భిన్నముగ చెప్పియుండజాలరు. ప్రధాని సభకు వచ్చియున్నప్పటికి కూడ శ్రీ గోపాలరెడ్డిగారికన్న మెరుగైన సమాధానములు ఇచ్చి యుండగలిగెడివారన్నది అనుమానము. సందర్భమునుండి విడదీసి, ప్రధాని ఉపన్యాసభాగములు తప్పుగా ప్రకటింపబడినవని సభానాయకుడు తెలిపెను. తొందరపాటు చేతనో, ఉపన్యాస ఉత్సాహముతోనో ఏదో మాట్లాడి, దానికి ఇతరులు తప్పుపట్టినప్పుడు సమర్థించుకొనుటకు శక్తిలేక, పత్రికలవారు తప్పు ప్రకటించిరనుట సామాన్యముగా రాజకీయ నాయకులనేకులకు పరిపాటి. వాస్తవమునకు తాము మొదట ప్రకటించినది సత్యమని తెలిసి కూడ, అది తప్పని నాయకులు తెలిపినపుడు దానిని కూడ మరల పత్రికలవారు ప్రకటించెదరు.

మద్రాసు ప్రధాని ఆ పద్ధతినికూడ అనుకరించలేదు. ఇన్ని సమాధానములు ఇచ్చిన శ్రీ గోపాలరెడ్డిగారు అసలు ప్రధాని నిజముగా చెప్పినదేమో చూచాయగా కూడ తెలుపలేదు. ప్రధాని ఉపన్యాసము వ్రాసికొని కాకపోయినప్పటికి, అప్పటికప్పుడు ఆశువుగా ఉపన్యసించినప్పటికిని, స్థూలముగానైనను, తాము అపుడు చెప్పినది జ్ఞాపకముండవలెను. వెలిబుచ్చిన అభిప్రాయములు వ్యక్తిగతముగా చెప్పినవనుటలోనే అసలు విషయమును అంగీకరించినట్లు వ్యక్తమగుచున్నది. బహిరంగసభలో ప్రధానిగా ఉపన్యసించినపుడు వ్యక్తిగతాభిప్రాయములను మాత్రము తెలుపుటలో ఔచిత్యము కనుపడుటలేదు. ఒక వేళ అది సమర్థనీయమైనను, ఉపన్యాసమిచ్చినపుడే ఆ సంగతి తెలిపి యుండవలసినది. ఉపన్యాసమిచ్చిన కొంతకాలమునకు వ్యక్తిగతాభిప్రాయమనుటచే, మొదట చెప్పినదానికి అంటిపెట్టుకొనుటకు ధైర్యము లేకపోయినదని భావించవలసి వచ్చుచున్నది.

సభానాయకుడు ఇచ్చిన సమాధానములు తృప్తికరముగ లేవని చర్చను కోరుటలో గల భావము దానంతట అదే వ్యక్తమగుచున్నది. చర్చవల్ల బయటపడు ప్రత్యేక విశేషము కనుపడలేదు. మంత్రివర్గము చెప్పగలదంతయు ప్రశ్నలకిచ్చిన సమాధానములోనే యున్నది. కాబట్టి చర్చను కోరుటలో ప్రధానిమీద, మంత్రులమీద ఇంకా నాలుగుగాళ్ళు వేయుటతప్ప వేరుఉద్దేశము కనుపడలేదు. ఆ సంగతి తేటతెల్లము. చర్చ అనవసరమని సభానాయకుడు అభ్యంతరము చెప్పలేదు. స్పీకరు అంగీకరించెను. అటువంటప్పుడు సభనుండి మంత్రులందరు ఒకరి తరువాత ఒకరు గైరుహాజరగుట, చివరకు కోరం లేకుండ పోవుట మెచ్చదగిన విషయముగా లేదు. చర్చ లేవదీసినవారికి ఇది సరిఅయిన సమాధానమని మంత్రివర్గము అనుకొనినప్పటికి, సభయెడ ఇంత ఉదాసీనభావము చూపుట వారికి ఉచితముగ లేదు. అందులో భాషా రాష్ట్రనిర్మాణ పరిశీలక సంఘము వారు వచ్చిన రోజున ఇదిజరుగుట విచారకరమైన విషయము.

చలామణి నిరోధము

అధికచలామణి మూలమున ఏర్పడిన ఆర్థికదుస్థితిని అధిగమించుటకు చేయవలసిన నిర్ణయమును కేంద్రప్రభుత్వము మరొక వారము వాయిదా వేసినది. వివిధఆర్థికవేత్తలు సూచించిన విధానములో ఏ ఒక్కదానిని తాము అంగీకరించలేదని ప్రకటించినది. కరెన్సీనోట్ల విలువను తగ్గించుటగాని, కొన్ని రద్దుచేయుటగాని, బ్యాంకు డిపాజిట్లను బిగబట్టుటగాని జరుగదని ప్రధాని పండిట్ నెహ్రూ అధినివేశ శాసనసభలో విస్పష్టముగ ప్రకటనచేసెను. అంతే కాక ఆ విధమైన సూచనలను ఆలోచించమని కూడ చెప్పెను.

ప్రధాని ఈ ప్రకటన చేయుటవల్ల దేశమునకు ఎంతో ఉపకారము చేసెననుటలో అతిశయోక్తి లేదు. నూరు రూపాయిలనోట్లను రద్దు చేయుదురని ఈ మధ్య వదంతులు జయలుదేరి అలజడికి కారణమైనది. అటువంటి ఆలోచన లేదని రిజర్వుబ్యాంకువారు ప్రకటించినప్పటికిని తొందర తగ్గలేదు. అనేకులు బ్యాంకులకు ఎగబడి పెద్ద నోట్లను చిన్ననోట్లలోనికి మార్చుకొననారంభించిరి. పండితనెహ్రూ ప్రకటన ప్రజలలోని ఈ తొందరపాటును చాలవరకు తగ్గించినదని చెప్పవచ్చును.

నోట్లను రద్దుచేయుటమూలమునను, బ్యాంకులందలి డిపాజిట్లను బిగబట్టుటమూలమునను అధికచలామణివల్ల ఏర్పడిన పరిస్థితి పరిష్కారము కాదు. బలవంతముగా పైకమును నిలువచేయుటవల్లను ప్రయోజనము లేదు. కేవలము విపరీతమైన పద్ధతులను అనుష్ఠించి పైకమును తగ్గించుటవల్ల ప్రయోజనము సున్న. అసలు చలామణిలోనున్న పైకమును తగ్గించుటకు బదులు దానికి తగినంత పరిమాణములో వస్తూత్పత్తి పెరుగవలసియున్నది. వస్తులోపమువలననే దేశములో ధనము ఎక్కువ యున్నదని అభిప్రాయపడుటకు కారణము కాని, ఉన్నదనమునకు ధనము దానివల్ల రావలసిన ప్రయోజనము సిద్ధించుచున్నదా అనిన అది లేదు. యుద్ధమునకు పూర్వముకన్న అనేకులకు ధనరూపముగా ఆదాయము పెరిగినది. కార్మికులకు వేతనములు పెరిగినవి. ఉద్యోగులకు జీతములు పెరిగినవి. కాని వాస్తవమునకు జీతములు పెరిగినంతగా వారికి ప్రయోజనము లభించుచున్నదా అనిన లేదని చెప్పవలెను. అన్నివస్తువుల ఖరీదు సామాన్యముగా వాటి సరఫరామీద ఆధారపడియుండును. ఈ సూత్రమే చలామణికి వర్తించగలదు. అయితే చలామణికి, స్వతస్సిద్ధముగా ప్రయోజనవిలువలేదు. కేవలము కొనుగోలువిలువ, మారకము విలువ. అందువల్ల ఆ విలువలు రెండును దేశములో లభ్యమగు వస్తువులమీదనే ఆధారపడియుండును. కాబట్టి చలామణిని తగ్గించుటలో రాగల లాభము తక్కువ. ఒక విధముగా మృగ్యమని చెప్పవచ్చును. వాస్తవమునకు చలామణిని ఏమాత్రమును తగ్గించక వస్తూత్పత్తిని ఎక్కువ చేయుట వాఛనీయము. చలామణి అధికమగుటవల్లనే అనేకులకు ఏకొద్ది పైకమో చేతికి వచ్చుచున్నది. జాతిమొత్తముమీద అందరికి రావలసి యున్నది. చలామణిని తగ్గించుటవల్ల వారికి లభ్యమైన ఆ కొద్ది మొత్తముకూడ అంతరించి పోవును. కాబట్టి ఇపుడు చేయవలసినదేమన—ఉన్నపైకముతో తగిన లబ్ధి వచ్చునట్లు చూడవలసి యున్నది. అందుకు దేశములో వస్తూత్పత్తి ఎక్కువ కావలసియున్నది. అది విశేషముగ సాధ్యము కాకపోయినపుడు విదేశములనుండి దిగుమతినైనను చేయవలెను. అంతేకాని చలామణిలోనున్న పైకమును తగ్గించుట సరిఅయిన మార్గము కాదు.

కూచిపూడి నాట్యకళ

కూచిపూడి నాట్యకళ ఒకప్పుడు ఎంతో వైభవము ననుభవించి, విజయనగరాది రాజులచేతను, గోల్కొండ నవాబులచేతను కూడ సత్కారగౌరవములనందుకొన్నది. కథాకళీ, మణిపురీ ఇత్యాది ఇతర దేశీయ నృత్యపద్ధతులకన్నను కూడ ఇది యెంతో మిన్నయైనదనియు, భారతీయ నాట్యశాస్త్రకారుల హృదయమంతయు ఇందు నిక్షిప్తమై యున్నదనియు పలువురు నాట్యకళానిష్ణాతులే బాహాటముగా వెల్లడించినారు. ఆంధ్ర సంస్కృతికి ఉన్న విశిష్టసంపత్తిలో ఈ కూచిపూడిభరత నాట్యము అగ్రగణ్యమైనది. 'నాటకకళ, సంగీతము, నృత్యము కలిసిన క్రొత్త కళ ఒకటి సృష్టించవలె'నని రవీంద్రకవి ఆమధ్య ఎంతో తపించినాడని విన్నాము. కాని, క్రొత్తగా ఆయనలో ఉద్బుద్ధమైన ఈ స్వరూపము కూచిపూడి నాట్యకళలో ఏనాడో రూపొందినది.

అటువంటి ఈ నాట్యకళ ఈమధ్య కొన్నాళ్లుగా, సరియైన ఆదరణ లేక, జీర్ణావస్థలో నుండుట విచారకరము. ఇప్పుడింత అనాదరణ పాలైనను, ఇది ఇంకను వెనుకటి వన్నెవాసులతో సజీవమై యున్నదనిన, శ్రీ వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రిగారివంటి కొందరు కూచిపూడి నాట్యసంప్రదాయవేత్తలకు దానియందు గల అవ్యాజమైన మమకారము, దాని ప్రతిష్ఠకై వారు పడుచున్న కృషి ఈ రెండే ముఖ్యకారణములు. అవియే లేకున్నచో ఈ ఉత్తమకళ ఏనాడో నామరూపములు లేకుండ మాసిపోయియుండెడిది.

ఆంధ్రుల భాగ్యవశమున ఈ నాట్యకళకు తిరిగి మంచి రోజులు రానున్న సూచనలగుపించుచున్నవి. కళాభిమానులు దీని పునరభ్యుదయమున కంకణము కట్టుకొన్న జాడలు పొడగట్టుచున్నవి. మొన్న 6-వ తేదీనాడు చెన్నపురిలోని ఆంధ్రమహాజనులు కూచిపూడినాట్యకళానిధియైన శ్రీ వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రిగారికి సింహతలాటబహూకరణము పట్టుపీతాంబరాదులతో సత్కరించుట ఇందుకు ప్రబలనిదర్శనము. ఇది శాస్త్రిగారి పేరున జరిగినను ఇది వారొక్కరికే గాక అసలు ఆయనఆరాధ్యమైన కూచిపూడికళకే జరిగిన సమ్మానముగా ఎంచుచున్నాము. ప్రాతిపదికగా, ఇక త్వరలోనే ఈ కళ తిరిగి వెనుకటి వైభవముతో విలసిల్లును పొంది, ఆంధ్రుల కళాకాంతులను దిశల వెదజల్లగలదని ఆశించుచున్నాము.

నేటి ప్రపంచం

జెక్ రిపబ్లిక్ మాజీ అధ్యక్షుడు బెనెష్ మృతి; మాస్కో-చర్చల సుముఖధోరణివల్ల బర్లిన్ మిలిటరీ గవర్నర్ల సమావేశం; ఫ్రెంచి మంత్రివర్గ ప్రతిష్టంభన, షూమన్ ఆధ్వర్యాన పరిష్కారం—ఇవీ ఈవారం ప్రధాన అంతర్జాతీయ సంఘటనలు



ఎడ్వర్డ్ బెనెష్

యూరప్‌ఖండ ప్రముఖ రాజకీయవేత్త, జెకొస్లొవేకియా దేశభక్తుడు అయిన ఎడ్వర్డ్ బెనెష్ పరమపదించాడు. ఇతడి మృతివల్ల ఒక్క జెకొస్లొవేకియా రాజ్యమేగాక, యూరప్‌ఖండమే ఒక ప్రముఖప్రజాస్వామ్యవాదిని కోల్పోయింది. ప్రపంచ ప్రజాస్వామ్యవాదులందరికీ ఇతడి మరణంసంతాపహేతువని చెప్పవలసివుంటుంది.

ప్రథమ ప్రపంచ సంగ్రామానంతరం జెకొస్లొవేకియా ప్రజారాజ్యస్థాపనలో డాక్టర్ బెనెష్, థామస్ మాజరిక్‌కు కుడిభుజంవలె పనిచేసి కృతకృత్యుడైన దీక్షాజీవి. ద్వితీయ ప్రపంచ సంగ్రామానికి పూర్వమే తన దేశస్వాతంత్ర్యాన్ని నాజీమూకలు హరించివేసినప్పుడు, విదేశాలకు వలసవెళ్లి అక్కడ బలసంపదను, విదేశాల ప్రాపకాన్ని సంపాదించుకొని నాజీ రాక్షసశక్తిని ప్రతిఘటించి దేశస్వాతంత్ర్యాన్ని పునరార్జించిన ఉత్తమ దేశభక్తుడు.

ఐతే, ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం స్వాతంత్ర్య పునఃస్థాపనతో జెకొస్లొవేకియా కష్టాలు గట్టెక్కలేదు. నాజీజర్మనీని సంపూర్తిగా పరాభూతంచేసి, విజయాన్ని సాధించిన ప్రపంచ అగ్రరాజ్యాలలోనే తీవ్రవిభేదాలు ప్రారంభమై, యూరప్ ఖండంలోని చిన్నరాజ్యాలు ఈనాడు అతివిషమ పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చింది. బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సులు ఒకవైపు, సోవియెట్ రష్యా ఒకవైపు చేరి ప్రపంచ రాజకీయరంగంలో స్వీయప్రాబల్య విస్తరణార్థం వేస్తున్న ఎత్తుల ఎదురెత్తుల ఫలితంగా యూరప్ ఖండంలోని రాజ్యాలన్నీ పరస్పర విరుద్ధమైన రెండు ప్రబల శత్రుకూటాలుగా చీలిపోయినవి. హంగరీ, రుమేనియా, బల్గేరియా, యుగోస్లావియా, పోలెండు మొదలైన తూర్పుయూరప్ రాజ్యాలన్నీ సోవియెట్ రష్యా అండన చేరి కమ్యూనిస్టు నిరంకుశత్వాన్ని స్థాపించుకున్నవి. మధ్యయూరప్ రాజ్యమైన జెకొస్లొవాకియాకు కూడా ఇదే దుర్గతి సంప్రాప్తమైంది.

ఈ సంవత్సరం ఫిబ్రవరినెలలో జెకొస్లొవేకియా మంత్రివర్గంలో తీవ్ర ప్రతిష్టంభన ఏర్పడింది. శాసనసభలో అధికసంఖ్యాకులైవున్న కమ్యూనిస్టులు, కమ్యూనిస్టులు కాని 12 మంది మంత్రులు రాజీనామా ఇచ్చితీరాలని పట్టుపట్టారు. జెక్ అధ్యక్షుడు ఎడ్వర్డ్ బెనెష్‌కు విపరీతమైన సంకట పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం జెక్ అధ్యక్షుడుగా పనిచేస్తున్న కమ్యూనిస్టు నాయకుడు గొట్వాల్డ్ పన్నిన కుట్రఫలితంగానే ఆనాడు విషమస్థితి సంభవించింది. ఐదురోజులపాటు తీవ్రంగా మథనపడి, స్వయం కృషివల్ల నిర్మించిన జెక్ జాతిని విచ్ఛిన్నంచేయడం, దేశంలో సంక్షోభాన్ని కలిగించడం ఇష్టంలేక ఎడ్వర్డ్ బెనెష్ కమ్యూనిస్టులు చెప్పినట్లు నడుచుకొని జాన్ మాజరిక్ మొదలైన ముఖ్య సహచరుల రాజీనామాలను ఆమోదించాడు. రాజీనామాలు ఇచ్చిన కొద్దికాలానికే జాన్ మాజరిక్ విషాద పరిస్థితులలో మరణించడం సంభవించింది. ఏ కారణంవల్ల మాజరిక్ దుర్మరణానికి పాల్పడవలసి వచ్చిందీ ప్రపంచానికి ఇంతవరకూ సవిస్తరంగా తెలియనేలేదు. దేశంలో కమ్యూనిస్టు నిరంకుశత్వం ఏర్పడినప్పటికీ, ప్రజాస్వామ్యవాదులైన సహచరులు రాజీనామా ఇచ్చినప్పటికీ తూర్పు పశ్చిమ యూరప్ రాజ్యాలమధ్య పరస్పరసహకారం సంభవమే అనే దృఢవిశ్వాసం వున్న కారణంగా ఎడ్వర్డ్ బెనెష్ జెక్ ప్రభుత్వాధ్యక్షుడుగా పనిచేయడానికి సమ్మతించాడు.

కమ్యూనిస్టు ప్రభుత్వ ధోరణి ఆనాటి కానాడు విషమిస్తున్న కారణంచేతా, ఆరోగ్యం సరిగా లేనందువల్లా గత జూన్ 7వ తేదీన అధ్యక్షపదవినుండి విరమించి స్వగ్రామంలో తన జీవితవిశేషాలను వ్రాసుకుంటూ కాలక్షేపం చేస్తూ వచ్చాడు. దేశంలో కమ్యూనిస్టు నిరంకుశత్వం, ప్రపంచరాజకీయాలలో ప్రజాస్వామిక, నిరంకుశ శక్తుల మధ్య తీవ్రసంఘర్షణ చెలరేగుతున్న ఈ సమయంలో డాక్టర్ ఎడ్వర్డ్ బెనెష్ (వయస్సు 64) లాంటి నిష్కల్మష ప్రజాహితవాది మరణించడం ప్రపంచప్రజాస్వామికోద్యమానికి తీరని నష్టం. జెక్ రాజ్య రాజకీయ చరిత్రలో బెనెష్ పేరు చిరకాలం ఆదర్శప్రాయమై నిలిచితీరుతుంది.

* * *

జర్మనీభవిష్యత్తుపైనా, బెర్లిన్ సమస్యపైనా మాస్కోలో ఇప్పటికి ఐదువారాలకుపైగా సాగుతున్న అగ్రరాజ్యాల చర్చలు ఇంకా ఒకతెగనేలేదు. పరిష్కరించవలసిన సమస్యలు అతి క్లిష్టమైనవైనందువల్ల సంప్రతింపులు దీర్ఘకాలం సాగడంలో ఆశ్చర్యమేమీ లేదు. సోవియెట్ అగ్రనాయకులతో ఈవారం ప్రత్యేక సమాలోచనలను బ్రిటిష్, అమెరికన్ ఫ్రెంచి ప్రతినిధులు జరపకపోయినప్పటికీ, మాస్కో సంప్రతింపుల ఫలితంగానే బర్లిన్ నగరంలో బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి, సోవియెట్ గవర్నర్లు నల్గురూ ఒకచోట సమావేశమై బర్లిన్ నగర ద్రవ్యచలామణి సమస్యను తర్కించడం జరిగింది. వీరు ఒకేసారిగాకుండా రెండు మూడు సార్లు సమావేశమై వివిధ విషయాలనూ పరిశీలించినట్లు వార్తలు వస్తున్నవి. బర్లిన్ ద్రవ్యమారక సమస్యను ఏదో విధంగా పరిష్కరించుకోగలిగినట్లయితే, జర్మనీ రాజధానిచుట్టూ రష్యా ప్రయోగించిన దిగ్బంధన ప్రతిబంధకాన్ని బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా ప్రభుత్వాలు అధిగమించడానికి వీలవుతుంది.

వాస్తవానికి సోవియెట్ ఆక్రమిత జర్మన్ భూభాగంలో వున్న బర్లిన్ నగరంలో బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సుల పరిస్థితి ఆ దేశాలు కోరుకుంటున్నంత బలంగా లేదు. జర్మనీ రాజధానిలో తమ ఆక్రమణ కింద వున్న 25 లక్షల మంది ప్రజలను పోషించలేక వాటికి తలప్రాణం తోకకు వస్తున్నది. విమానాలద్వారా సరఫరాలను అందచేస్తున్నప్పటికీ అది అట్టే కాలం సాగడానికి వీలైనపనికాదు. అందుచేత ఏకోవిధంగా ఈ సమస్యను పరిష్కరించుకోవాలని పశ్చిమ అగ్రరాజ్యాలు ఉద్దేశిస్తున్నవి. ఐతే మాస్కో సంభాషణల ధోరణి ఏవిధంగా వున్నదీ, సోవియెట్ రష్యా నాయకులు ఎంతవరకు దిగివస్తున్నదీ తెలియజేసే అధికారప్రకటన ఏదీ ఇంతవరకు వెలువడలేదు. ఇటీవలవచ్చిన వార్తలను బట్టి చూస్తే మాస్కో సంప్రతింపులు కొంతవరకైనా ఫలించే అవకాశం వున్నదేమో ననిపిస్తున్నది.

సోవియెట్ రష్యా ప్రాబల్యంక్రింద వున్న తూర్పు యూరప్ రాజ్యాల పరిస్థితి అట్టే సుముఖంగా లేనందువల్లా, కమ్యూనిస్టు ప్రచార సంస్థ కొమిన్‌ఫార్మ్ ఆరోపణలను ధిక్కరిస్తూ యుగోస్లావియా ప్రధాని మార్షల్ టిటో తన ఆధిపత్యాన్ని బలపరుచుకుంటున్నందువల్లా, హంగరీ కమ్యూనిస్టులలో కొన్ని విభేదాలు పొడచూపుతున్నందువల్లా రష్యాప్రధాని మార్షల్ స్టాలిన్ బర్లిన్ సమస్యపై మొదట చూపినంత మొండి పట్టుదలను చూపక కొంతవరకైనా రాజీధోరణ్ని కనబరిచే అవకాశం లేకపోలేదు.

తూర్పుయూరప్ రాజ్యాలలో ఏర్పడిన చీలిక తీవ్రతరమైతే సోవియెట్ రష్యా మొదట యూరప్ ఖండంలోనూ, ఉత్తరోత్తరా ప్రపంచమంతటా నిర్మించదలచిన కమ్యూనిస్టు రాజ్యసౌధం ఒక్కసారిగా కూలిపోతుంది. వాస్తవికవాది అని ప్రసిద్ధిగాంచిన స్టాలిన్ ప్రప్రథమంగా బాహ్యసమస్యలను కొంతవరకైనా పరిష్కరించుకొని, పిమ్మట స్థిరవైఖరిలో తన రాజ్యకూటంలో ఏర్పడిన ఆంతరంగిక సమస్యలను సరిదిద్దుకుంటాడు. అందుచేత మాస్కో విదేశాంగ విధానంలో ఆకస్మికంగా ఏ మార్పులు వచ్చినా రావచ్చు.

* * *

ఏ మంత్రివర్గమూ స్థిరంగా పనిచేయలేక ఈ రోజు ఒక మంత్రివర్గం ఏర్పడడమూ, తెల్లవారే సరికి అది పతనంకావడమూ ఫ్రాన్సును చిరకాలంగా పీడిస్తున్న పురాణవ్యాధి. ఈవ్యాధి నుంచి ఫ్రాన్సు కోలుకోలేకపోతున్నది. ఆంద్రీ మేరీ అనే అతని అధ్వర్యాన మంత్రివర్గం ఏర్పడి సరిగా నెలరోజులైనా గడచినవో లేనేలేదో గత వారాంతాన అది పతనమైంది. ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షుడు విన్సెంట్ ఆరియోల్ నూతన ప్రభుత్వనాయకుడికోసం దేవులాడడం ప్రారంభించాడు. వెతికి వెతికి పాత ప్రధాని రాబర్ట్ షూమన్‌పైనే ఆరియోల్ చివరకు ఈ బాధ్యత వేశాడు. ఫ్రాన్సును ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలపై రాబర్ట్ షూమన్ వివిధపార్టీ ప్రముఖులను మొదట కూడగట్టుకరాలేకపోయాడు. అందుచేతనే నూత్న మంత్రివర్గ నిర్మాణంలో తన అశక్తతను అధ్యక్షుడికి తెలియజేసి తన ప్రధాని హోదాకు రాజీనామా ఇవ్వడం జరిగింది. ఐతే అధ్యక్షుడు ఆ రాజీనామాను అంగీకరించక, తిరిగి మరొకసారి ప్రయత్నం చేసి చూడమన్నాడు.

పార్టీ ప్రముఖులతో ఏదో ఒకవిధంగా రాజీకి వచ్చి, షూమన్ చివరకు ఒక మంత్రివర్గాన్ని నిర్మించగలిగాడు. రాబర్ట్ షూమన్ ఈ విషయంలో కృతకృత్యుడైనందుకు అభినందించవలసిందేగాని, ఇతడు సాధించిన విజయం ఎన్నిరోజులు నిలవగలదన్నదే సందేహాస్పదమైన విషయం.

ఆంద్రీ మేరీ రాజీనామా ఇచ్చిన మరుక్షణంలోనే దేశమంతటా పెద్దపెట్టున సమ్మెలు, ఆర్థిక సంక్షోభమూ ప్రారంభమైనవి. ఫ్రాంక్ నాణెం విలువ పూర్తిగా పడిపోయింది. ఆర్థిక సమస్యపై సోషలిస్టులతో ఏర్పడిన తీవ్రవిభేదాలవల్లనే ఆంద్రీ మేరీ ప్రభుత్వం పతనమైంది. పౌరసైనికశాఖల వ్యయాన్ని బాగా తగ్గించవలెననే సంకల్పంతోనూ, మద్యపానీయాలమీదా, సిగరెట్లమీదా విపరీతమైన పన్నులు విధించి బడ్జెట్‌ను సరిపెట్టి, ఫ్రాంక్ భవిష్యత్తును కాపాడాలనే సంకల్పంతోనూ రాబర్ట్ షూమన్ నూత్న మంత్రివర్గాన్ని నిర్మించాడు. షూమన్ ప్రధానామాత్యపదవితోపాటు విదేశవ్యవహారాలశాఖను కూడా తీసుకొని, ఆర్థికశాఖను సోషలిస్టు సభ్యుడైన క్రిస్టియన్ పినోవ్‌కు అప్పగించాడు.

ద్వితీయ సంగ్రామంలో ఆర్థికంగా, సైనికంగా సంపూర్తిగా చితికిపోయిన యూరపియన్ రాజ్యాలలో ఫ్రాన్సు ఒకటి. శక్తిసామర్థ్యాలు సంపూర్తిగా ఉడిగిపోయినప్పటికీ, ఆంతరంగిక ఆర్థికసంక్షోభం చెలరేగుతున్నప్పటికీ ఫ్రాన్సు తన పాత సామ్రాజ్యకాంక్షను మాత్రం వదులుకోలేకపోతున్నది. ఇండోచైనాలో స్వాతంత్ర్యోద్యమాన్ని అణచివేసి తన సామ్రాజ్యాధిపత్యాన్ని సుస్థిరంగాకాపాడుకోడానికి అక్కడ జాతీయవాదులపై నేటికీ సాగిస్తున్న యుద్ధమే ఇందుకు ప్రబల నిదర్శనము.

యుద్ధానంతర పరిస్థితుల కారణంగా అసలే అధ్వాన్నంగా వున్న ఫ్రాన్సుఆర్థికస్థితి మరీ అధ్వాన్నం కావడానికి ఇండోచైనా యుద్ధ నిర్వహణకోసం చేస్తున్న అపారధనవ్యయం ఒక కారణం. ఇండోచైనాజాతీయవాదులతో ఒక పరిష్కారానికి వచ్చి, అక్కడ పరిపాలనా బాధ్యతలను వదులుకోనంతకాలం ఫ్రాన్సుకు ఈదుస్థితి తప్పదు.

మంత్రివర్గ అస్థిరపరిస్థితులను సాకుగా తీసుకొని స్వతంత్ర రిపబ్లికన్ పక్షసభ్యులు, డీగాల్ పక్షంవారు ప్రస్తుత ఫ్రెంచి శాసనసభను రద్దుచేసి కొత్త ఎన్నికలు జరపడం అవసరమని కోరుతున్నారు. కమ్యూనిస్టు సభ్యులను కూడా చేర్చుకోనిదే ఏ పార్టీనాయకుడూ స్థిరమైన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయలేదు. ఈ పరిస్థితులలో షూమన్ స్థాపించిన నూత్నమంత్రివర్గం ఎన్నిరోజులు పని చేయగలదన్నది సందేహాస్పదమైన విషయం.

స్థిరమైన మంత్రివర్గం లేనంతకాలం ఫ్రాన్సు ఆర్థికస్థితి అధ్వాన్నంగా వుండాక మానదు. ఏ మంత్రివర్గమూ పట్టుమని పది నెలలైనా పని చేయడానికి వీల్లేకపోతే ఏ ఆర్థికపునర్నిర్మాణ కార్యక్రమాన్ని కొనసాగించగలదు? అందువల్ల సామ్రాజ్యకాంక్షను త్యజించడంతోపాటు, శాసనసభకు కొత్త ఎన్నికలు జరుపుకోవడం కూడా ఫ్రాన్సుకు అవసరమేనేమో.

* * *

పాలస్తీనా మధ్యవర్తి కౌంట్ బెర్నాడోట్ ఉభయపక్షాలకూ చేసిన హెచ్చరిక మొత్తంమీద కొంత ఫలితాన్ని చేకూర్చినట్లే ఈ వారం పరిణామాలు సూచిస్తున్నవి. యుద్ధ విరమణ షరతులను సాధించక పోతే ఐక్యరాజ్యసమితి అతి కఠినమైన చర్యలకు ఉపక్రమించ తీరుతుందని బెర్నాడోట్ పంపిన హెచ్చరిక కొంతవరకూ పనిచేసింది.

జెరూసెలం నగరంలో యుద్ధ విరమణకు ఉభయపక్షాలూ సమ్మతించినవీ, యుద్ధవిరమణ ప్రాంతాల్ని విస్తరింపజేయడమవుతుందనీ ఈ వారం అధికారప్రకటన వెలువడింది.

ఈ యుద్ధ విరమణ ఒప్పందం ఒక జెరూసెలం నగరానికి మాత్రమే వర్తిస్తుంది. జెరూసెలం విషయంలో ఒప్పందం జరిగినట్లు వార్త వచ్చిన ఉత్తర క్షణంలోనే ఉత్తర పాలస్తీనా అంతటా పెద్దఎత్తున యుద్ధచర్యలు యూదు అరబ్ పక్షాలమధ్య ప్రారంభమైనట్లు కూడా తెలియవచ్చింది. అరబ్ సేనలు సాగించిన ఎదురుదాడులలో యూదులకు విశేష నష్టాలు, ప్రమాదాలు సంభవించినవట. ప్రస్తుతం రోడ్స్‌దీవి కార్యాలయంలో మకాం వేసివున్న మధ్యవర్తి బెర్నాడోట్ అలెగ్జాండ్రియాకు వచ్చి అరబ్ రాజ్యప్రముఖులతో చర్చలు జరుపుతున్నాడు. తాత్కాలిక యుద్ధవిరమణను చేకూర్చినా మధ్యవర్తిగాని, ఐక్యరాజ్య సమితిగాని పాలస్తీనా సమస్యను ఏవిధంగా శాశ్వతంగా పరిష్కరిస్తుందో దురూహ్యం. పర్యవసానంగా విభజనే స్థిరపడవచ్చు; అందుకు అరబ్ రాజ్యాలు సమ్మతించడం ఏ దృష్టితో చూపినా అసంభవమనే తోస్తున్నది.

రాజయోగాలు

బ్రహ్మశ్రీ శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు

జ్యోతిశ్శాస్త్రంలో ఆయా గ్రహసంపుటినిబట్టి కొన్ని రాజయోగాలు వ్యాఖ్యానించబడ్డాయి. వాట్లలో వాహనయోగం ఒకవిధమైన రాజయోగం. గుఱ్ఱాన్ని యెక్కడం, గుఱ్ఱపు సారటు యెక్కడం, యెడ్లబండిని యెక్కడం యివన్నీ వాహనయోగాలేకాని, తుట్టతుదకి (యెడ్లు) కొంత లొచ్చు.

ఇవన్నీ చతుర్థస్థానాన్ని బట్టి నిర్ణయింపబడేవి. ద్వితీయాన్నిబట్టి కాబోలును, కొన్ని రాజయోగాలు వ్యాఖ్యానించబడ్డాయి. అవి భోంచేసే పాత్రకు సంబంధించి వుంటాయి. ఆ పాత్ర వెండిదా? బంగారుదా? అనే విచారణకు సంబంధించివుంటుంది.

ఆయీ రాజయోగం మొత్తం 'యావగేదీ'ని యివి అన్నీ ధనసంపత్తిని సూచిస్తాయన్నమాట. "స్వర్ణసుదర్యో విస్సనమంత్రి మఱి హేమపాత్రాన్న మెవ్వానిపంక్తిగలదు." (శ్రీనాథుడు)

ఇప్పుడు నిర్దేశించిన రాజయోగాలు గుఱ్ఱంతోటీ, యెద్దుతోటీ, వెండితోటీ, బంగారంతోటీ సంబంధించివున్నాయి. పల్లకీతోటీ సవారీతోటీ, సంబంధించినవి కూడా యిట్టివే కాని వాట్లని నరవాహనా లంటారు.

"కుబేరో నరవాహనః"—ఉత్తరదిక్కును పరిపాలించే వ్యక్తి కిది పేరుగా వుంది. అయితే వారిద్వారంకాక యింకా పైన వున్న యాత్రలు (గంగోత్రివగైరా) సేవించేవారిని చిక్కంలో యిముడ్చుకుని దర్భాసనంలాగ బుజంమీద పెట్టుకొని ఆటవికులు గమ్యస్థానం చేర్చడం వుంది గాని యీ యాత్రికులకు 'నరవాహన' పదం వర్తించడం లేదు. కారణం— యిది క్వాచిత్కం కావడమే అనుకోవాలి.

అయితే, కుబేరుడుమాత్రం నరవాహనపదానికి అధికారిగా గ్రంథాలలో వాడబడడానికి కారణం, పూర్వకాలంలో యీ మహాయోగం అతనికిమాత్రమే వుండే దనుకోవాలి. ధనవంతు లంటే వుండవచ్చుగాని, పల్లకీలో యెక్కి సంచరించడానికి వొక్క ధనంమాత్రం చాలదు. యింకా యేవో కొన్ని విశేషాలు వుండాలి. దీన్నిగుఱించి వ్రాయడానికి వుపక్రమిస్తే డొంకంతా కదులుతుంది. గురుజాడవారు (శ్రీరామమూర్తిగారు) 'రాజయోగి' అనే పత్రిక నా చిన్నతనం (మా కాకినాడశతావధానం రోజులలో) లో ప్రచురించేవారు. ఆ మాసపత్రికలో అప్పటికి పూర్వం రాజ్యం పాలించిన రాజుల రోజులలో పల్లకీ యెక్కడానికి అర్హత యేయే కులాలకి వుందో, యేయే కులాలకు లేదో ఆ పత్రిక వొక మాసం ప్రత్యేకించి వ్యాఖ్యానించింది. నిమ్నజాతులలో అరుదుగా ధనాఢ్యు లుండి, వాళ్లు శుభశోభనాలల్లో పల్లకీ యెక్కవలసి వస్తే రాజుగారి అభ్యనుజ్ఞ లేనిపక్షంలో మోసే జాతివాళ్లు మోయరు.

మన మద్రాసు రాజధానిలో సవారీలుగాని, పల్లకీలుగాని మోసే జాతులు సుప్రసిద్ధంగా రెండు మూడు (చాకలి, సెట్టిబలిజీ, బెస్త) మాత్రమే వున్నాయి. కలకత్తా ప్రాంతంలో యీ వృత్తి హరిజనులదిగా వున్నట్టు మా పరమ గురువులు చెప్పగా విన్నాను. ఆ పక్షంలో అస్పృశ్యత యెందుకు అడ్డు తగలలేదో ఆ విచారం ప్రస్తుతం కాదు.

కాశీలో పెండ్లికూతుర్ని, పెళ్ళికొడుకునీ వూరేగించడం గుఱ్ఱంమీద. ఈ సందర్భం జగత్పండితులు శ్రీ ద్రావిడ సుబ్రహ్మణ్యశాస్త్రుల వారి కొమార్తెవివాహంలో స్వయంగా చూచాను. పల్లకీ లంటే, జోడు కాగడా లంటే, సింహతలాటం మురుగు లంటే, యివన్నీ హైకెన్సు లేనిదే ఆ కాలంలో యెవళ్ళూ పెట్టుకోవడం అపరాధం.

ఒక మోతుబరు రైతు కొడుకు జోడు కాగడాలు పెట్టుకొని యేదో శుభసందర్భంలో వూరేగుతూవుంటే రాజభటులు అటకాయించి "నీ కివి యెవరిచ్చారు?" అని ప్రశ్నించడమూ, దానికి ఆ సంపన్నుడు ముక్కురంగా జవా బివ్వడమూ సుప్రసిద్ధం. "ఎవ డిచ్చె జోడుకాగడ లవనీతుడ, నీవు వనిన—ఆముదపుంటే నివి యెపగె........" (గీరతం చూ.)

ఈ సందర్భంలో తూ॥ గో॥ డి॥ యానాం (ఫ్రెంచిటవును) లో నేటికి సుమారు తొంభై యేళ్ల నాడు జరిగిన మానాటి గత్తరను కూర్చి నేను నా బాల్యంలో వినివున్నాను. అది యావత్తూ పల్లెజాతి పల్లకీ యెక్కడానికీ, ఆ వూరి కాపదనం అంగీకరించకపోవడానికీ సంబంధించినదే. పల్లెజాతిలో యానాంలోనేకాక ఆ చుట్టుపట్ల గ్రామాలలో (నీలపల్లి, తాళ్ళరేవు, కోరంగివగయిరా) క్వాచిత్కంగా ఐశ్వర్యవంతు లున్నారు. కాపదనం తమ్మి బాధించకుండా ఫ్రెంచిప్రభుత్వాన్ని మద్దతు తీసుకొని వూరేగింపు సాగించడం మొదలెట్టేప్పటికీ, ఆ వూరేగింపు తమకు అవమానంగా యెంచుకొని యానాంకాపులు తలుపులు తెఱవక యెవరి యిళ్ళల్లో వారు వుండిపోయారు. కొన్ని వేల మరకాళ్లు (అగ్నికుల క్షత్రియులు) పండి, పోర, తీరాలమొండి వగైరా సముద్రతీరస్థ గ్రామాలనుండి వచ్చి ఆ వూరేగింపులో పాలుగొన్నారు. ఆ వైభవం చూచి తీరవలసిందే. అని నేను 12 యేళ్ళ వయస్సులో వుండగా ఆ యుద్ధంలో నాయకులుగా వుండి ఫ్రెంచిగవర్నమెంటుచేత శిక్షింపబడి విడుదలయి వచ్చిన కాపుల తాలూకువారు చెప్పగా విన్నాను. గ్రామమంతా పోలీసుసహాయంతో వూరేగి అంతతో ఆగితే, భవిష్యత్తులో వ్రాయబోయే చిక్కు వచ్చేది కాదు. శివారు గ్రామం, కనకాలపేట (మానాటి కాపులు కొంతమంది వుండే గ్రామం) కూడా వూరేగడానికి పెట్టుకున్నారు. గ్రామంలో కాపులు యేమీ కలగజేసుకోలేదుగదా! యిక పల్లెటూరి వూరేగింపుకు మన సహాయం యెందుకని పోలీసు సిబ్బంది తప్పుకున్నారు. ఆ గ్రామందగ్గఱ వొక కోడు (సహజమైన యేరు) వుంది. అది దాటితే కాని వూళ్ళో ప్రవేశం వీలుపడదు. ఆ కోడు రమారమీ అర్ధఫర్లాంగు వుంటుంది. అక్కడక్కడ అందకపోయినా దాని గుట్టూమట్టూ తెలిసి కొంచెం యీత చేతనైనవాళ్ళకు దిగి వెళ్ళడానికి అభ్యంతరం వుండదు. యెఱగనివాళ్లకయితే (వూళ్ళోవాడికి కాటిభయం పొరుగూరివాడికి నీటిభయం) మోసం తెస్తుంది. ప్రస్తుతం దాన్ని దాట తలచిన మఱకాళ్లు "గోష్పదీకృతవారాశిం" బాపతుకు దాని లక్ష్య మేమిటి? దిగి నడుస్తూవున్నారు.

ఇక్కడ వొక మాట వ్రాయడం జ్ఞప్తిలో నిమిషం కింద ఉన్నదే యెందుకో మఱిచాను. వాగర్థం పాపాలకల్లా పైరవుడుగా వుంది కదా? దానికింద జమకట్టుకో గోరుతాను.

గ్రామంలో నా కావ్యవిద్య ("రఘువంశము భుజంగరాడ్గురుసన్నిధి నింపుమీఱగ బఠియించి నాడ" గీరతం చూ.) ప్రథమగురువులు శ్రీ కానుకుర్తి భుజంగరావుపంతులవారి గ్రామం కూడా ఆ కోడువొడ్డునందే వుండడంచేత ప్రతిదినం రాకపోకలలో దిగి వెళ్ళవలసివచ్చేది. పుస్తకం (రఘువంశం) కొల్లాయితో నెత్తికి కట్టుకొని (అవసరమైతే యీదగలం గదా అని) దిగి వెళ్లేవాణ్ణి.

సరే, ప్రకృతం మత్స్యజీవులు కోడుదగ్గఱకు రాకపూర్వమే మహాప్రవాహంగా వస్తూవున్న మరకాళ్ళను చూచి భయపడి కాపులు (స్వల్పసంఖ్యాకులు) వొక వుపాయం చేశారు. జనపనార తీసిన కట్టెలు కోడువొడ్డున రెండుగజాల పొడుగున కొన్ని మోపులు కట్టి దానిమీద తెల్లటి బట్టలు పరిచి వసంతం చల్లి ఆయుధపాణులై వాట్లదగ్గఱ నిల్చివున్నారు. ఆ సమయానికి చిదపచిదప చీకటి తోడ్పడి మఱకాళ్లు ఆ జనపనారకట్టెమోపులు తమ తాలూకు జనం కాపులచే చంపబడ్డ శవాలుగా భ్రమించి సుమారు రెండు మూడు ఫర్లాంగులమేరలో దక్షిణదిక్కున వున్న గౌతమిని యీదుకొని, వొకడు పోయిన తోవ వొకడికి తెలియకుండా "జెట్టుకొకరు దై" ప్రాణాలు దక్కించుకుని పాఱిపోయారు. అక్కడ గౌతమి, ధవళేశ్వరం వద్ద వున్నంత కాకపోయినా వొక మైలుకు తక్కువ వుండదు. వాళ్లుగనక ప్రాణాలతో అవలివొడ్డు చేరుకున్నారుగాని యింక యెవళ్ళైనా అయితే 'నదీనాం సాగరో గతిః' కావలసిందే.

కాపులు చేసిన యీ వుపాయం బలిష్ఠులూ, అధికసంఖ్యాకులూ అయిన అగ్నికులక్షత్రియులను యీవిధంగా పాఱదోలిన తరువాత యిక వూరేగింపులో మిగిలినసరకు, (1) పెళ్ళికూతురు —(2) పెండ్లికొడుకు, వీరెక్కిన పల్లకీ, (3) పల్లకీబోయీలు (4) పెండ్లివారి ముఖ్యబంధువులు—యింతకు మించి లేరు. వీళ్ళని కనగాలపేటకాపులు జయించడాని కేముంది. గొఱ్ఱెల మందను తోలినట్లు అసలు గ్రామానికి తోలుకువెళ్ళేటంతలో గ్రామంలో వుండే ప్రముఖులు కలిశారు. పల్లకీ విఱిచారు. శివాలయంవద్ద వున్న గోదావరిత్రూములో వూరద్రొక్కి నానా హంగామా చేసి అగ్నికులస్థుల యిళ్ళలో జొరబడి కొల్లగొట్టినట్లు చెప్పగా విన్నాను.

ఆ మహాకోలాహలం ఆపడానికి గవర్నమెంటు శాయశక్తులా ప్రయత్నించినా కృతకృత్యం కాలేక తుదకు బ్రిటిషుగవర్నమెంటుకు తంతి నివ్వడం జరిగిందనీ, కాకినాడనుంచి పటాలం వచ్చేలోపున గ్రామందరిని వున్న వుప్పుటేటిలో వున్న తోట్టిపడవలూ, వేటనావలు వగయిరాలన్నీ చిల్లులుగా కొట్టి రాకుండా కొంత ఆపినా చుట్టుపట్లనుంచి కొన్ని నావలవాళ్ళు తమ నావలతో సహాయం చేసి పటాలానికి గ్రామప్రవేశం కలిగించినట్టూ తరవాత మానాటి కాపులలో ప్రముఖులైనవారిని అరెస్టుచేసి శిక్షించి నట్లు (కొన్ని యేళ్ళు) చెప్పగా విన్నాను.

దీన్ని మానాటి గత్తర అని చెప్పుకుంటారు. దీనికి నాయకులుగా వుండే వారిని మానాటి కాపు లనిన్నీ చెప్పుకుంటారు. యిదంతా జ్యోతిషానికి సంబంధించిన రాజయోగాంతర్గతమైన వాహనయోగాల ప్రస్తావనలో ప్రసక్తాను ప్రసక్తంగా అజతగిలింది.

రైళ్లూ, మోటార్లూ, బస్సులూ, యింకా యెయిర్ ప్లేన్లూ, కుప్పతెప్పలు అగర్భశ్రీమంతుడి దగ్గఱనుంచి శుద్ధగర్భదరిద్రుడుదాకా సులభసాధ్యంగా వున్న యీ రోజులలో గుఱ్ఱపు సారటు యెక్కే సంపన్నగృహస్థుకొడుకు జాతకం చూచి యీ జాతకానికి వాహనయోగం వుందని చెపితే అపహాస్యాస్పదంగా వుంటుంది. యెందుచేత? యీ వాహనయోగం రైలు, మోటారు వగైరాల ముందఱ దివిటీకింద దీపం వంటిదికూడా కాకపోవడంచేత; ప్రస్తుత ప్రపంచం అనేకవిధాల మార్పుచెందడంచేత. పూర్వకాలం ఋషులుగాని, యిటీవల కర్తల్యెలుగాని వ్రాసిన సందర్భాలు కొన్ని మార్చవలసినట్లు తోస్తుంది. పైని వుదాహరించిన కారణమే కాక పర్యాలకూ లక్ష్యపడే సందర్భాన్ని రాజయోగంగా చెప్పడంలో విశేషం లేకపోవడం కూడా వొక కారణమే.

ముఖ్యంగా పల్లకీగాని యెక్కవలసివస్తే బోయీల చిక్కు కొంత వుంది. అది యీ కింది గాథవల్ల గోచరిస్తుంది. జాతకచక్రంలో దానికి తగిన గ్రహసంపత్తి వున్నా బోయీలు వ్యతిరేకిస్తే ఆ యోగం ఫలించదు. యానాంసమీపం నీలపల్లెలో శ్రీ సీతారామస్వామివారికి ప్రతియేటా జరిగే కళ్యాణోత్సవాలు మన జిల్లాలలో యెక్కడా జరగవు. వొక్కొక్క వాహనం యెత్తడానికీ, మోయడానికీ అధమం అఱవైమందిదాకా బోయీలు వుండాలి. ఆ గ్రామంలోనూ, చుట్టుపట్లా వున్న సెట్టిబలిజీలు ఆ వాహనాలు మోయడం రివాజు. ఆ బోయీలకూ, భోగాలకూ తగాయిదా వచ్చి వాళ్ళు మేము మోసేదిలే దన్నారు. తగాయిదా యేమిటంటే: స్వామివారి తీర్థప్రసాదాలు అంతకుపూర్వం చాతుర్వర్ణ్యంవారి కిచ్చి, తర్వాత కళావంతుల కిచ్చి తరవాత యీ బోయీలకు యివ్వడం రివాజుగా వుండేది. యెవరో బోయీలకు మీరు చాతుర్వర్ణ్యంతర్వాత యిస్తేతప్ప అన్యథా యిస్తే పుచ్చుకోవద్దని వుపదేశించారు. ఆ మంత్రం తలకెక్కి బోయీలు భీష్మించుకొని కూర్చున్నారు. భోగాలు పట్టుపడితే మఱివొక మేళంవల్లగాని, లేదా, మేళం లేకుండాగాని ఆ వుత్సవం నెఱవేఱుతుందిగాని, బోయీలు భీష్మించుకని కూర్చుంటే యింకో జట్టు కొత్తగా వస్తే ఆ కార్యం నెఱవేఱదు. ఆ వాహనాల సామగ్రి వొక బంగాళా అంతవఱకు వుండేది. ఆ స్వామివారి అలంకారం స్వామివారి అర్చకసోదరులలో పెద్ద సీతారామాచార్లగారు చేసేవారు. ఆయన పుట్టంధుడు కాని, యేలాగు అలవడిందో ఆ స్వామిని అలంకరించే శక్తి అనన్యగోచరం! యే కంచివరదరాజస్వామి వారికేనా ఆవిధమైన అలంకారం వుంటుందేమో కాని, మన దేశంలో యితరత్ర వున్నట్టు లేదని ఆశ్చర్యంగా చెప్పుకునేవారం. నేను చిన్నతనంలో ప్రత్యక్షంగా ఆ కళ్యాణోత్సవాలను వీక్షించినవాణ్ణే. క్రమంగా అవి యిప్పుడు లోపించాయి. ముక్కామల జోగయ్యగారు అనే పుణ్యపురుషుడు స్వశక్తిచేత ఆర్జించిన ధనం వెచ్చించి ఆయీ పుణ్యకార్యం యేటేటా సాగించేవారు. యీ పుణ్యకార్యమే కాదు, యింకా యేవేవో పుణ్యకార్యాలు 'గోవిందద్వాదశి' వగైరాలు చేయడం నేను స్వయంగా యెఱుగుదును. గోవిందద్వాదశికి చేసిన సంతర్పణ అన్నిపిండివంటలూ 12 లెక్కను వుండే నియమం. అప్పుడు నేను ఆయనవద్ద సంగీతసంపాదనకు శుశ్రూష చేస్తూ వున్నాను. ఆయన యావత్కాలబ్రహ్మచారిగా వుండి, యీవిధమైన పుణ్యకార్యాలు చేస్తూ వుండేవారు. సేవమోళాసంగీతంలో ప్రవీణులు, పౌరాణికులు. యేదో కొంత పూర్వజన్మలేశం వుంటేనే కాని, యిలాంటి పెద్దల శుశ్రూష లభించదు. (సశే) రాజయోగప్రకరణం ఆరంభించి జాతకగ్రంథాలలో ప్రకృతకాలాన్ని అనుసరించి మార్పులేమో దైవజ్ఞులయిన విజ్ఞులు పరికింపగలరు. అని స్వస్తిచెప్పడం చదువరులు నా శక్తిలోపంగా తెలిసికొని సహింపగలరు.

పశువుల దివాణం

మూలం : జార్జి ఆర్వెల్

ఊహాకల్పితమైన

పెద్దకథ

అనువాదం : శ్రీ జనమంచి రామకృష్ణ

రహీతాపురంజమీందారు వెంకన్నదొరగారు ఎప్పుడూ బస్తీలలోనే మకాం చేస్తూంటారు. తమ ఖర్చుకి డబ్బు కావలసివచ్చినప్పుడుమాత్రం, చుట్టపుచూపుగా రహీతాపురం రావడం, బేరసారాలు చూసుకుని, వచ్చినంతా రాబట్టుకుని, మళ్లా పట్నం వెళ్లిపోడం అలవాటు.

జమీందారుగారి దివాణంమాత్రం ముసలి రత్తయ్య, ఎంతో జాగ్రత్తగా, వెయ్యికళ్లతో కాపాడుతూ కాలం గడుపుతున్నాడు. ఏపనైనా స్వంతంగా చేసుకునేవాడుగాని పాలేరాళ్లమీదగాని, దివాణం నౌకర్లమీదగాని వదిలిపెట్టడు.

ఆ వేళ రాత్రి రత్తయ్య అలవాటుచొప్పున, దివాణంతలుపులూ అవీ జాగ్రత్తగా గడియలు వేసి, పశువులూ, ఇంకా ఇతర పెంపుడు జంతువులూ ఉండే సావిడిలోకి వెళ్లి, అన్నిటికీ పాలేరాడు మేతా, నీళ్లూ సరిగ్గా పెట్టిందీ లేందీ చూశాడు. ఎప్పట్లాగే ఎవరి పనులు వారు చేశారని గ్రహించి, నిద్రపోయేందుకు తన గది చేరుకున్నాడు. దీపం ఆర్పి రత్తయ్య నిద్రపోయాడు.

రత్తయ్య పడకగదిలోని దీపం ఆరిపోవడం పశువుల సావిడిలో కొంత అలజడి కలిగించింది. దివాణంఅవతల ఉంటూన్న యోకలగూడెంలోని ఒక ముసలిపంది క్రితంరాత్రి విచిత్రమైన కల గన్నట్లూ, ఆ కలనుగురించి తాను దివాణంజంతువులకి తెలిపేందుకు ముచ్చటపడుతూన్నట్లూ వార్త వచ్చింది. రత్తయ్య నిద్రపోగానే జంతువులన్నీ కల వినేందుకుగాను పశువుల సావిడిలో విడిది చేసేందుకు నిశ్చయించాయి. ముసలిపంది అంటే దివాణంజంతువులకి ఎంతేనా గౌరవం. పంది చెప్పబోయే సందేశమేమిటో, కన్న కల యేమిటో తెలుసుకుందామని, జంతువులన్నీ దాని రాకకోసం నిరీక్షిస్తున్నాయి. పందిసందేశం వినేందుకు జంతువులన్నీ ఒక గంట నిద్రకూడా త్యాగంచేసేందుకు నిశ్చయించాయి.

పంది వచ్చి పశువుల సావిడి కోమూలగా ఉన్న తిన్నెమీద కూర్చుంది. దాని వయస్సు పన్నెండు సంవత్సరాలు. వార్ధక్యం వచ్చినా, బాగా లావెక్కినా, ఆ దర్జా, ఆ హుందాతనం మాత్రం దానిని విడిచిపోలేదు. తెలివి కళ్లల్లో తళుక్కుమంటూంది. జంతువులన్నీ సమావేశమవడం ప్రారంభించాయి. మొట్టమొదట వచ్చినవి మూడు కుక్కలు. తర్వాత పందులు. అవి ఆ తిన్నెకిందగా గడ్డిలో కూర్చున్నాయి. కోళ్లు వచ్చి పశువులసావిడికిటికీ కమ్మలమీద కూర్చున్నాయి. పావురాలు సావిడికప్పుకమ్మీలమీద కూర్చున్నాయి. గొర్రెలూ, మేకలూ, ఆవులూ, గేదెలూ పందులవెనకగా నడుం వాల్చి నెమరు వేయడం మొదలెట్టాయి. గుర్రాలు రెండూ—పంచకల్యాణీ, జాకీలు—నెమ్మదిగా లోపలికి నడిచి వచ్చి, ఒకసారి సావిడంతా పరకాయించి చూసి నిలబడ్డాయి. గుర్రాల వెనకాతలే పెంకితనంగా నడుస్తూ కోడెమూడ సింహాచలం వచ్చింది. ముసిలితాంబోతు వెంకన్నకూడా ఆ వింత చూద్దామని వచ్చిరది. దివాణంలోని జంతువు లన్నిటిలోనూ ముసలి దీ వెంకన్న. ముసలితనంతో పాటు చికాకూ, నిరాశా బాగా అలవాటుచేసుకుంది. వెంకన్న ఎప్పుడూ నోరు విప్పి మాట్లాడదు. ఒకవేళ ఎప్పుడేనా మాట్లాడితే ధ్వనించేది నిరాశే. దేముడు తోక యెందుకిచ్చాడంటే, ఈగలు వాలకుండా తోలుకుందుకంటుంది. పైగా యెప్పుడో ఒకప్పుడు, అతోకా ఉండదు, ఈ ఈగలబాధా ఉండ దంటుంది. తక్కిన జంతువులతో కలిసి ఒక్కనాడేనా కులాసాగా వెంకన్న కాలంగడిపి యెరగదు. కాని పంచకల్యాణితోమాత్రం అతిస్నేహంగా ఉంటుంది. వెంకన్నా, పంచకల్యాణీ కలిసి మేత మేసేందుకు పోవడం కద్దు.

రెండు గుర్రాలూ నడుం వాల్చాయో లేదో, కూర్చునేందుకు స్థలం వెదుకుతుంటూ, అడ్డదిడ్డపు నడకలతో బాతులు లోపల ప్రవేశించాయి. వాటికి జాకీముంగాళ్ళ గిట్టల మధ్య స్థలం దొరకగానే, అక్కడ చేరి బాతులన్నీ నిద్రపోయాయి. హడావిడి చేసుకుంటూ, జమీందారుగారి ముద్దులగుర్రంపిల్ల పంకజాక్షి కలకండ తింటూ లోన ప్రవేశించింది. పంకజాక్షి మల్లెపూవులా తెల్లగా ఉంటుంది. మెడ చుట్టూ, తలకీ ఎర్రటి రిబ్బనులు కట్టుకుంది. అన్నిటికంటె ఆఖర్న పిల్లి వచ్చింది. వెచ్చటి స్థలంకోసం వెతికి, చివరకు జాకీ, పంచకల్యాణీలమధ్య ఇరుక్కుని, అది వెచ్చగా నిద్రపోయింది. ముసలిపంది ఉపన్యాసాన్ని మాత్రం సరిగ్గా వినకుండా, మధ్యమధ్య 'మ్యావ్' మంటూ గొడవ చేయడం మొదలెట్టింది.

రావలసిన జంతువులన్నీ వచ్చి సమావేశం అవడం చూసి, ముసలిపంది నిలబడి గొంతు సవరించుకుని—

"నేస్తాలూ! నేను నిన్నరాత్రి కన్న కలను గురించి మీరంతా వినేవుంటారు. ఒకవేళ అందరూ వినకపోయినట్లైతే ఆ కలనుగురించి తర్వాత విన్నవిస్తాను. అంతకంటే ముఖ్యమైన విషయం చెప్పదలచుకున్నాను. నేను ముసలిదాన్నైపోయాను. అట్టేకాలం మీ అందరితోనూ ఉండ ననుకుంటాను. కాని, నేను చనిపోయేముందు, నా పన్నెండేళ్ల జీవితానుభవాన్ని చెప్పదలుచుకున్నాను. నా జాతికి నేను చేయవలసిన సేవ అంతమాత్రమే. నా గుంటలో పరుండి ఇంతకాలం ఒకే విషయాన్నిగురించి దీర్ఘంగా ఆలోచించాను. చివరకు ఆ రహస్యం తెలిసింది. నా చిరంతనసాధన ఫలించింది. జీవితరహస్యం తెలుసుకున్నాను.

"నేస్తాలూ! మన జీవితరహస్య మేమిటి? ఈ ప్రశ్నకి సమాధానం గ్రహించామంటే, మన మూగజీవాలలో చైతన్యం కలిగిందన్నమాటే. సావధానంగా వినండి! మనలో ప్రాణ ముందా? మనం జీవిస్తూన్నది ఒక జీవితమేనా? ప్రాణికోటిలోకల్లా, నీచంగా కాయకష్టపడి, పూర్ణాయుర్దాయానికి నోచుకోకుండా, మనం తినువులు చాలిస్తున్నాము. సమస్తప్రాణికోటిమాదిరిగానే మనమూ పుట్టాము. కొనఊపిరితో బ్రతికేటంతమట్టుకే, మానవులు మన కింత తిండి పెడుతున్నారు; ఇంక మనలో బలిష్ఠు లున్నారు. వారిచేత, ఎముకలు విరిగిపోయేంత పని చేయిస్తున్నారు. మన మేమీ యంత్రాలం కాము. మనకీ నోరూ, ముక్కూ, చెవులూ—సమస్త ఇంద్రియాలూ వున్నాయి. కాయకష్టంతో త్వరితంగా, మనకి వార్ధక్యం సంప్రాప్తమౌతూంది. వార్ధక్యదశలో వారు మన మొహం చూడరు. మన బ్రతుకులు వారికి ఎందుకూ పనికిరాని బరువైపోతున్నాయి. అప్పుడు, వచ్చిన కాడికి మనని కసాయివానికి తెగనమ్మివేస్తున్నారు. ఒక్క జంతువుకైనా సుఖమంటే యేమిటో తెలుసునా? జంతువుకి సంవత్సరం వయస్సు రావడం తడవుగా, అది సుఖానికీ, విశ్రాంతికీ దూరమైపోతూంది. అన్నిటికన్నా, స్వతంత్రంగా జీవిస్తూన్న ఒక్క పెంపుడు జంతువుని చూపండి! ప్రతి పెంపుడుజంతువూ, స్వాతంత్ర్యం పోగొట్టుకొని హేయమైన మనగడ సాగిస్తూంది. దాస్యశృంఖలాబద్ధులమై ఉన్నాము మనమంతా!

"తోటిజీవి కిది తగునా? భగవంతుని దృష్టిలో అందరూ సమానులే! మన దేశం రత్నగర్భ; శ్యామలసస్యభరితమైనది. అటువంటి దేశంలో ఉన్న ప్రాణికోటి ఎందుకు సుఖ మనుభవించడం లేదు? నేస్తాలూ! మన దేశం మాట అటుంచి ప్రస్తుతం ఈ జమీందారు దివాణం చూడండి. ఈ ఒక్క జమీందారీ మీదా పన్నెండు గుర్రాలూ, ఇరవై ఆవులూ, పాతిక గేదెలూ, వందలకొద్దీ మేకలూ గొర్రెలూ—తదితర జంతువులూ సుఖంగా బ్రతకవచ్చును. అటువంటప్పుడు, ఈ దాస్యపు జీవితం ఎందుకు గడపాలీ అంటాను! కారణం తెలుసా? మనం, ఎముకలు చిట్లంకట్టేలా పనిచేయడం, ఆ ఫలితమంతా మానవులు అనుభవించడం జరుగుతూంది. ఈనాడు మనం అధోగతిపాలైనామంటే, మానవులే కారకులు. మనకు మానవుడు శత్రువు. మానవునితో సంబంధం తెంచుకున్నామంటే, ఆకలికీ, కాయకష్టానికీ స్వస్తి చెప్పామన్నమాటే!

"కష్టపడకుండా కడుపు నింపుకునేది మానవు డొక్కడే! మానవుడు పాలివ్వడు; గుడ్లు పెట్టడు; అరక కట్టుకు దున్నడానికి దుర్బలుడు; జోరుగా పరుగెత్తలేడు;—ఇన్ని దౌర్బల్యాలతో, మన జంతుజాలంమీద అతను ఆధిపత్యం వహిస్తున్నాడు. జంతువులచేత పని చేయించుకుంటున్నాడు. మలమల మాడి చచ్చిపోనంతమట్టుకే ఇంత తిండి పెడుతున్నాడు. మిగతా ఫలాదాయమంతా స్వంతానికి ఉంచుకుంటున్నాడు. మన కాయకష్టం మూలాన్నే భూమి సాగు అవుతూంది; మనం విసర్జించే మలమూత్రాదులు పొలాలకి మంచి యెరువౌతున్నాయి. ఇంత కష్టపడి మనుగడ సాగించినా, మనం కడుపు మాడ్చుకునే జీవిస్తున్నాము. సోమరి ఐన మానవునికోసం మనం ఎందుకు కష్టపడాలంటాను? మీలో ఒక్కరికైనా 'నాది' అని చెప్పుకోదగ్గ ఒక్క సెంటు భూమైనా ఉందా? చివరకు మీరు నడుం వాల్చి పడుకునే మేరకూడా మీది కాదు. నా ఎదురుగుండా ఉన్న ఓ ఆవులూ! గేదెలూ! మీరు క్రితం సంవత్సరం ఎన్నివేల కుంచాల పాలిచ్చారు? ఆ పాలతో మీ లేగల్ని పెంచుకోకుండా అన్ని పాలూ మానవుల కిచ్చారే. ఆ పాలన్నీ యేమైనాయి? ఒక్కొక్క పాల చుక్కా మన శత్రువుల గొంతులు తడిపింది. ఓ కోడిపెట్టలూ! మీరు ఈ సంవత్సరంలో ఎన్ని గుడ్లు పెట్టారు? ఎన్ని గుడ్లను పొదిగి పిల్లలకింద తయారుచేశారు? ఎన్ని మన శత్రువులు రొట్టలేసుకుంటూ మింగేశారు! అటువంటి హంతకులను ఏం చేసినా పాపంలేదు!

"మనలో యే జంతువైనా సరే, పూర్ణాయుర్దాయం అనుభవించిందా? నామాట ఆలోచించకండి. ఏదో అదృష్టంవల్ల ఇంత కాలం బ్రతికి ఒక నాలుగువందల పిల్లల్ని కన్నాను. తక్కినవాటి మాట? మామూలుగా ముసలితనం రావడం, మృత్యువువాత పడడం, ఎప్పుడూ ఏ జంతువూ యెరుగదు. ఏ జంతువూ, దానంతటది చచ్చిపోదు. మానవులు చచ్చిపోనివ్వరు. కత్తికి గురిచేస్తారు. మానవులు చంపుతారు. పందిపిల్లలూ! ఎలా నిశ్చింతగా నిద్రపోతున్నారో! అన్నం పున్నం యెరుగవు కదా! ఒక్కసంవత్సరమే వాటి ఆయుస్సు. తర్వాత, మానవుల కడుపులవాత పడతాయి ఒక్క పందు లేమిటి! సమస్తజంతువులూ కత్తికి యెరౌతాయి—ఎప్పుడో ఒకప్పుడు!

"మనం గడుపుతూన్న దరిద్రపు జీవితాలకి కారణం, కారకు లెవరో అర్థమయిం దనుకుంటాను. మనమంతా మానవుల నిరంకుశత్వానికి గురౌతున్నాము. మానవుని జోలి లేకుండా చేసుకోండి! అప్పుడు మనం పడిన కష్టానికి సేకూరిన ఫలితం మనదే దొరుకుంది. తలుచుకున్నామంటే, క్షణంలో మనం భాగ్యవంతులమై, స్వతంత్రులమై పోగలము! అయితే యేం చేయవలసివుంటుంది? రాత్రింబగళ్ళు నిద్రాహారాలు మాని, మానవజాతి పతనానికై పాటుపడాలి! నేస్తాలూ! అదే నా సందేశం! ఒక్కమాటలో చెప్పాలంటే—విప్లవం తీసుకురండి! ఆ శుభసమయం ఎప్పు డాసన్నమవుతుందో నాకు తెలియదు. ఒక వారంలో రావచ్చును; లేకపోతే ఒక శతాబ్దం పట్టవచ్చును. కాని ఒకటిమాత్రం నిశ్చయం: విప్లవం మాత్రం వచ్చి తీరుతుంది. నిరంకుశుడు అంతమొంది తీరుతాడు. మనకి న్యాయం జరుగుతుంది. అందుచేత మీరందరూ విప్లవాన్ని ఆదర్శంగా పెట్టుకోండి. అదే జీవితపరమార్థంగా భావించండి. మీమీ సంతతికి ఈ సందేశాన్ని అందజేయండి. విజయం చేకూరేవరకూ అలా, తరతరాలపాటూ మన సంతతి పోరాటం సాగిస్తూనే వుంటుంది.

"తర్వాత: మీ పట్టుదల సడలకూడదు. ఎవ రేమి చెప్పినా, విప్లవంనుండి మనస్సు మార్చుకోకూడదు. మానవులూ, జంతువులూ సమానభాగస్వాములనీ, ఒకరి సుఖమే రెండవవారి సుఖమనీ, మొదలైన తీపిమాటలూ, తర్కాలూ జరుగుతాయి. మానవుల మాటలు తేనెపూసిన కత్తుల వంటివి. అందుచేత, ఎప్పుడూ వారితో తర్కానికి దిగకండి. దిగినా, వారి మాటలు విని ఆదర్శాన్ని వీడకండి. ఇంక మనమంతా ఆదర్శప్రాయమైన ఐకమత్యంతో మెలగాలి, ఈ స్వాతంత్ర్యసమరంలో అందరం కలిసి నడుములు బిగించి పనిచేయాలి. మానవులంతా మనకు పరమశత్రువులు. జంతువులన్నీ ఒక కుటుంబానికి చెందినవి."

ఆ సమయంలో, జంతువులలో పెద్ద అలజడి కలిగింది. ముసలిపంది ఉపన్యాసం చాలించి "ఏమిటది?" అని ప్రశ్నించింది. అంతలో నాలుగు యెలకలు కలుగుల్లోంచి బైటకొచ్చి, వెనకాళ్లమీద కూర్చుని అధ్యక్షుని ఉపన్యాసం వింటూండగా, వాటికేసి కుక్కలు కోపంగా చూశాయి. ఎలకలు భయపడిపోయి తిరిగి వాటి కలుగుల్లో దూరిపోయాయి. అలజడికి కారణం గ్రహించిన ముసలిపంది మళ్లా మాట్లాడడం ప్రారంభించింది.

"నేస్తాలూ! ఒక ప్రశ్న నన్ను వేధించుకుతింటూంది. ఆ ప్రశ్న వేస్తాను. నా సంశయం తీర్చండి. అడవిజంతువులు—ఎలకలూ, కుందేళ్లూ మొదలైనవి—మన స్నేహితులా, లేక శత్రువులా? ఈ ప్రశ్నమీద సమాధానంగా ఓట్లు తీసుకుంటాను: మళ్లా వినండి: ఎలకలు మన నేస్తాలా?"

(16 వ పేజీ చూడుదు)

బర్మాలోని అశాంతి

మాండలేకు పోవుమార్గములో సంక్షోభము

ఆంధ్రా రాత్

ఆగ్నేయాసియాలో నెల్ల మహోన్నతమైన గగనచుంబిత సౌధమగు కాథేభవనమందు సింగపూరులో తన కార్యాలయములో కూర్చుండి మాల్కొం మక్డోనాల్డు బర్మాలోని పరిస్థితులను శ్రద్ధగా పరిశీలించుచున్నాడు. ఆగ్నేయాసియాలో బ్రిటీషు కమిషనరు జనరలుగా పని చేయుచున్న యితడు బ్రిటిషు సంరక్షిత రాజ్యములను బ్రిటిషు వలసరాజ్యాలను కనిపెట్టి చూచుచున్నాడు. ప్రస్తుతము విప్లవకారుల మయమైన, అమూల్యమైన మలయా రాజ్యమును కూడా ఆయన కనిపెట్టి చూచుచున్నాడు. అంతే కాదు, భాగ్యవంతమైనట్టియు, సంక్షోభసీమ యైనట్టియు ఆగ్నేయాసియాలోని బ్రిటిష్‌వారి రాజకీయ, ఆర్థిక, సైనిక వ్యవహారవిషయముల నన్నిటిని ఆయన అజమాయిషీ చేయవలసి యున్నది.

ప్రజలు లేవదీసిన జాతీయోద్యమముతో పూర్తిగా సమాధానపడి బ్రిటను తనకు గల సర్వాధికారమును వదలుకొన్నది. బర్మారాజ్యములో ఒక్క చోటమాత్రమే—అతివాదుల నుండి మితవాదులను చీలదీయుటకును, సైనిక ఆర్థికసంబంధమైన ప్రత్యేక సౌకర్యములను కొన్నింటిని పొందుటకును బ్రిటిషువారు పని చేసిరి. బర్మాను బ్రిటిషు సామ్రాజ్యంలో ఒక అధినివేశముగా ఉంచుట అసాధ్యమయ్యెను. ఎందుకలననగా, మితవాదులలో కూడా, ఉగ్రభావ గల సోషలిస్టు యువకులు చేరియున్నారు. బర్మాలో చాలా పెద్ద ఆస్తులు కలిగిన స్థిరపరులలో ఆంగ్లేయులు, భారతీయులు, చైనావారు ఉన్నారు. గత దశాబ్దములో 1935-39 సంవత్సరములలో బర్మాలో జాతీయోద్యమము ప్రారంభమైనప్పుడు, ఈ ఉద్యమము చాలా తీవ్రంగాను సమాధానావకాశము లేకుండాను సాగింపబడెను.

గత జనవరిమాసంలో బర్మా సర్వస్వతంత్రమైన ప్రజాప్రభుత్వరాజ్యమై బ్రిటిషువారితో లాంఛనమాత్రమైన సంబంధములనుకూడా తెంపుకొన్నది. అయినప్పటికీ, బర్మాలో ఆంగ్లేయులకు చాలా పెద్ద వ్యాపారవ్యవహార సంబంధములు కలవు. అయిరావతీ ఫ్లోటిల్లాకంపెనీ, బర్మా ఆయిలుకంపెనీ, ఇవి 10 కోట్ల పౌనుల పెట్టుబడితో పనిచేయుచున్న ఏకచ్ఛత్ర వ్యాపారాధికారం గల కంపెనీలు. ఇంగ్లండులో ప్రస్తుతము అధికారమందున్న కార్మికపక్ష ప్రభుత్వము డబ్బులాభాదాయములకై చాలా దాహంతో ఉంది. అందువల్ల యీ వ్యాపార సంస్థలను బ్రిటీషువారు వదలుకొనజాలరు.

బ్రిటనుకు బర్మాతో పరస్పర సైనిక ఒడంబడికకూడా ఒకటి కలదు. బర్మా ప్రభుత్వ సైన్యమునకు శిక్షణము నొసంగెడి హక్కు బ్రిటీషువారికే ప్రత్యేకముగా యివ్వబడియున్నది. యుద్ధావసరము వస్తే బర్మాలో సేనలను దింపుకొనెడి హక్కు బ్రిటిషువారికి యివ్వబడెను.

బ్రిటిషువారి పౌనుల ద్రవ్యమానంలో ద్రవ్యమారకమును చేసుకొనెడి దేశాలకూటంలో బర్మా చేర్చబడియున్నది. బర్మాలోని బ్రిటిషు వ్యాపారసంస్థలను బర్మా ప్రభుత్వమే వశపరచుకొని నిర్వహించుట సంభవించేయెడల న్యాయమైన పరిహారము నొసంగుటకు బర్మా ప్రభుత్వమువద్దనుండి బ్రిటిషువారు వాగ్దానమును పొందిరి. చాలా ప్రోత్సాహము నొసంగి, చేయూత నిచ్చుటవల్లనే బ్రిటీషు అధికారుల మూలంగా యీ సంవత్సరము బర్మాయొక్క బియ్యము ఎగుమతులు 15 లక్షల టన్నులవరకు హెచ్చింపబడెను యుద్ధానికి పూర్వము బర్మా నుంచి ఎగుమతియగుచుండిన బియ్యములో అది సగము వంతు. బియ్యం రవాణాలో ప్రపంచమంతటిలో అప్పుడు బర్మా అగ్రస్థానమును వహించియుండెను.

ఈ బియ్యంమూలంగా ప్రజల క్షుద్బాధ తగ్గుటయేగాక, రాజకీయ సంక్షోభమును శాంతింపచేయుటకుగూడా ముఖ్యావసరమై యున్నది. బర్మా బియ్యంలో నూటికి 20 వంతు మలయా తెప్పించుకొనుచున్నది. కాని యుద్ధానంతరము బర్మా బియ్యం మలయాకు కరవైనది. అందువల్ల మలయాలో గిరాకీ ఏర్పడి యుద్ధానికి పూర్వమున్న జీవితపు ఖర్చుకంటె 16 రెట్లుగా యిప్పటి జీవితపుఖర్చు పెరిగినది. ఈ రీతిగా జీవితపుఖర్చు పెరిగి మిన్ను ముట్టుచుండుటవల్ల ప్రజలలో అశాంతి ప్రబలినది. ఈ అశాంతిని పురస్కరించుకొని కమ్యూనిస్టులు దౌర్జన్యమార్గములలోనికి కార్మిక సంఘములను నడిపించుచున్నారు. సాయుధమైన విప్లవమును సాగించుచున్నారు. మలయాలో బ్రిటిషువారు తమ స్థావరము చెడకుండా నిలువబెట్టుకోవలెనంటే బియ్యం సమృద్ధిగా సప్లయి కావాలి. రూపాయలు కూడా ఎక్కువగా సప్లయి కావాలని బుద్ధిశాలురైన కన్సర్వేటివు పక్షమువారు గ్రహింపగలరు.

బర్మాలో ప్రారంభమైన కమ్యూనిస్టు విప్లవము నానాటికి వృద్ధియగుచున్నది. ఈ సంక్షుభిత బర్మాలో పైజెప్పిన బ్రిటీషు క్షేమలాభముల కన్నింటికి ఉపద్రవము వాటిల్లగలదు. కొత్త ప్రాంతాలు, కొత్తప్రదేశాలు, కమ్యూనిస్టుల వశమైనవి. రంగూనుకు 30 మైళ్ళలో నున్న అయిరావతీ నది డెల్టాలో చేరిన తాంగ్వ కూడా వారివశములోనికి వచ్చినది. రంగూనుకు పడమరగా 90 మైళ్ళలోనున్న బెస్సీను అను పెద్దరేవును కూడ వారు ఆక్రమించుకొనుటకు సిద్ధపడుతున్నారు. ప్రభుత్వసేనలలోని వారు కొందరు కమ్యూనిస్టులతో చేరబోవుచున్నారను వదంతులు వ్యాపించుటవల్ల ఆగస్టు 10 తేదిని రంగూనులో కర్ఫ్యూ ఉత్తర్వు అమలు పరచబడెను. సంవత్సరాలక్రిందట ఆంగ్‌సాను మరణించిన అనంతరము కర్ఫ్యూ ఉత్తర్వును అమలుపరచుట కిదియే మొదటిసారి.

బర్మాలోని రాజకీయ పరిస్థితులను సులభంగా అవగాహన చేసికొనవలెనంటే ఒక రహస్యమును తెలిసికొనవలెను. నడివయస్సులోనున్న, బ్రిటిషు అభిమానియైన యూటిన్ టూట్ తప్ప బర్మాలోని ప్రజాప్రముఖులగు నాయకులలో అధికసంఖ్యాకులు సోషలిస్టులైన యువకులు. వీరు సుమారొక పుష్కరము క్రిందట రంగూను విశ్వవిద్యాలయములో పట్టభద్రులైనవారు. వీరిలో వీరికి ఐకమత్యం చాలా తక్కువ. భిన్నాభిన్నంగా వీరిలో వీరు చీలిపోవడం వీరికి సహజతత్వం. పరమాణువుల విభిన్నవిచ్ఛేదన కూడా వీరిలో గల చీలికలకు సరిపోల్చుటకు చాలదు. ఇదివరలో సంగ్రామకాలమందు జపానువారికి సహాయము చేయవలెనా, అక్కరలేదా యను విషయమై వారిలోవారు చీలిపోయిరి. ప్రస్తుతము అధికారంలోనికి వచ్చిన సోషలిస్టులు మొట్టమొదట జపానువారికి తోడ్పడి సహాయంచేసి అటుపిమ్మట వారిని తరిమివేయుటకు పూనుకొన్నవారే. ప్రస్తుతము తిరుగుబాటు సాగించిన కమ్యూనిస్టులు మొదటి నుండియు జపానువారిని ఎదిరించి పోరాడినవారే

యుద్ధానంతరం బర్మాలో ఎక్కడచూచినను ఆయుధాలు సమృద్ధిగా లభించుచుండెను. బ్రిటిషువారిని ఎంత తీవ్రంగా ఎదిరించవలెను అనేవిషయంలో వామపక్షంలోనే రెండు భిన్నాభిప్రాయాలు విభేదాలు ఏర్పడి చీలికలు సంభవించెను.

ఎర్రజెండా కమ్యూనిస్టులు (ట్రాట్స్కీ పక్షీయులు) వెంటనే తిరుగుబాటు సాగించవలెనన్నారు. అరఖాను ప్రాంతములో ఆయుధాలతో తిరుగుబాటు సాగించిరి. తెల్లజెండావారు, అనగా (స్టాలిను పక్షీయులు) అగు కమ్యూనిస్టులుమాత్రము చలాకీ పురుషుడైన తమ యువకసేనానియగు జనరలు ఆంగ్‌సాను నాయకత్వముక్రిందను ఆయనయొక్క ఫాసిస్టు ప్రతికూల ప్రజాస్వాతంత్ర్య సమితి యాజమాన్యమునను బ్రిటిషువారిపై తిరుగుబాటు సాగించవలెనని వాదించిరి. అందువల్ల యీ తీవ్రజాతీయ వాదియగు అస్థిరుడైన యువకుని గూర్చి తెల్లజెండా కమ్యూనిస్టులును, బ్రిటిషువారును చ్వాలా ఘర్షణపడి బర్మాను సర్వస్వతంత్ర ప్రజారాజ్యముగా పరిగణించుటకు బ్రిటిషువారు అంగీకరించిరి. అందుకు ప్రతిఫలంగా బ్రిటిషువారు తమకు కావలసిన ఆర్థిక సంబంధమైన, సైనికసంబంధమైన సౌకర్యములకై ఒడంబడికలను వ్రాయించుకొనిరి. ఎందువల్లననగా, ఫాసిస్టు ప్రతికూల ప్రజాస్వాతంత్ర్య పక్షమువారున్నూ, కమ్యూనిస్టులున్నూ ఏకమై సమష్టిమంత్రివర్గముగా ఏర్పడి బర్మాలో ఆంగ్లేయులకు స్థావరం లేకుండా తరిమివేసెదరని బ్రిటిషువారు భయపడి ఆ ఒడంబడికలను వ్రాయించుకొనిరి.

1947 సం. జూలైమాసములో మితవాదపక్ష జాతీయవాదియు ప్రజాతిరస్కృతుడైనట్టి యూసా చేత అప్పటి బర్మా ప్రధానియగు ఆంగ్‌సాన్ సంహరింపబడిన అనంతరము థాకిన్‌నూ, ప్రభుత్వభారమును వహించుటకు నాయకత్వము వహించెను. ఇతడు సౌమ్యస్వభావము కలవాడు. ఫాసిస్టు ప్రతికూల ప్రజాస్వాతంత్ర్య పక్షపు సంకీర్ణ మంత్రివర్గమునకు నాయకుడయ్యెను. థాకిన్‌నూ మహాని భక్తిగల బౌద్ధమతస్థుడు అందువల్ల సహనముగలవాడు. ఎవరితోను శత్రుత్వము కోరడు. కాని మానవమాత్రుడగుటవల్ల మధ్యేమార్గంగా వ్యవహరించి ఉభయపక్ష సమన్వయము చేయగోరుచుండెను. బర్మాలో అతడు చాలా ప్రసిద్ధికెక్కిన నాటకకర్త. అతని సిద్ధాంతములనుబట్టి సోషలిస్టు. మార్క్సు సిద్ధాంతములు నిర్వచింపబడిన మార్క్సుపండితుని గ్రంథాలను బర్మా భాషలోనికి అనువదించెను. (అందువల్లనే మార్క్సు పండితుని గ్రంథములను బర్మా ప్రభుత్వమే ప్రజలకు విరివిగా పంచిపెట్టవలెనని అతడిటీవల సూచించెనని కొందరు బుద్ధిశాలురు అన్నారు.

కడచిన శీతకాలములో నేను ఆయనను కలిసికొని మాట్లాడినప్పుడు తెల్లజెండా కమ్యూనిస్టులతో ఆయన సమాధానపడుటకు అవకాశమున్నదని చెప్పిరి. స్వదేశీవ్యవహార విషయములలో ఉభయులకు చాలా వరకు అభిప్రాయములు ఏకీభవించినవి. అంతర్జాతీయ పరిస్థితి కొంత యీమధ్యలో అడ్డురాకపోయినయెడల, వామపక్షం వారితో ఏకీభావం ఏర్పడేది. థాకిన్‌నూ గారు బ్రిటిషు ప్రధాని అట్లీకి వ్రాసియిచ్చిన ఒడంబడికలను చెల్లించక తప్పదని వాదించెను. ఆ ఒడంబడికల ప్రకారముగా బ్రిటిషువారికి బర్మాలో సైనిక సంబంధమైన సౌకర్యము లివ్వబడెను. బ్రిటిషు స్టర్లింగు ద్రవ్యవ్యాపారసంబంధంగల రాజ్యాల కూటంలో బర్మా కూడా చేర్చబడెను. బర్మాకు భౌగోళికంగా ఉన్నటువంటి స్థావరమునుబట్టి యీ స్టర్లింగు వ్యాపార కూటంలో బర్మా ఉండితీరవలెను. బర్మారాజ్యమునుండి ఎగుమతియగు సరకులన్నియు ముఖ్యముగా యీ స్టర్లింగు వ్యాపారరాజ్యాలకే ఎగుమతియగుచున్నవి. కాని ఏదైనా సంగ్రామం సంభవిస్తే ఇంగ్లాండు అమెరికారాజ్యాల కూటములోనే బర్మాకూడా చేరుటకు ఇదియొక లంకెగా కల్పింపబడినదని కమ్యూనిస్టులు భయపడిరి కను. ఇటువంటి సౌకర్యములను బర్మాలో బ్రిటిషువారి కిచ్చుటవల్ల బ్రిటిషువారి కిది ఒకవిధమైన వలసరాజ్యంగా ఏర్పడినదని వాదించిరి.

వారికట్టి భయమును అపోహలను పోగొట్టుటకును, వారివాదన నిస్సారమైనదని వారికే బుజువుచేయుటకును బర్మాలో గల పెద్ద బ్రిటిషువ్యాపారసంస్థలను కొన్నింటిని బర్మా ప్రభుత్వవశముచేయుటకు థాకిన్‌నూ పూనుకొనెను. అయిరావతీ ఫ్లోటిల్లా కంపెనీని ప్రభుత్వపర మొనర్చుటకు ఉపక్రమించెను. బర్మా ఆయిల్‌కంపెనీని కూడా ప్రభుత్వ వశమొనర్ప సంకల్పించెను. కాని యీప్రయత్నములో థాకిన్‌నూ గారికి రెండువైపులనుండి ఒత్తిడి ప్రారంభమయ్యెను. ఆ బ్రిటిషు వ్యాపారసంస్థలకు నష్టపరిహారమిచ్చుట కూడదని కమ్యూనిస్టులు ఒత్తిడిచేసిరి. ఆ బ్రిటిషు సంస్థలవారు విపరీతమైన హెచ్చుమొత్తములను పరిహారముగా కావలెనని ఒత్తిడి చేయసాగిరి. బర్మా ఆయిలుకంపెనీవారి యంత్రప్రతిష్ఠాపనలు అనేకము యుద్ధకాలములో ధ్వంసమయ్యెను. బర్మావారిచే ధ్వంసం చేయబడినవి గాక బ్రిటిషు సైన్యంచేతనే విధ్వంసం చేయబడినవీ కలవు. అటివాటికికూడా నష్టపరిహారమును బర్మా ప్రభుత్వము యివ్వవలెనని బర్మా ఆయిలుకంపెనీవారు విపరీతమైన కోరికలు కోరుట కారంభించిరి.

కలకత్తాలో మార్చిమాసమందు భారతీయ కమ్యూనిస్టుల సభ జరిగెను. ఈ భారతీయ కమ్యూనిస్టులకు బర్మాలోని యువకులకు స్టాలిను పక్షీయులందు మంచి పలుకుబడి కలదు. కలకత్తాలో ఆ కమ్యూనిస్టుల సభ జరిగినపిమ్మట బర్మాలోని స్టాలిను పక్షీయులు థాకిన్‌నూగారియెడల మరింత తీవ్రముగా తమ ప్రతికూలభావమును చూపింపసాగిరి. కలకత్తాలో జరిగిన సభయందు కొంచెం సాధువైన పి. సి. జోషీకంటె అత్యుగ్రుడైన బి. టి. రణదేవుగారి ప్రాబల్యం హెచ్చింది. రాబోయే మూడో ప్రపంచ సంగ్రామానికి ప్రారంభసన్నాహముగా ఆగ్నేసియాలోని కమ్యూనిస్టులను అణచివేయుటకు యిరోపా పశ్చిమ రాజ్యాలవారును, వారి మిత్రరాజ్యాలవారును తీవ్రముగా ప్రతీకారచర్యలకు పూనికొనెదరని కలకత్తాసభలో సిద్ధాంతీకరింపబడెను ప్రస్తుతం బర్మా ప్రభుత్వంలో చేరియున్నటువంటి బ్రిటిషు పక్షాభిమానులైన యీర్జువా సోషలిస్టులకు సహకారము చేయుట బుద్ధితక్కువ పని యని ఆ సభకు వచ్చిన బర్మా ప్రతినిధికి తెలియచెప్పిరి. ఆ బర్మా ప్రతినిధి తిరిగి బర్మాకు చేరిన పిమ్మట అచటి కమ్యూనిస్టులు తమ సన్నాహములను చురుకుగా సాగించి ఆయుధబలంతో ప్రభుత్వాన్ని ఎదిరించుటకు సిద్ధమైనారు.

జూనుమాసంలో థాకిన్‌నూ గారు ప్రభుత్వ విధానమును విశదీకరించుచు ఒక ఉపన్యాసము చేసిరి. కాని అది దేశమంతటను అపార్థకలితముగా ప్రచారమయ్యెను. దేశములో అంతర్యుద్ధము రాకుండా నివారించుటకు థాకిన్‌నూ కటకటపడి ప్రయత్నం చేసెను. ఐరోపాలో పశ్చిమరాజ్యాలవారితోను, తూర్పురాజ్యాలవారితోను కూడా బర్మా ప్రభుత్వం సఖ్యతగా ఉండవలెనని సూచించెను.

రష్యాకున్ను, పశ్చిమరాజ్యాలకున్ను సహకారము సుసాధ్యమేయని స్టాలినుకూడా చెప్పియున్నాడని థాకిన్‌నూగారు స్టాలిను వాక్యములనే ఉదాహరించిరి.

కమ్యూనిస్టులు తమ తిరుగుబాటును చాలించినయెడల, వారియెడల ప్రభుత్వము కొంత సహనమును చూపగలదనియు, వారు తమ సిద్ధాంతములను యథేచ్ఛగా ప్రచారము చేసికొనుటకు అవకాశ మివ్వబడుననియు చెప్పెను బర్మాలో భూస్వాములనేవారు లేకుండా చేయుటకు ఒక చట్టము సెప్టెంబరు మాసములో ప్రతిపాదింపబడునని చెప్పెను. కమ్యూనిస్టుల ఆవేశమునకు అవకాశము లేకుండాచేయుట కట్టి సంకల్పమును సూచించెను. ఆయనసామ్యవచనములు వారి చెవికెక్కలేదు.

వేలకొలది కమ్యూనిస్టులను ఆయన అరెస్టు చేయించెను వందలకొలది కమ్యూనిస్టులు బర్మా సేనలచే చంపబడిరి. అయినప్పటికీ వారిని అణచివేయుట అతనికి సాధ్యంకాలేదు. మాండలే నగరమునకు పోయెడి పెద్ద రస్తామీద టౌంగూ ప్రాంతం యీ కమ్యూనిస్టులకు ప్రధాన స్థావరముగనున్నది. ఆ ప్రాంతమునకు క్రిందటి శీతకాలములో నేను వెళ్లి చూచియుంటిని. గతయుద్ధకాలంలో జపానువారి నెదిర్చి పోరాడినప్పుడు కూడా అది వారికి ఆవిపట్టుగానుండెను.

ఆచార్య భన్సాలీతో హైద్రాబాదులో నవరాత్రాలు

[శ్రీ ఊటుకూరు నరసింహరావు]


ఆచార్య భన్సాలీతో జులై 29 వ తేదీనుంచి ఆగస్టు 6 వ తేదీవరకు నిజాం సంస్థానంలో నేను కనిన వినిన విషయాలను బట్టి ఈనాడు నిజాం నవాబు, మంత్రులు రజాకార్ల చేతుల లోని కీలుబొమ్మలని, ఒక బందిపోటు ముఠా, హైదరాబాదు సంస్థానాన్ని సంకుచిత నీచ మతోన్మాదపూరితమైన నిరంకుశత్వంగా పరిపాలిస్తున్నదని గ్రహించగలిగాను.

నిజాం సంస్థానంలో గత కొన్ని మాసాల నుంచి ముఖ్యంగా మహమ్మదీయేతరులపై నిరంతరము ఒక నిర్ణీత ప్రణాళిక ననుసరించి నిజాం ప్రభుత్వోద్యోగుల సహకారముచే రజాకార్లు జరుపుతున్న దారుణ భయానక హత్యాకాండ, గృహదహనాలు, స్త్రీల మానభంగాలు, దోపిడీలు—వీటిని అరికట్టడం యొక్క బాధ్యత ఒక్క ఇండియన్ యూనియన్ ప్రభుత్వానికే ఉన్నదని, యూనియన్ ప్రభుత్వం ఇంకా బాధ్యతా రహితంగా ప్రవర్తించిన ఇండియా మధ్యలో గుండెలమీద నిప్పుల కుంపటిలాగు వున్న ఈ నిజాం ప్రభుత్వం యూనియన్ స్వేచ్ఛా స్వాతంత్ర్యానికే ముప్పు తేగలదని వ్రాయుట అతిశయోక్తి కానేరదు.

తన ఇంటి మధ్యలోనే అమాయకపు ప్రజలపై, స్త్రీలపై ఇంతటి భయంకర కిరాతకత్వం జరుగుతుండగా ప్రపంచ పీడితజాతుల స్వాతంత్ర్యానికై పాటుబడతానని నెహ్రూ పండితుడు ప్రకటించటం హాస్యాస్పదం గాదా అని పరాయివారనుకోవచ్చు.

ఇప్పటికైనా నిజాం దోపిడీదారులతో యూనియన్ ప్రభుత్వం సమావేశాలు, సమాలోచనలు పూర్తిగా మానివేసి తన కత్తులపదును రజాకార్లకు, నిజాంగుండా సర్కారుకు చూపించటంలో ఆలస్యం చేయరాదు.

జులై 29 వ తేదీన మేము విజయవాడనుంచి బయలుదేరి ఉదయం 8 గంటలకల్లా నిజాం సంస్థానంలోని యర్రుపాలెం రైల్వేస్టేషన్లో దిగాము. అసలు కార్యక్రమం ప్రకారం మేము మధిర వెళ్ళవలసియుండెను. కాని కొన్ని ప్రత్యేక పరిస్థితులవల్ల మేము యర్రుపాలెంలోనే దిగి అపరిసర గ్రామాలను చూడటం బాగుంటుందని భావించి యర్రుపాలెంలోనే రైలు దిగాము. మేమంతా స్త్రీలు, పురుషులు కలసి ఈ యాత్రలో బయలుదేరింది పదిమంది. మేమంతా శ్రీ భన్సాలీ ఆజ్ఞానుసారం ఊడ్వటానికి తలా ఒక చీపురుకట్ట కూడా తీసుకొనివెళ్ళాము—మేమంతా ముఖ్యంగా స్త్రీలు. కాషాయాంబరాలు ధరించిన శ్రీ భన్సాలీ చీపురుకట్ట చేతిలో పట్టుకొని రజాకార్లకు పట్టిన మతోన్మాదపు మహాపిశాచాన్ని వదిలించుటకా యన్నట్టు యర్రుపాలెం స్టేషన్లో రైలునుంచి దిగుటతోడనే అక్కడ సహజంగా ఎప్పుడూ కాపలా ఉండే



నిజాం మిలిటరీవాళ్ళ మొగాలలో ఖంగారు తత్తరబాటు కనుపించింది. శ్రీ భన్సాలి ప్రాయోపవేశంవల్ల మాకు సంస్థానంలో కొన్ని పరతులపై పర్యటనగావించుటకు బహిరంగంగా నిజాం ప్రభుత్వంనుంచి అనుమతి లభించటంవల్ల అప్పుడు అక్కడవున్న నిజాం మిలటరీ, పోలీసులు అమానుషంగా ప్రవర్తించటానికి ముందుకు రాలేకపోయినారు. ఇంక ఈటెలు, బరిసెలు, కత్తులు, కేపు తుపాకులతో ఆకుపచ్చవంకరటోపీలు ధరించి ప్రత్యేక చిహ్నాలతో అదివరకు హడావిడిగా ప్లాట్‌ఫారంపై అటూఇటూ తిరుగుచున్న రజాకార్లు శ్రీ భన్సాలీని చూడటంతోటే రైలుపెట్టెలలో ఎక్కి రెండవవైపు దిగి యర్రుపాలెం గ్రామంలోనికి పలాయనమయ్యారు. రజాకార్ల ఈ చర్య నాకు చాలా ఆశ్చర్యాన్ని కలుగజేసింది. కాని ఉన్నతాధికారుల సలహాపై తమ నాయకులు ఇదివరలోనే వచ్చి నచ్చజెప్పటవల్ల రజాకార్లు ఈ విధంగా జేసినట్లు తరువాత తెలిసింది.

అసలు ఆ ప్రాంతంలో రజాకార్లనే వాళ్ళు ఎవ్వరూ లేనే లేరని, రజాకార్లు దురంతాలు కలుగజేస్తున్నారనే ప్రచారం సర్వాబద్ధమని శ్రీ భన్సాలీ భావించుటకొని నిజాం సర్కారుకు ఒక కాండక్టు సర్టిఫికేట్ ఇస్తారేమోనని ఆశ కొద్దీ నిజాం ప్రభుత్వం ఈ గారడీ చేయుటానికి తలపడినట్లున్నది.

సామాను అంతా స్టేషన్లోనే వుంచి మేము వెంటనే చీపురుకట్టలతో యర్రుపాలెంకు మూడు మైళ్ళ దూరంలో వున్న రేమిడిచర్లకు బయలుదేరాము. మాకు ఫర్లాంగుదూరంలో 20 మంది నిజాం పోలీసులు భుజములపై బైనట్లు గల తుపాకులతో శ్రీ భన్సాలీ అభిప్రాయం తెలుసుకోకుండానే మాకు రక్షణ అనే నెపంతో బయలుదేరారు. ముందు చీపురుకట్ట భుజములపై పెట్టుకొని శ్రీ భన్సాలీ, వారి వెనుక మేమూ, మావెనుక తుపాకులు భుజములపై పెట్టుకొని నిజాం పోలీసులు యర్రుపాలెంనుంచి కదలి ముందుకు సాగిపోతూవుంటే దారిలో చెట్లుచాటున దాగివున్న రజాకార్లు నిర్ఘాంతపోయి ఈ చూడటం దృశ్యాన్ని మొదలుపెట్టారు.

శ్రీ భన్సాలీ నాతో అనేక పర్యాయాలు సేవాగ్రాం ఆశ్రమంలో చీపురుకట్ట మహత్యాన్నిగురించి మాట్లాడుతూ చీపురుకట్ట బాపూజీ తన కిచ్చిన వరప్రసాదం అని అంటూ వుండేవారు. అప్పటో శ్రీ భన్సాలీ ఎంతచెప్పినా నాకు నచ్చకపోయినా చీపురుకట్టలకు బైనట్ తుపాకులు వెనుకపడటం చూడటంవల్ల నాకు కలిగిన భావపరివర్తనం వ్రాయటానికి నాకు భాష చాలదు.

మాకు రక్షణగా వస్తూవున్న నిజాం పోలీసులు యర్రుపాలెం దాటినతరువాత 1½ మైలుదూరం వచ్చి అకస్మాత్తుగా జట్కాబండికి కట్టిన పేచీపట్టులాగు ఆగిపోయారు. కారణం విచారించగా మేము వెళ్ళుతున్న రేమిడిచర్ల గ్రామం యూనియన్ సరిహద్దుకు ఒక మైలుదూరంలో ఉండటంవల్ల సరిహద్దులో వున్న నిజాం కాందిశీకులు, ప్రజారక్షణదళాలు వచ్చి బహుశః తమను ముట్టడించి హతమార్చి తుపాకులు లాగుకోపోవచ్చుననే పిరికితనంవల్ల ఆ విధంగా మధ్యలోనే ఆగిపోయినట్లు తెలిసింది.

యర్రుపాలెంనుంచి మాతో ఒక క్రైస్తవ బడిపంతులు కొంతదూరం వచ్చి స్టేట్ కాంగ్రెస్‌ను పొగుడుతూ రజాకార్ల దురంతాలను వర్ణించటం ప్రారంభించాడు. అంతేకాక తానీ రజాకార్లకు భయపడి యర్రుపాలెంలో వుంటున్నానని, వీలు చిక్కితే యూనియన్‌కు పోయి తలదాచుకోవాలనీ ఇంకా ఎన్నెన్నో కబుర్లు చెప్పటం ప్రారంభించి తననుకూడా మాతోపాటు రేమిడిచర్ల రానివ్వవలసిందని శ్రీ భన్సాలీని అర్థించాడు. కాని మాకు ఇంతలో రేమిడిచర్ల గ్రామవాసి కనుపించగా అయాచితంగా అంతవరకు మాట్లాడుతూ మాతోపాటు రేమిడిచర్ల రాదలంచిన పంతుల అమాంతంగా అంతర్ధానం అయిపోయివాడు. తీరా విచారించగా అతడు నిజాం ప్రభుత్వపు గూఢచారి అని తెలిసి మేమంతా ఆశ్చర్యపోయాము.

రేమిడిచర్ల గ్రామంలో నిజాం ఉన్నతాధికారుల సమక్షంలో నరహంతకులైన రజాకార్లు, వివేకశూన్యులై కేవలము క్రూరమృగలవలె దయ్యపుబ్రతుకు బ్రతుకుచుండే నిజాం సైనికులు, పోలీసులు చేసిన పైశాచిక కృత్యాలు చూడవలసినవేకాని వ్రాయనలవి కావు. ఆ దృశ్యాలు చూస్తే మనిషి దయ్యంగా ఎట్లా మారిపోతాడా? అనే సందేహం కలుగుతుంది. గుడ్లగూబలు కాపురంచేస్తూ, శునకాలరోదనంతో శ్మశానవాటికలాగు వున్న రేమిడిచర్ల గ్రామాన్ని చూచిన తరువాత మాకు ఇది శ్మశానమా, రాజ్యపాలనమా అనిపించింది.

దరిదాపు వెయ్యి ఇండ్లు కలిగి ఆ ప్రాంతానికే మేటిగ్రామమని పేరుబడ్డ రేమిడిచర్లలో తొమ్మిది ఇండ్లుతప్ప మిగతా ఇండ్లన్నీ రజాకార్లు పెట్రోలుపోసి తగులబెట్టారు. ఐదువేలు పుస్తకాలు కలిగిన ఒక గ్రంథాలయం తగులబడిపోవటం మా అందరి హృదయాలను చాలా కలతపెట్టింది. మేము వెళ్ళేటప్పటికి కూడా సగం కాలిపోయిన పుస్తకాలు అక్కడ పడివున్నవి. గ్రామంలో ఒక పురాతనమైన శివాలయం వుండేది. రజాకార్లు శివాలయాన్ని వీలున్నంతవరకు పాడుజేసి శివలింగాన్ని సమీపంలో వున్న బావిలో రెండు ముక్కలుగా పగులగొట్టి పారవేశారు. గర్భాలయపు గోడలపై "పాకిస్తాన్ జిందాబాద్", "ఖాసిం రజ్వీ జిందాబాద్", "ఆసిఫ్‌జాహీ జిందాబాద్" అని ఉర్దూలో వ్రాయబడివున్నది. ఒక నిర్ణీత కార్యక్రమం ప్రకారం ఈ దహనకాండ జరిగిందేకాని, తాత్కాలిక కోపావేశాలవల్ల రజాకార్లు ఈ పని చేసిఉంటారని అనుకోవటానికి ఎక్కడా ఆధారంలేదు. మేము రేమిడిచర్ల వచ్చామనీ మాతోకూడా నిజాం పోలీసులు రాలేదని తెలియటంతోడనే యూనియన్ పరిహద్దునుంచి కాందిశీకులుగా భయభ్రాంతిచే గ్రామాన్ని విడచిపోయిన రేమిడిచర్ల గ్రామస్థులు, ఇంకా ఇతరులు తండోపతండాలుగా వచ్చారు. శ్రీ భన్సాలీని చూడటాని, వాళ్ళంతా అంత ఆతురతగా రావటం చూస్తే యాత్రికులు జ్ఞాపకం వచ్చారు. అప్పటికి పన్నెండుగంటలు అయినా మాకు అన్నం లేదు. అసలు రేమిడిచర్ల బయలుదేరేటప్పుడు మధ్యాహ్నం అన్నం మాట ఏమిటనే సంగతే మాకు తోచలేదు. మాలో ఒకరు వెళ్లి ఆ గ్రామంలో మిగిలిపోయిన తొమ్మిది ఇండ్లలో కాపరం వుంటున్న (కేవలం వృద్ధకాయులగు పురుషులు) మూడు ఇండ్లనుంచి ఒక బుట్టలో ఇంటింటికి అడిగి తెచ్చిన జొన్న అన్నాన్నే తలా కాస్తా అరచేతులతో పెట్టుకొని తిన్నాము.

కాని ఇంతలో గ్రామస్థులు పరిహద్దునుంచి మాకై కావిళ్ళతో అన్నం, కూరలు తెచ్చారు. ముసలమ్మలు, స్త్రీలు తలా ఒక చెంబుతో శ్రీ భన్సాలీగారికి పాలు, శెనగలు, వేపాకు తేవటం అమాయకనిరక్షరులైన గ్రామీణ స్త్రీలోకానికి శ్రీ భన్సాలీయెడల కల అవ్యాజమైన భక్తిశ్రద్ధాసక్తులకు మేము అచ్చెరువొంది ఆనందాశ్రువులు రాల్చాము.

దరిదాపు రెండుగంటలసేపు గ్రామస్థులతో మేము కలిసి ఉండగలిగాము. ఈ రెండుగంటలూ ఎటునుంచి ఏ రజాకారు వచ్చి కాల్పులు సాగించునో అనే అదురుబెదురుతోనే అక్కడి ప్రజలు వున్నారేకాని వారి హృదయాలకు శాంతి లేదు.

రజాకార్లు చేసిన దుండగాలన్నీ స్త్రీలు, పురుషులు మాతో చెప్పారు. ఆ హృదయవిదారమైన కరుణోత్పన్న విషాదగాథలు వింటుంటే రాళ్లుకూడా కరిగిపోవు ననుపించింది.

గ్రామస్థులు చేసిన మహాపచారం ఏమిటి? గత సంవత్సరం ఆగస్టు 15 వ తేదీ వచ్చింది. అనేక శతాబ్దాలతరువాత అనేకవీరుల ఆత్మబలిదానం ఫలితంగా కలిగిన భారతమాత దాస్యవిమోచనవల్ల అక్కడికి ఒక మైలు దూరంలోనే ఇండియన్ యూనియన్ భూభాగంలోగల గ్రామాదులలో జయదుందుభులు మ్రోగినవి. ప్రభాతభేరీలు, విజయ జాతీయ పతాకోత్సవాలు జరిగినవి. ఆనందోత్తుంగ తరంగమాలికలు ప్రజాహృదయాలలో ఉప్పొంగి పొర్లిపోసాగినవి.

మానవుడు ప్రకృతి బద్ధుడు కాని అతీతుడు కాదుగదా! కనుచూపుమేరలో యూనియన్ ప్రజలు పడుచున్న పులకాంకితానందాన్ని చూచి రేమిడిచర్ల ప్రజలుకూడా ఆ ఆనందంలో, తమకు సహజంగా పొందదగిన ఆనందంలో తమ పాలు తాము పంచుకోసాగారు. 'మహాత్మాగాంధీకి జై' అనుకుంటూ యూనియన్ పతాకాన్ని గ్రామంలో ఎగురవేసి, ప్రపంచపీడిత ప్రజల సహాయకచిహ్నమగు త్రివర్ణపతాక ఛాయలలో చేరి తాత్కాలిక ఆనందాన్ని అనుభవించారు.

ఇది ఈ ప్రజలు చేసిన పని. దీనికి ప్రతిఫలంగా తెల్లవారకుండా రజాకార్లు, నిజాం గుండాలు, మిలిటరీఉన్నతాధికారులలో వచ్చి కనుపించిన ప్రతివానిని రక్తాలు కారేటట్లు కొట్టారు. ప్రాణభీతిచే పారిపోతున్న వారిపై తుపాకులు కాల్చారు. చేతికి చిక్కినవారినల్లా లారీలలో యర్రుపాలెం తీసుకొనివెళ్లి జైలులో పెట్టారు. తరువాత గ్రామం యావత్తూ దోచుకొని పెట్రోలుతో గ్రామాన్ని తగులబెట్టారు!

ఈ యిరవయ్యో శతాబ్దంలో నాగరిక ప్రపంచంలో, స్వతంత్రజాతి అని చెప్పుకునే వారు నివసించే ఇండియన్ యూనియన్ సరిహద్దులకు కనుచూపుమేరలో, నిర్హేతుకంగా అమాయక ప్రజాసామాన్యముపై ఇంతటి దారుణ బీభత్సం జరుగుతూ ఉంటే అటు ఇండియన్ యూనియన్ ప్రభుత్వం, ఇటు యూనియన్ ప్రజలు, ప్రజానాయకులు చూస్తూ నిస్సహాయులుగా ఉన్నారు.

సాయంత్రం 5 గంటలవరకు రేమిడిచర్ల గ్రామంలోనే ఉండి మరల యర్రుపాలెముకు బయలుదేరాము. మేము తిరిగివచ్చేవరకు మాతో మొదట బయలుదేరిన నిజాం పోలీసుల ముఠా ఆగిన స్థలంలోనే మాకై చూస్తూ నిలబడివుండెను.

యర్రుపాలెంకు ఒక మైలు దూరంలో వున్న తుమ్మల్లోనే మాకు ప్రొద్దుపోయింది. చివరకు అంతా కలిసి బాగా చీకటిపడేవరకు స్టేషన్ చేరుకున్నాము.

(21 వ పేజీ చూడుడు)

ఆ చుట్టుప్రక్కల కర్షకసంఘములను ఏర్పాటు చేసి వారు తమ పలుకుబడిని వ్యాపింపజేసి తమ బలమును వృద్ధిచేసికొనిరి.

తాకిన్‌నూగారికి మరొక ప్రతిబంధకముకూడా తటస్థించెను. తన ఫాసిస్టు ప్రతికూల ప్రజాస్వాతంత్ర్యపక్షము మేర్పరచిన సంకీర్ణ మంత్రివర్గములోనే భిన్నాభిప్రాయము లేర్పడెను. కమ్యూనిస్టుల విషయములో తీవ్ర ప్రతీకార చర్యలను జరపవలెనని సోషలిస్టులు వాదించిరి. కాని ఆంగ్‌సాన్ యొక్క సొంత పటాలంగా పనిచేసినటువంటి తీవ్రజాతీయవాదులగు యువకులు—అనగా పీపిల్సు వాలంటీరు సంస్థకు చెందినవారుమాత్రము బ్రిటిషు వాంఛిత సౌఖ్యములకు ప్రతికూలురగు కమ్యూనిస్టుల విషయములో ఆదరణ చూపవలెనంటారు. ఈ పీపిల్సు వాలంటీరు సంసవారు తెల్లపట్టీ చిహ్నం కలవారు. ఈ తెల్లపట్టీ చిహ్నం కలవారే తెల్లజెండా కమ్యూనిస్టులతో చేరుచున్నారనియు, వారు కమ్యూనిస్టులకు చేయూత నిచ్చెదరనియు భయముగా ఉన్నది.

[మహేంద్రగిరి ర్యానుకుని ప్రవహిస్తూన్న సెలయేరొడ్డున నిసుకపట్టు మీద తన నీడపరచి పుష్పించియున్న అంటుమామిడి గున్న స్కంధాన్నానుకుని ధ్యానిస్తూన్న నన్ను చూస్తూ ఒక తీవ్రమహావ్యక్తి వచ్చి—]

పరశురాముడు: ఎవడ్రా నీవు? శిష్యుల వేదాధ్యయనంలో నత్యేకాగ్రులమైయున్న మమ్మల్నుపాసించావ్?

నేను: (నమస్కరిస్తూ) స్వామీ, అపరాధం. క్షమించండి భక్తుణ్ణి. తమరు సావకాశంగా నున్నారనుకొని ధ్యానించా.

ప: భక్తుడవా? కానివాడెవడు? భక్తులకు శరణిచ్చియిచ్చి, వార్ని క్షమించిక్షమించి మా ప్రాణాలు విసిగాయ్. సావకాశంగా నున్నామనుకున్నావ్? మేం సోమర్లంగాము. ఈ పిలుపుకు కారణం?

నే: (స్వగతం) అయ్‌బాబో, ఎట్లాగబ్బా. (ప్రకాశం) చిత్తం. తమరేనాండి పరశురాములు వారు?

ప: కాక మరెవర్రా? ఏవరైనా నే పరశురాముణ్ణంటే చెప్పు. తుప్పపట్టిన గండ్రగొడ్డలికి పదునుపెట్టుకొస్తాం.

నే: చిత్తం. మరెవరూ లేరు. తమరు కొంచెం శాంతించి దయచేయకుంటే, నే నాగగల్నా.

ప: శాంత మేమిటి? అదొక మాట నేర్చింది మాయలోకం. శాంత మెక్కడుంది సృష్టిలో? అందుకనే ఉపనిషత్తు లెప్పుడూ చివరకు "ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః" అంటూంటాయ్. ఇది మా స్వభావమని గ్రహించు.

నే: మహాత్మా, తమకీ తీండ్ర మెట్లా స్వభావమైందండీ.

ప: ఆరి మూర్ఖుడా! స్వభావ మంటూంటే యింకా కారణ మెందు కడుగుతావ్?

నే: ఎందుకులేదు. తమరు కేవల వైష్ణవావతారులుకదా, బ్రాహ్మణులుకదా, రాజసతామసవ్యక్తికమైన యీ తీండ్ర మేమానని మా సందేహం?

ప: 'మా' కూడానా? మా ముందే బహువచనం? అది నీ జన్మజాడ్యం. పోనీ, విష్ణువుకు మటుకు రాజసతామసా లుండకూడదా? సృష్టి సర్వం ఆయన లీలైనపుడు అవసరవశాత్తూ ఆయనా యీ గుణా లగుపించగూడదనా?

నే: అయ్యా, యిది కూడ్ను ఇది కూడదనే మాత్రం వాణ్ణా నేను స్వామీ! ఇన్ని కోట్ల సంవత్సరాలైనా ప్రతివాడూ పరశురాములవారంటే హడలుపోతూంటా రెందుకని స్వామీ, అని అడిగాగాక.

ప: అవతారమే దుష్టసంహారంకోసం. దానికి దగ్గట్టు పుట్టినప్పట్నుంచీ బయల్దేరిన గొడవ ప్రతిదీ కోపాన్ని పెంచేదేగాని ఒక్కటీ శాంతాన్ని సమకూర్చేది కాదు. అందుకని ఒక్కటే స్వభావమన్నాం. తీండ్రమంతలవాటైం దన్నమాట.

నే: చిత్తం స్వామీ. అట్లాగైతే నా మనస్సులో నున్న సందేహం తీర్చడానికి తమర్ని ప్రశ్నించే దెట్లా?

ప: అడగరా: వీరు తీండ్రస్వభావులుగ దాని గమనించి నీ పని చేసుకో.

నే: చిత్తమామాత్ర మభయం జాలు. తమరు చేసిన సంహారమంతా రాజలోకాన్నే నే, వాండ్లంతా దుష్టులెట్లాగైనా రండీ?

ప: కాల చంక్రమణంలో యుగసంధులందు వర్తమానయుగ ధర్మాలు సడలి రాబోయే యుగ ధర్మాలేమాత్రమో పొడసూపుతుంటాయ్. త్రేతాద్వాపరసంధిలో నాయవస్థ తటస్థించింది. రాజులంతా మదోన్మత్తులై, తమకంటే లేరనే సిద్ధాంతాన్ని నిలబెట్టుకొనవెంచారాన్నట్లు ప్రవర్తించ మొదలెట్టారు. అది భూదేవికే దుర్భరమై మొరపెట్టుకుంటున్నదాన్నట్లు మాకు కల పరిస్థితులవల్ల తోచి మే మవతరించాల్సొచ్చింది.

నే: అదాండి కార్తవీర్యార్జున చక్రవర్తి యపరాధం?

ప: కాకేమిటి? మా తండ్రి మహాముని కాబట్టి నిర్లిప్తుడు అయినా ఆశ్రమాధికారని ఆతిథ్యవిధీయనకు దప్పదుకదాని కలవారు

గొప్పవారితో గుసగుసలు-2. చక్రవర్తులు:

పరశురాముడు

కీ॥ శే॥ వారణాసి శ్రీనివాసరావు

హోమధేనువును కటాక్షించిరి. ప్రభువుకదాని వచ్చిన తమకు తమవారికి దానివలన ఆతిథ్యం నడిపె. ఏదో బ్రాహ్మణుడు తపస్సంపదచేత సముపార్జించిన వస్తువుకదానుకోక దాన్నే కావాలండమెందుకు? ఆయ నీయ నన్నప్పు డూరకోక దాన్ని పట్టితెండ్రాండ మెందుకు తన కింకర్లను? వారా యాజ్ఞను శిరసా వహించి నెరవేర్చడమెందుకు! కాబట్టి మాకు లేంది ప్రజల్లో నెట్లాటివారికైనా ఉండకూడదు, ఉన్నట్లైతే దాన్ని గ్రహించడ మపహరించడంగా దేనుకున్నా డన్నమాట ఆ చక్రవర్తి. నేడా వైంది: రేపు భార్యే అవుతుందేమో? మానవస్వభావ మెప్పుడూ తప్పుదారిసందులే వెదుకుతూంటుంది. ఈ రాజు సార్వభౌముడు చేశాడుకదాని రేపు ప్రతిచిల్లరాజు ప్రారంభిస్తాడు. అట్లాటప్పుడు సంఘానికి నిలక డేది? శాం తేది?

నే: అందుకనాండి తమరు తీండ్రించింది?

ప: అయినా, మే మప్పుడే తీండ్రించామా? ఆయన మాహిష్మతి చేరకముందే వేగ గమనంతో బోయి తనదారి కడ్డు నిల్చున్నాం: మమ్మల్ని చూచైనా విడిపించడాని. విడిపించెండామనే తాను పెద్దవాణ్ణని "బాలుడు వెర్రివాడని" ఏమేమో ప్రేలి యుద్ధసన్నాహం జేసాడు. ఆ దుష్టత్వాన్ని నాశనం చేయొద్దూ?

నే: చిత్తం. ఆయనకొడుకులు...

ప: (మరీ తీండ్రిస్తూ) వాండ్ల పేరెత్తకుమంట! వాండ్ల మాటెరెత్తినా మాకు విపరీతావేశ మొస్తుంది! ఆ కచ్చ మనస్సులో నుంటే తమ తండ్రినిజంపిన నన్ను సాధించాలిగాని యే అభంశుభ మెరగని మా తండ్రిని నే నింటలేనప్పుడు చంపి, శిరచ్ఛేదంజేసి, శిరాన్ని తీసుకునిపోతారా, దహనకర్మగ్గూడా వీలులేకుండా చెయ్యడానికి?

నే: అందుకనే తమరు వెంటనంటి తరిమి, నగర్నొచ్చి ఒక్కొక్కర్ని ఖండించారనుకోండి. వాండ్లు చేసిందానికి క్షత్రియులందరి మీదా పగెందుకండీ?

ప: ఇట్లాటి కుంటిశంకలే మాకు మంట: నీకు బుద్ధిలేదూ, ఆలోచన్లేదా? ఓరి మూర్ఖుడా, సామ్రాట్టులే యిట్లా జేసారంటే మిగతావాండ్లంతా చెలరేగరట్రా—వాండ్ల కడలుపుట్టేట్టు చేయకుంటే?

నే: అట్లా కొందర్నొక్కసారి చేస్తే చాల్దా—చలపట్టి యిరవైయొక్కసార్లు సంహరించకుంటే.

ప: (కొంచెం విచారించి) అదా? ఆ, జ్ఞప్తికి తెచ్చావ్ ఇరవైయొక్క సార్లని—అదా. అది మా అమ్మగారి సూచన.

నే: అంటే అన్నిమార్లు వాండ్లందర్నీ సంహరిస్తేగాని తమ భర్త మరణానికి దగిన ప్రతిక్రియ కాదని వా రన్నారా?

ప: అనలే దనుకో—తండ్రి దుర్మరణ వార్త అంతరాత్మ చూచాయగా గ్రహించగానే అరణ్యంనుండి మేం తిరిగివచ్చేసరికి మా యమ్మగారు శిరంలేని కళేబరం ప్రక్కబడి వాపోవుచూ ఇరవైయొక్కమారు శిరం మోదుకున్నారు. ఎన్నిమార్లీతల్లి శిరం బాదుకుందో అన్నిమార్లీ రాజలోక సంహారం చేయాలని లోప లనుకున్నాం.

నే: అదేం న్యాయ మండీ?

ప: (మరల తీండ్రించి) అదుగో, మళ్లీ ఆరంభించావ్ ధర్మసన్నాలదవడం! నాకు నీవా న్యాయం నేర్పేవాడవ్! మీ కాలంవాండ్లందరికీ యీ జాడ్యముంది. ఛీ యెందుకో అని గాని, మళ్ళీ ఒక్కసారి సంహారానికి నడుంగడ్తే బాగుంటుందనిపిస్తూంది! ఈసారి దుర్నిమర్శక సంహారానికి!

నే: తమ కోపం మెచ్చిపోతుందని లోకం న్యాయం మాట్లాడుకోకుండా వుంటుందాండి?

ప: చాల్నేమైనా యేడ్చుకోమను, వెధవలోకాన్ని; మా యెదటంటే కాచేదిలేదు.

నే: నే నెదటే అంటా చంపితే చంపారు—అదేం న్యాయమండీ?

ప: ఇశ్శో! మొత్తానికి తగినాణ్ణే ప్రయోగించింది మా సరస్వతి. వట్టి మొండివాడవేం? అదేం న్యాయమంటా వేమిటి? న్యాయం గాకేమిటి? మా తల్లి మా తండ్రి కళేబరంమీదబడి యెన్నిసార్లు తల మోదుకుందో అన్నిసార్లు క్షత్రియకాంతలంతా మోదుకోవడం న్యాయమని అట్లా చేసా. సరేనా?

నే: క్షత్రియకాంత లంతానా? కార్తవీర్యార్జునుని కోడళ్ళైతే న్యాయంగాని? అన్యాయంగా క్షత్రియులందరిమీదా పడడ మెందుకండీ? వాండ్లంతా విలపించేటు చేయడ మెందుకండీ?

ప: ఒరేవ్, నీతో మహాబా ధొచ్చిందే! క్షత్రియలోకానికంతా బుద్ధి రావడానికి.

నే: బుద్ధి రావడానిగ్గాదు, మిమ్మల్ని నేవారు లేరుగాని. పోనీండి, కన్నతల్లినీ, అన్నల్నూ చంపడ మెందుకండీ!

ప: (పండ్లు పట పట గొరుకుచు) ఒరేవ్, నిశ్శేషం జేసినా పాపం లేదురా! అన్నీ సంకటమైన శంకలే జ్ఞాపకుంటావ్. ఓరి అభాజకుడా, తండ్రి ఆజ్ఞరా, తండ్రి ఆజ్ఞ!

నే: ఆ ఆజ్ఞ యిచ్చేవాని కాయనకూ, దాన్ని నెరవేర్చడానికి మీకూ సరిపోయింది! ఒక తండ్రి కొడుకును బిలిచి నాయనా, ఊరంతా తగలబెట్టమంటాడు, పెట్టాల్సిందే?

ప: మళ్ళీ నిముషంలో నా ఊర్నంతా కట్టించగల డన్న నమ్మకముంటే తగలబెట్టకూడదూ? మీ కెట్లా గర్థమాతుందిరా, ప్రద్దానికీ మీనమేషా లెంచేవాండ్లకు: పితృాజ్ఞ, దానిపాలనలోనున్న ధర్మం మీ కర్థమాతుందా?

నే: పోనీండి, పాపం మీ అమ్మగారు చేసిన మహాపాతక మేమిటి? నది కెళ్లారు? అక్కడెవరో జలక్రీడ లాడుచున్నారు? తమకు లేని సుఖంగదా. కాసేపు నిల్చుని చూచారు. అదేమో యోగదృష్టితో గనిపెట్టార. ఆమె మనస్సులో దూరి అక్కడివాంఛను త్రవ్వేత్తారు. అక్కణ్ణుంచి చంపమన్నారు! అంతకంటే పెండ్లి చేసుకున్నప్పుడే ఆమెగారి కండ్లు పొడిచేస్తే పోయేదిగా?

ప: ఏమో; మా తండ్రి వార్నంతా బ్రతికించగలరని నమ్మి అంత పని చేసాం.

నే: మీకు చేతు లెట్లా వచ్చాయండీ? మొత్తానికి క్షత్రియ రక్తపు సారుకు పోనిచ్చారుగారు?

ప: (పండ్లు బిగబట్టి) ఒరేవ్, ఒళ్లెరిగి మాట్లాడు!

నే: ఇకనంతే, లాకపోతే యేముంది? క్షత్రియత్వం గాకపోయి బ్రహ్మత్వమే అయితే అట్లా చేయగలరా? శమంతపంచకంలో తొమ్మిది మడుగుల్జేసి వాట్ని క్షత్రియరక్తంతో నింపి తండ్రికి తర్పణా లియ్యగలరా!

ప: అబ్బబ్బా, సరస్వతి యే మఘోరిస్తుందో అని ఆగాల్సొచ్చింది.

నే: ఎందుకైనా ఆగండి. అన్నీ అట్లా వుంచండి. శ్రీరాములవారిమీద దండెత్తడ మెందుకండీ? ధనుస్సు నెక్కుపెట్టమన్న జనకుడు బాగానే వున్నాడూ? అయ న్నేమనరు? పాతబడ్డ విల్లు విరిగితే విరిచావని ఆ బాలుడిమీద విరుచుకుబడ్డారు?

ప: ఒరేవ్, మాకు దుర్భరంగా ప్రసంగిస్తున్నావ్. చేతిలో విల్లెక్కుబెట్టమన్న జనకుడికావిల్లెక్కు బెడితే అగుతుందో అగదో తెలీదు. విరిగిపోతుందంటే యెక్కుపెట్ట మంటాడా! ఎక్కుపెట్టమన్నాడుకదా, ఎక్కుపెట్టడమేరేం కర్మం, విరగ్గొట్టి మన శక్తి చూపిద్దామనుకున్నాడు రాముడు! ఇంకా అతనిమీదికి దండెత్తడ మెందుకంటావేం? మా గురువుగారి విల్లును చొప్పదంటులాగ విరిస్తే?!

నే: దాని పర్యసాన మేమైందండీ?

ప: అద్దో, సాగించావ్ కొంటెతనం? ఏమైందో నీకు తెలీదేం? అతనికీ మనకూ భేదమేమిటని సర్దుకున్నాం: సరేనా?

నే: అవో, ఏం సర్దుబాటుగా మట్లాడ్తారండీ! మీసాలు మన్ను......

ప: ఒరేవ్ కుంరా, ఒళ్లెరిగి మాట్లాడ్రా.

నే: పోనీండి నా కెందుకు. క్షత్రియులంతా దుర్మార్గులైతే వాండ్ల హతమార్చామన్నారే తమరు, వాండ్లు మళ్ళీ దుర్మార్గులు కాకూడదండీ? తమరు సర్వజ్ఞులుకదా అట్లా కాకుండా చెయ్యలాకపొయ్యారాండీ?

ప: ఇందాకట్నుంచి మా స్వవిషయాలు, రాజకీయాలు న్యాయాన్యాయాలు మాట్లాడావ్; ఇప్పుడు వేదాంతంలో దిగావ్! సర్వజ్ఞులమేననుకో; వారు దుర్మార్గులుకాకుండా చెయ్యాల్సిన పని మా కెందుకు—ప్రతి జీవుడికీ యుక్తాయుక్తవిచక్షణాశక్తి కొంతవరకు స్వతంత్రప్రవర్తన కవకాశం గలిగించిం తర్వాత? రాజులంతా యేం పసిపిల్లలా? మనకు తగిం దిది, తగందిది అని యెరగరూ? దాంతో తమ ప్రవర్తనను మలచుకోలేరు?

నే: మలచుకోరు. అప్పుడు యథాస్థితికి లోపంలాక పోవచ్చుగా: మళ్లీ దుర్మార్గం ప్రబలవచ్చుగా?

ప: అప్పుడు మేం మళ్ళీ వచ్చి దాన్నంతా దించవచ్చుగా? మాకు మటు కేదో చెయ్యడానికి పనుండొద్దూ?

నే: చిత్తం. తమరు చాలామందికి విద్య నేర్పినట్లున్నారు.

ప: చాలామంది కేమిటి? చెప్పి చెప్పి ప్రాణం విసిగిపోయింది. చివరకా వున్న అస్త్రాలన్నీ కట్టగట్టి యెవరికో యిచ్చాం. అప్పట్నుంచి కొంచెం విశ్రాంతి కలిగింది.

నే: తమ శిష్యులందర్లో గట్టివా రెవరండీ?

ప: ఎవరేమిటి? గట్టివాడు కానివా డెవడు? అంతా గట్టివారే.

(16 వ పేజీ చూడుడు).

కథానిక

రాజీ

శ్రీ కొమరగిరి నరసింహారావు

"నాన్నా...నాన్నా!...నాన్నా!"

"ఊఁ."

"ఇటు చూడు నాన్నా."

"ఊఁ."

"అబ్బ, యిటు చూడమంటుంటే."

బలవంతంగా చేత్తో నా మొహాన్ని తనవైపుకు తిప్పుకొన్నాడు వాసు. ఇంక పనేం సాగుతుంది. వాడిని సమాధానపఱచి పంపిస్తేనేగాని పని సాగదు. ఉండీ, ఉండీ, వాడికేదో సందేహం కలుగుతుంది. ఆ సందేహనివృత్తి అయ్యేవరకు వాడికి తోచదు. ఏదో ప్రశ్నపరంపరలు కురిపిస్తాడు. మనం చెప్పే జవాబు వాడికి తృప్తి నివ్వదు. అర్థమూ కాదు. అయినా తప్పదు. కలం క్రిందపెట్టి వాడివైపుచూశాను, ఏమిటి అన్నట్టు.

"అ దేమిటి నాన్నా?" పూర్వాకాశంలో సూర్యుడి కడ్డంగా పరుగెత్తే మేఘశకలాలను కిటికీలోంచి తన చిరుహస్తంతో చూపిస్తూ అడిగాడు.

బాలభానుని కిరణకాంతిలో జలతారు తీగల్లాగా మెరిసే ఆ మేఘపు అంచులు కన్నుల పండువై బాలుడి కుతూహలాన్ని రేకెత్తిస్తున్నై. జలదమాలికలలోంచి రవి తన కిరణాలను నలువైపులా వెల్లువలుగా విరజిమ్ముతున్నాడు. ప్రభాతవాయువీచికలలో మేఘాలు దూదిపింజలలాగా పరువెత్తుతున్నై.

"ఏమిటి నాన్నా అదీ?"

మందహాసంతో ప్రకృతిశోభను తదేకదృష్టితో తిలకిస్తూన్న నా ముఖాన్ని మళ్ళీ తనవైపుకు తిప్పుకుంటూ అడిగాడు వాసు.

"అవీ మేఘాలు" అన్నాను.

"మేఘాలా?... ఎందుకు నాన్నా అట్లు పరుగెత్తుతూన్నై!"

వేగంగా గాలి వస్తూంటే ఆగలేక పరుగెత్తుతూన్నై."

"ఎంత దూరం పరుగెత్తుతాయి?"

"ఓ, గాలి ఆగేదాకా ఎంతదూరమయినా పరుగెత్తుతై."

"అయితే కింద పడిపోవూ మరీ?

ఇదీ వరుస. ఈ ప్రశ్నలకిక అంతూ పంతూ లేదు. ధారాపాతంగా కురుస్తూనేఉంటాయి. వీటన్నిటికీ జవాబు చెప్పాలంటే శాస్త్రంలోకీ, శాస్త్ర సిద్ధాంతంలోకీ దిగవలసివస్తుంది. అవన్నీ నాకే అర్థంకావు. ఆ చంటివెధవకేమర్థమౌతాయి.

అయితే, ఎలా వీణ్ణి వదిలించుకోవటం? ప్రొద్దెక్కుతోంది. ఆఫీసుకు వెళ్ళాలి. ఈ ఫైళ్ళన్నీ తిరగవేసి నోట్ పుటప్‌చేసి యీరోజు ఆఫీసులో సబ్‌మిట్ చెయ్యాలి. లేకపోతే ఆఫీసరును చూడటానికి మొహం చెల్లదు.

మెల్లిగా వంటయింట్లోకి పంపిస్తే కొంత బాధ తీరిపోతుందేమో ననిపించింది.

"ఒరేయ్, బాబూ, చూడూ. నేనూ, త్వరగా ఆఫీసుకు వెళ్ళాలిగనీ, అమ్మదగ్గరి కెళ్ళి వంటయిందేమో కనుక్కోరా." అంటూ వీపు తట్టి లోపలికి పంపించాను.

పరుగెత్తుకొంటూ లోపలికి వెళ్ళాడు.

మారాజ్యానికి వాసుమీద అమితమైన ఆపేక్షే గాని ఏదైనా పనిమీద ఉన్నప్పుడు చీటికిమాటికి పలకరిస్తూంటే ఆమెకు మహాచెడ్డ చికాకు పుడుతుంది. ఒక్కొక్కమాటు వాడిమీద కసురుకుని తనను నాలుగు తిట్టుకుని వాణ్ణి నాలుగు తిట్టి అవసరమైతే రెండు అంటించి నాదగ్గరకు పంపిస్తుంది. పిల్లల మనస్తత్వంమీదా, శిశుపోషణమీదా పుస్తకాలూ, ఏ పత్రికలూ చదువకుండానే వాసు పుట్టింతరువాత యీ రెండు మూడేండ్లూ గడచిపోతూన్నై ఆమెకు. తెల్లవారజామున లేచింది మొదలు రాత్రి పడుకోబోయేవఱకూ పనిమనిషి లేని యీ సంసారాన్ని రాట్నంలాగా పనిచేస్తూ ఎలాగో ఓలా దిద్దుకుపోతున్నది.

నాకూ, ఆఫీసు ఫైలుతోటీ, ఆఫీసర్ల చివాట్లతోటీ తలప్రాణం తోకకు వస్తూన్నా ఆ ఉద్ధరి జీతపు నీళ్ళల్లోనే యీతకొడ్తూ ఏదో రకంగా యీ జీవితసారవాహాన్ని ఆగకుండా నడుపుకు రావడంలో వాణ్ణిగురించి అట్టే శ్రద్ధ తీసుకోటానికి ఓపిక లేకుండావుంది. వాడూ అల్లరిపిల్లవాడు కాకపోయినా, ఆఫీసుఫైల్సులో కుతికలవఱకూ మునిగి మున్కొన్న చెవోత్త అనుకుంటూ గడియారం ఎప్పుడు పది కొడుతుందో అని నిమిషాలు లెక్కపెడ్తూ చికాకుగా ఉన్న సమయంలో ఏవో కుంటిప్రశ్నలతో అంతూపంతూ లేకుండా మాట్లాడిస్తూంటే సహించటం కష్టమైపోతూంటుంది. ఏదో పని చెప్పి మెల్లిగా వంట ఇంట్లోకి పంపించటం మామూలైపోయింది.

తిరిగి కాగితంమీద కలం పెట్టానో లేదో పరుగెత్తుకుంటూ వచ్చాడు వాసు.

"వంటయిందట నాన్నా, నిన్ను స్నానం చెయ్యమంది అమ్మ," అనుకుంటూ దగ్గరికి వచ్చాడు.

నాకు తెలుసుయింకా వంట అయివుండదని, ఈ మాట చెప్పేమిషమీద మళ్ళీ నాదగ్గరకు పంపించింది వాణ్ణి రాజ్యం.

"ఊఁ, సరేలే వస్తున్నా వెళ్ళు," తలవంచుకుని వ్రాసుకుంటూనే జవాబు చెప్పాను.

వాడు కదలలేదు. ఇంకా దగ్గరికివచ్చి రెండు మోచేతులూ నా వ్రాతపలకమీద మోపి తన గడ్డాన్ని అరచేతుల్లో నిలిపి దీర్ఘంగా నేను వ్రాస్తున్న అక్షరాలకేసి చూస్తున్నాడు. నేను తోణకలేదు.

ఉండీ, ఉండీ, తలయెత్తాడు. ఏదోఆలోచన తట్టింది కాబోలు.

"నాన్నా, అమ్మ నీకేమవుతుంది నాన్నా?" అని నాముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

పనితొందరలో ఒక చెంపన చికాకుగా ఉన్నా నాకు నవ్వు ఆగలేదు. వాడికీ ప్రశ్న ఎందుకు తట్టిందో! అవును, ఎప్పుడూ ఆ ఒరేయ్ ఒరేయ్ అని పిలవటంతప్ప ఒక వరుసగానీ ఒక పేరనగానీ పిలిచిన పాపాన పోలేదాయెను, మరి.

ఏదో విధంగా సమాధానం చెప్పినా అది ఇంకో ప్రశ్నకు దారితీయటంతప్ప మరేమీ ప్రయోజనముండదనీ, ఆ భారం తల్లిమీదనే పడేస్తేవాడూ, అదీ ఏమైనా తంటాలు పడనిమ్మనీ అనుకుని "ఒరేయ్, నాకు తెలియదుగాని మీ అమ్మ నడుగు పో, చేపుతుంది" అని మళ్ళీ వంటయింటిముఖంగా తిప్పి పంపించేశాను.

"అమ్మోయ్, అమ్మా!" అని కేకలేస్తూ వాడు లోపలికి పరుగెత్తాడు.

చురచురా ప్రొద్దెక్కుతున్నది. తొమ్మిది గంటలు కావస్తున్నది. కావలసిన పనిలో సగం కాలేదు. తలచుకుంటే గుండె దడదడలాడుతున్నది. ఎలాగూ ఈ రోజు మళ్ళీ చివాట్లు త్వరతప్పవు. త్వరగా ఆ కాస్తా ఏదో విధంగా పూర్తిచేసివాళ్ళమొగాన పారేస్తే సరిపోతుందంటే బొత్తిగా చెయ్యిసాగటంలేదు. తొందర పడ్డకొద్దీ ఇంకా నాలుకు కొట్టివేతలూ తుడుపులూ పడి ఆ చేసినపని కాస్తా పాడైపోవటంతప్ప మరేమీ ప్రయోజనముండదు. పోనీ, యీ ఒక్కరోజూ శెలవుపెడ్దామా అంటే— ఏం లాభం? ఒక్కరోజుతో సరిపోతుందా, రోజూ యిదేఅవస్థగా! ఈ గుమాస్తా బ్రతుకు దినగండం నూరేళ్ళాయుస్సుగా తయారయిందాయెను.

ఏమయితే అదే అయింది, ఈరోజు కిక కట్టిపెట్టి త్వరగా స్నానంచేసి నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని దోవన బడ్డామని మెల్లగా కాగితాలన్నీ కట్టగట్టి లేవబోతూండగా......

"రామ రామ రామ! ఎల్లా చచ్చేదండీ వీడితోటీ; అస్తమానమూ ఒకటే గోల! తలా తోకా లేని ప్రశ్నలు వేస్తూ బొత్తిగా పని సాగనీయడాయెను. కాసేపు మీ దగ్గర వుంచుకో గూడదుటండీ, ఆ కాస్త వంటా అయిందాకా?" అని పిల్లవాడి రెక్కపట్టుకుని లాక్కొచ్చి నాకేసి చూసి ఉరుముతూన్న మా రాజ్యానికి కండ్లప్పజెప్పి మళ్ళీ కుర్చీలో కూలబడ్డాను.

"చూస్తారేమండీ మాట్లాడకుండానూ?"

"ఊఁ. ఏం మాట్లాడమంటావు, కనపట్టల్లా నా కాయితాలూ నేనూ! వాడిక్కడ కూచుంటే నా పనేమయినా సాగాలా?" కాస్త కుదురుకుని ప్రత్యుత్తరంగా ఎదురు ప్రశ్న వేశాను.

రాజ్యానికి యింకా కొంచెం వేడెక్కింది.

"మరి తొమ్మిదింటి కల్లా వంట కావాలని పురమాయిస్తుంటే ఎలా అవుతుంది చెప్పండి. వాడు వంట యింట్లోకి వస్తే ఒక పనికి నాలుగు పనులు కలిపిస్తాడు. ఉదయంపూట కాసేపు వాణ్ణి మీ దగ్గరవుంచుకోక పోతే తొమ్మిదింటికి వంట కావటం కష్టం. తరువాత నామీద కోప్పడి ఏమీ లాభం ఉండదు. మీ యిష్టం."

"అయితే యింట్లో వున్న యీ కాసేపయినా కొంత స్థిమితంగా రాసుకోకపోతే యీ లెక్కలన్నీ ఎల్లా తయారైయేడుస్తై? ఆడదానిని అంతమాత్రం వాణ్ణి సవరించుకోలేకపోతే మొగవాణ్ణి, ఆఫీసుకు వెళ్ళవలసినవాణ్ణి నేను వళ్ళో పెట్టుకుని కూర్చుంటూనా ఏం వాణ్ణి?"

"ఏమో అదంతా నాకేం తెలుస్తుంది. అన్నీ దర్జాగా సాగాలంటే ఒక వంటమనిషిని పెట్టుకోండి. నేను వాణ్ణి పట్టుకుని కూర్చుంటాను. మీ యిష్టమొచ్చినంతసేపు రాసుకుని హాయిగా తొమ్మిదింటికల్లా భోంచేసి ఆఫీసుకు వెళ్ళవచ్చును." అని గిరుక్కున వెనక్కు తిరిగింది.

"ఏడిశావులే, నోరు ముయ్యి." నాకు వళ్ళు మండి అనేశాను.

రాజ్యం నా మాట వినిపించుకోకుండానే వెళ్ళిపోయింది.

ఎల్లాగూ మీరు వెళ్ళింతరువాత ఒక్క నిముషంపాటు మేనువాల్చకుండా వాడితో నేను సతమతమవుతూంటానుగదా, యింట్లో ఉన్నప్పుడయినా మీరు కాస్త వాణ్ణి దగ్గరకు తీసికోగూడదా అని రాజ్యం వాదన.

అవును పాపం నిజమే ననిపిస్తుంది.

అయినా రెక్కలూ డొక్కలూ విరుచుకుని నేను సంపాదిస్తున్నానుగదా ఆడది ఆ మాత్రం వాణ్ణి సవరించుకు పోలేదా అని నా ప్రతివాదన.

ఇదీ నిజమే మరి. వెన్నెవరు పాపం తలుస్తారు?

ఆ రోజు ఎందుకో నాకు కోపం వచ్చింది. రాజ్యంకూడా తరువాత అంత సుముఖత చూపించలేదు.

గబగబా స్నానంచేసి నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని లేచేసరికి ఆఫీసువేళ కానే అయింది.

౨

సాయంకాలం ఆఫీసునుంచి యింటికి వచ్చేసరికే చీకటిపడిపోయింది. రాజ్యానికీ, నాకూ స్పష్టంగా పరస్పర ముఖావలోకనం జరుగకుండానే యిద్దరి భోజనాలూ ముగిసినై. వాసు నేను వచ్చేసరికే అన్నం తిని నిద్రపోయినాడు.

మామూలుగా కాగితాలూ, అవీ చూసుకుని పైకి వెళ్ళేసరికి పదకొండు గంటలయింది. ఉత్ఫుల్ల చంద్రికలో తెల్లని మా పాన్పులు నిర్మల సరోవరతరంగచాలితసిత పుండరీకాలలాగా తళతళా మెరిసిపోతున్నై. పున్నాగచెట్లల్లోంచి దూసుకుని రివ్వున వీచే మలయానిలం సుకులు తిరిగి హాయిగా కాగలించుకుని మత్తు కలిగిస్తూన్నది.

కండ్లు మూసుకుని పడుకున్నా ఎంతసేపటికీ నిద్రపట్టలేదు. ఆ వైఖరీ అదీ గమనిస్తే మా రాజ్యంగూడా నిద్రపోతూన్నట్టులేదు. నిశ్చలంగా అటువైపు తిరిగి పిల్లవాడిమీద చెయ్యి వేసుకుని ముడుచుకుని పడుకున్నది. ఉదయం జరిగిన కొద్ది ఘర్షణకూ యిది ఫలితం కాబోలు.

పాపం, అదృశ్యం చూస్తే నాకు జాలివేసింది. నా చేయి మెల్లిగా కదిలింది.

రాజ్యం ఉలిక్కిపడి యింకా కొంచెం గట్టిగా ముడుచుకుంది. జడలో ముడిచిన మల్లికా వాసనలు ఆమె ధరించిన ధవళాంబరాన్ని అలముకుని గాలిలో కలసి నన్ను మరీ ఉన్మత్తుణ్ణి చేసినై.

"ఇదిగో చూడూ, మాటా" అంటే అంటకుండా కదిలించి పిలిచాను.

"అబ్బ, ఉండండీ," అని విసుక్కుని బిగుసుకుంది.

"కోపం వచ్చిందిటోయ్, యింతమాత్రానికే యిదయితే ఎల్లా వ్యవహారం? ఏమిటో చెప్పు మరీ సంగతీ" అని బుజ్జగిస్తూ నా వైపుకు తిప్పుకున్నాను.

ఈమాటు అట్టే ప్రతిఘటన చూపించలేదు రాజ్యం.

"ఏం చెయ్యమంటావు చెప్పు, ఏదో చికాకుగా ఉన్నప్పుడే యింకా కాస్త చికాకు కలిగిస్తుంటావు." నన్ను సమర్థించుకున్నాను.

"ఏం చికాకు కలిగించానండీ, చీటికి మాటికి మీకే కోపం వస్తూంటుంది గానీ," ముద్దుగా జవాబు చెప్పింది శ్రీమతి.

ఇంతలో వాసు నిద్రలో అటూ యిటూ పొర్లాడు.

"వాడికి చలి పుడ్తూన్నదేమో పాపం, దుప్పటి కప్పరాదూ" అన్నాను.

రాజ్యం దుప్పటికప్పి నావైపు తిరిగి ఎందుకో నవ్వింది. నాకూ నవ్వు వచ్చి కొంటెగా నవ్వాను.

"మరి, మనం ఏదోవిధంగా రాజీపడ్తే బాగుంటుంది— ఏమంటావు? వాడికోసం మనం రోజూ యిలా కీచులాడుకుంటూంటే ఏం బాగుంటుంది?" మళ్ళీ ప్రస్తావించాను.

"ఇంకా రాజీ ఏముందిలెండి. కొద్దికాలంలో దానంతట అదే కుదురుతుంది." ఏదో వింత సిగ్గుతో రాజ్యం జవాబుచెప్పింది.

"ఏం, ఏమిటది, ఎల్లా కుదురుతుందీ?"— నా కాశ్చర్యం వేసింది.

"ముందీనాటిదాకా ఓపిక పడ్తే మన ఇద్దరికీ చెరొకరూ సరిపోతారు, ఒక్కడిమూలంగా పోట్లాడుకోకుండా." వ్యంగ్యంగా చిరునవ్వు చిలుకుతూ అన్నది రాజ్యం.

"ఏమిటీ, చెప్పవేం మరి,"

కందిపోయిన బుగ్గలను తుడుచుకుంటూ, "చెప్పకపోతే ఏమీ ఆగదులెండి. విదియనాడు కనపడని చంద్రుడు తదియనాడు తానే కనిపిస్తాడు." అన్నది.

"అలాగేం, ఏదీ, యిటు చూడూ." గులాబిరంగు నునుచెక్కిలి స్పృశిస్తూ కండ్లల్లో చూశాను.


సిగ్గుతో తలవంచుకుని కిలకిలా నవ్వింది నా రాజ్యం. ఆ సుమధురహాసంలో వేయి మల్లియలు వికసించి వెన్నెలను పరిహసించినై.

తీవిగా నా చేతుల్లోకి తీసుకున్నాను. మందస్మితంతో మారుమాటాడక నా గాఢాశ్లేషంలో ఒదిగిపోయింది నా రాణి రాజ్యం.



కష్టసుఖ విచారణ

ఢిల్లీలో కాశ్మీరు కాందిశీకుల శిబిరాలను అవలోకిస్తూ, వారి యోగక్షేమాలు కనుక్కొంటున్న మహారాజా మహారాణీలు.



విశాల ఆం


ఇప్పుడున్న తెలుగుజిల్లాలతో కలిపి, ఇంకా కొన్ని
వలెనంటూ, రాజ్యాంగపరిషత్తు పంపున ఈ ప్రాంతానికి
సర్వత్రా సోపపత్తికంగా నివేదించిన విశాల ఆంధ్రరాష్ట్ర



ఒక్క తన చిత్రాలతోనే ఢిల్లీలో ఆ మధ్య ఒక చిత్రకళాప్రదర్శనం ఏర్పాటు చేసి, కళావేత్తల మెప్పులుపొందిన సుప్రసిద్ధ భారతీయచిత్రకారిణి శ్రీమతి సుశీలా యావల్కార్.



★



ఆమె తయారుచేసిన ఒక త్రివర్ణచిత్రం తాలూకు నకలు. దీనిపేరు 'వార్తా వ్యామోహం'

రాజమండ్రిల

రామపాదసాగ
ప్రాజెక్టు మహా

★



సభాధ్యక్షులు
సర్ తొంతిరామమూర్తిగారు.

అధ్యక్షులకు
పారమహాళయుల స్వా

★

★




భోజనవేళలో ఇష్టాగోష్ఠి.
రామమూర్తిగారు;
కళా వెంకటరావుగారు.

★

కొండా వెంకటప్పయ్య
గారి ప్రారంభోపన్యా

★



...ష్ట్ర స్వరూపం
...లు అవతరించనున్న ఆంధ్రరాష్ట్రంలో తప్పనిసరిగా చేరితీర
... వచ్చిన భాషారాష్ట్రసంఘానికి ఆంధ్రమహాజనులు సర్వే
... ప్రాంతాలు.



పెద్దలతో మంతనాలు

కాంగ్రెసు అధ్యక్షుడు రాజేంద్రప్రసాదుగారితోను, సర్దార్ పటేలుగారితోను మద్రాసుకొత్త గవర్నరు, ప్రధానుల మంతనాలు.


★

కన్నులు, చెవులు లేని కబోది... అయితేనేం ?

మిస్. హెలెన్ కెల్లర్ అనే ఈమెకు చిన్నవాడే చెవుడూ, గ్రుడ్డితనమూ రెండూ దాపరించినవి. కాని, ఏదో భగవంతుని దయవల్ల, అనిర్వచనీయమైన ఒకానొక శక్తి ఆంతరికంగానే ఏర్పడి, ఈమె ఈనాడు ఒక సుప్రసిద్ధ గ్రంథకర్త్రిగాను, ఉపన్యాసకురాలుగాను, సాంఘిక సేవకురాలుగాను పెద్ద పేరుకెక్కింది. ఇప్పుడీమె తన ఉద్యమం పనిమీద ప్రపంచపర్యటనం చేస్తూ, చెవిటి గ్రుడ్డివారికి అపారమైన ఆశను కలిగిస్తున్నది.

★









యమునానది వరదలు

ఈమధ్యనే, పెద్దవరదలువచ్చి, బ్రహ్మాండంగా పొంగి, పరిసరప్రదేశాలనన్నిటిని ముంచివేసిన యమునానదిదృశ్యము.



"ఉల్లి" కథ

చి॥ నడుపల్లి సూర్యనారాయణరావు

అనగనగా, ద్వాపరయుగంలో ఒక మునీశ్వరు డుండేవాడు. అతడు శివుని గూర్చి ఘోరతపస్సు చెయ్యడం మొదలు పెట్టాడు. అల్లా చెయ్యగా చెయ్యగా, కొంత కాలానికి శివుడు ప్రత్యక్షమయి "ఓ మౌనిచంద్రా! నీ తపస్సుకు మెచ్చాను. ఏం కావాలో కోరుకో" మన్నాడు. అప్పుడా ముని "ప్రభూ! నా కొరకై యేమీ అక్కర లేదు. కాని కలియుగం దాపరించబోతోంది. అప్పుడు మానవుని జీవిత పరిమాణం చాలా స్వల్పం గదా. ఆ పరిమాణం హెచ్చించేందు కేదైనా త్రోవ చూపించాలి." అని వేడుకొన్నాడు. అప్పుడు శివుడు చెప్పాడు కదా—"అయ్యో, ఎంత పొరపాటు చేశావోయ్! ఇందులో నా ప్రసక్తి యేముంది గనక. నేను లయకారకుడను మాత్రమేగదా. సృష్టికర్త అయిన బ్రహ్మను వేడుకో" మన్నాడు.

అప్పుడా ముని బ్రహ్మను గూర్చి యింకా యెక్కువ శ్రద్ధతో తపస్సు చేశాడు. కొంత కాలానికి బ్రహ్మ సాక్షాత్కరించి "యేం కావాలో కోరుకో" మన్నాడు. మునుపటిలాగే "కలియుగంలో ఆయుస్సు పొడిగించడానికి సాధనం చూప"మని వేడుకొన్నాడు. అప్పుడు బ్రహ్మ చెప్పాడు కదా— "అయ్యో, తిరిగి పప్పులో కాలు వేశావ్! నా పని సృష్టించే వరకే నామెను. ఆ తరువాత స్థితికారకుడైన విష్ణుమూర్తిదే. నీ పని సఫలం కావాలంటే విష్ణువును ప్రార్థించు" అన్నాడు.

ఈ మారు ముని యింకా యెక్కువ భక్తితో విష్ణువుని గూర్చి తపస్సు చేశాడు కొంతకాలానికి విష్ణుమూర్తి ప్రత్యక్షమయి "యేం కావాలి మునీశ్వరా! వేడుకో" మన్నాడు. అప్పుడా ముని "కలియుగంలో మానవుని జీవితకాలం ఎక్కువ చెయ్యడానికి మార్గం చూపించాలి" అని ప్రార్థించాడు. అప్పుడు విష్ణుమూర్తి "చాలా చిక్కు సమస్య తెచ్చి పెట్టావే! ఇది నా ఒక్కడి వల్లనా జరిగేది కాదు. శివ బ్రహ్మల సహకారంతో సాధించాలి దీనిని. సరే, వెళ్ళు"మని మునిని పంపేశాడు.

ఆ తరువాత బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురూ, మూడు రాత్రులు, ముచ్చమటలూ పోసేటట్లుగా మంత్రాంగం చేసి చివరకు ఒక వస్తువును తయారుచేశారు. ముగ్గురూ కలిసి తయారు చేసింది గాబట్టి ముగ్గురి పోలికలూ అందులో వుండాలన్నారు. బ్రహ్మకు మాదిరిగానే దాని కొక 'పిలక'. శివునికి మల్లేనే బూడిద వర్ణం కలిగిన పలుచని పైపొర. ఇంక విష్ణువు సాదృశ్యం రావాలి. నిలువుగా కోస్తే 'శంఖము'ను, అడ్డంగా కోస్తే 'చక్రాన్ని' పోలి వుండేటట్లు తయారుచేసి, శుభముహూర్తాన బ్రహ్మగారిచే 'ఉల్లి' అని నామకరణం చేయించారు. "కలియుగంలో దీనిని సేవించినవారి కందరికీ ఆయుర్వృద్ధి, మోక్షప్రాప్తి కలుగుగాత!" అని శివుడు, విష్ణువు ఆశీర్వదించారు.

కలికాలం ప్రారంభించింది. జనులంతా ధర్మపరులై, భగవదాజ్ఞననుసరించి, 'ఉల్లి'ని సేవించి మోక్షం పొంది, స్వర్గలోకానికి వెడుతున్నారు. అందరూ స్వర్గానికే వెడితే, అక్కడ మట్టుకు చోటేదీ? దేవతలంతా వెళ్ళి ఇంద్రునితో మొరబెట్టుకొన్నారు. "అయ్యా, స్వర్గంలో యెక్కడ చూసినా మానవులే. మాకు నిలువ నీడ లేకుండా వున్నది. యేం చెయ్యమంటారో, సెలవియ్యండి" అని.

దేవేంద్రునికీ యేం చెయ్యటానికీ తోచలేదు. దేవతలు వెంట రాగా, ఇంద్రుడు వెళ్ళి విష్ణువుతో చెప్పుకొన్నాడు తమ పరిస్థితి. అప్పుడు విష్ణుమూర్తి అన్నాడు గదా— "నే నొక్కడనూ యేం చెయ్యగలను. శివబ్రహ్మలను పిలవండి. ఆలోచిస్తాం" అన్నాడు.

తిరిగి బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురూ మూడు ఘడియలు సంప్రతించారు. ఆ ఉల్లికి ప్రత్యేకమైన 'వాసనలను' కల్పించి, కొన్ని 'విధి, నిషేధాలు' యేర్పరిచారు. అప్పటి నుంచీ కలియుగంలో కొందరు బయలుదేరారు. వారు 'ఉల్లి' నిషిద్ధమనిన్నీ దాని వాసన పాపభూయిష్ఠమనీ శాసించారు. అందుకనే గాబోలు, శుద్ధ శ్రోత్రియ బ్రాహ్మలు చేతితో నైనా ముట్టుకోరు 'ఉల్లి'ని.

గొప్పవాడెవడు...?

పిల్లల కథ

చి॥ "మం. సు."

హాతీము ఇరానుదేశపునివాసి. అతను చాల దయామయుడు. ప్రజలకు అతడు ఇష్టుడు. అతడిని జనులు గౌరవించుచుండిరి.

ఒక రోజున హాతీమును ఒక స్నేహితుడు కలుసుకొనెను.

మాటలసందర్భమున—

"హాతీముగారూ, మీరు ఎప్పుడైనా మీకన్న గొప్ప మనిషిని చూశారా?" అని అడిగెను.

"ఆ, చూశానండీ" అని హాతీము జవాబుచెప్పెను.

"ఎక్కడ?" అని స్నేహితుడు ప్రశ్నించెను.

హాతీము, "వినండి" అని ఈ క్రింది విధముగా చెప్పెను:

"ఒకరోజున నేను పట్టణవాసులందరిని గొప్ప విందుభోజనమునకు పిల్చితిని. ఆరోజు మాఇంటికి గొప్పవారు, బీదవారు, న్యాయవాదులు, వైద్యులు, అధికార్లు, అందరూ వచ్చిరి విందారగించిరి.

"నేను ఆ రోజున ఏదో పనిమీద ఊరిబైటికి పోయితిని. అచ్చట ఒక కట్టెలవాడు చెట్టునెక్కి కట్టెలు కొట్టుచుండెను. "నేను వానిని సమీపించితిని.

'ఏమోయ్! ఇక్కడ వున్నావు? హాతీమునవాబుగారి యింట్లో గొప్ప విందుకదా? నీవు అచ్చటి కెందుకెళ్ళలేదు?" అని అతనితో పలికితిని.

"అంత కట్టెలవాడు ఇట్లుచెప్పెను;

'అయ్యా! క్షమించండి. నా రెక్కలలో బలం వున్నంతవరకూ నేను హాతీమువద్దకు పోయి ఏల చేయి చాచవలెను.' అని పలికెను.

"చూశారా, అతడే నాకన్న గొప్పవాడు" అని హాతీము పలికినమీదట స్నేహితుడు వెడలిపోయెను.

బాలలూ, మీరు నీతిని గ్రహించారు కదూ?

బాలగేయాలు



నీ నీడ

ఎమ్. ఎస్. ఎమ్.


అంతా నేనే
ఎవరోయి
వెనక—
చొక్కా
లాగూ
టోపీ
పెట్టి
ఎవరోయి
వెనక—

౨

ఎవరోయి
నే కూర్చున్నా
అది కూర్చుంది
నే నుంచున్నా
అది నుంచుంది.
కొడతానంటే
చేతులు-ఎత్తిన తానూ ఎత్తును
ఎవరోయి—అంతా నేనే—
కాళ్లూ—నావే
చేతులు—నావే
నోరూ, ముక్కూ
అంతా నేనే
ఎవరోయి—

3

నేను విడచినా
తాను విడవదు
చాలారోజుల
నుండీ స్నేహం
నా ప్రియురాలోయ్
చెప్పకో చూదాం
అమ్మ చెప్పింది
నా కొకసారి—
అది మన నీడోయి
భయ మొద్దోయి.



కురువిందం

శ్రీ యామర్తి గోపాలరావు

కురువిందం నవరత్నాల్లో ఒకటి. వాటిని ఇంగ్లీషులో 'కొరండం' అంటారు.

కురువిందాలు భారతదేశంనుంచి అనాది కాలంనుండే ఇతరదేశాలకు వ్యాప్తి పొందినట్లు తెలుస్తుంది. లోకం వీటిని అనేకరీతుల ఉపయోగించుకొంటున్నది. ఇందుకు దీని కఠినత్వమే ముఖ్యకారణం.

ప్రస్తుతః, స్వచ్ఛమైన కురువిందానికి ఎటువంటి రంగూ ఉండదు. ఇనుము, క్రోమియమ్, టైటానియమ్ మొదలైన మలినపదార్థాలు వీటిలో ఉండటంవల్ల ఇవి వివిధరంగు లేర్పడుతున్నవనీ, కెంపులూ, మాణిక్యాలూ, నీలాలూ, ఇంద్రనీలాలూ కురువిందపు వివిధరకాలనీ ఆంగ్లేయుల అభిప్రాయం.' కాని మనవాళ్లు దేనికి దానికి వేరుగా భావిస్తారు. ఎటువంటిరంగూ లేని స్వచ్ఛమైన కురువిందాలని గురించిమాత్రం ఈ వ్యాసంలో వివరిస్తాను.

కురువిందాన్ని ప్రాచీనకాలంనుంచీకూడా ఈజిప్టుదేశస్థులు శిలాప్రతిమలు చెక్కటానికి ఉపయోగించినట్లు తెలుస్తుంది. కురువిందశిలలను ఒరిపిడిరాళ్లక్రింద ఉపయోగించడం అనేది గ్రీకుదేశంలోని నాక్సోస్‌దీవిపైనున్న కేప్ ఎమరీ ప్రాంతంలో అనాదినుంచీ అలవాటైంది. కాని వీటిని విశేషంగా గడచిన శతాబ్దంనుంచి మాత్రమే ఉపయోగిస్తున్నారు.

ఉనికి

కురువిందం సాధారణంగా అల్యూమినియం ఎక్కువగాఉండే ప్రదేశాల్లో లభిస్తుంది. అల్యూమినియం ఎక్కువగా ఉండే రేగడిమన్ను గనక రూప పరిణామం చెందితే కురువిందం ఏర్పడుతుంది. ఇటువంటి కురువిందంలో సిలిమనైటు, కియొనైటు, ఏండలసైటు మొదలైన ఖనిజాలు ఉంటవి. ఇదేమాదిరిగా నున్న పురాయిలోని అల్యూమినియం స్ఫటికరూపంలోకి పరిణామం చెందినపుడు కురువిందం ఏర్పడుతుంది. సాధారణంగా ఇది శిలాస్ఫటికపు (Quartz) పరిసరాల్లో దొరకదు. వజ్రాలమాదిరిగా ఇవికూడా పర్వతసానువుల్లోను, నదీతీరాల్లోను లభిస్తవి.

భారతదేశంలో సోనాపహార్ ప్రాంతంలో ఉన్నపర్వతాల్లో కురువిందశిలలు బాగా లభిస్తవి. ఇచ్చట, 200 గజాల విస్తీర్ణతగల ఒక పెద్ద రాయి ఉంది. దీనినుంచి, కొన్నివందల టన్నుల, బరువుగల కురువిందపురాళ్లు దొరుకుతవి. ఈ ప్రాంతంలోని, కురువిందశిలల్లో, నూటికి 88.25 పాళ్లు అల్యూమినియపుభస్మం, 10.28 పాళ్ళు, ఇసుక ఉన్నట్టుగా భూగర్భశాస్త్రజ్ఞులు తెల్పుతున్నారు. ఇంకా రేవా సంస్థానంలోని పిప్రాప్రాంతంలో ఎక్కువగా లభిస్తుంది.

ప్రపంచమంతటికీ రత్ననిలయమైన సింహళంలో, కురువిందాలే కాకుండా, వీనియొక్క వివిధరకాలు లభిస్తున్నవి. ఇచ్చటి పశేల్ వాల్లేనియా అన్నది వీటికి పేరెన్నికగన్న ప్రదేశం. హైదరాబాదు సంస్థానంలోకూడ కురువిందం లభిస్తున్నట్లుగా వినికిడి.

ఇకపోతే, మన మద్రాసు రాజధానిలో అనంతపురంజిల్లాలో చాలాచోట్ల లభిస్తున్నట్టుగా నిదర్శనాలు కనిపిస్తున్నవి. అనంతపురం, ధర్మవరం, హిందూపురం, కళ్యాణదుర్గం తాలూకాల్లో ఎక్కువగా దొరుకుతున్నవి. తిరుపతికి 24 మైళ్ల దూరంలోఉన్న బొంబత్తిపూడి వద్ద కోడిగ్రుడ్డంత కురువిందశిలలు లభిస్తున్నట్లుగా తెలుస్తున్నది వీటన్నిటికంటె ముఖ్యంగా సేలంజిల్లా కురువిందశిలలకు బాగా ప్రసిద్ధి. పాపరపత్తి, పాలకోడు ప్రాంతాల్లో, సీతంపూడిలోనూ దొరుకుతవి. సీతంపూడిలోని శిలలు 10 మైళ్ల పొడుగున, 4 మైళ్ల వెడల్పున వ్యాపించుకొని ఉన్నవి. ఇవిగాక, కురువిందశిలలు కావేరీనదిఒడ్డునకూడా 40 మైళ్లదాకా ఉన్నట్టు వాడుక. ఇవిగాక ఇంకా ఉప్పనగూడిదగ్గర, వేత్రావతీనదీశయ్యలపైనగూడ లభిస్తవి.


మైసూరు సంస్థానంలో, బెంగుళూరు, హాస్సన్, కాడూరు, కోలారు, తుంకూరు, జిల్లాల్లో దొరుకుతున్నట్లుగా, మృత్పాషాణశాస్త్రజ్ఞులు (Geologists) తెల్పుతున్నారు. కల్యాడి అనే ప్రాంతంలో 3000 చదరపు అడుగుల విస్తీర్ణంగల ఒక కొండ ఉన్నదట. దీనినుండి లభించే మూడువేలటన్నుల కురువింద శిలలనుండి 500 టన్నుల కురువిందాన్ని సంపాదించవచ్చునని మృత్పాషాణశాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు.

స్వాభావికమైన కురువిందం

అస్సామ్, రేవా సంస్థానాల్లో లభించే కురువిందశిలలు పెద్దవిగా ఉండటంవల్ల వాటిని ఇనుపసమ్మెటలతో పగులకొట్టి, చిన్నచిన్న ముక్కలుగా చేసి అమ్ముతారు. స్ఫటిక కురువిందం శిలల్లాంటి కురువిందంకంటె విలువ ఎక్కువ. పెద్దకురువింద స్ఫటికాలు చిన్నవాటికంటె ఎక్కువగా అమ్ముడుపోతవి. సాధారణంగా, ఒరిపిడిపనుల కుపయోగించే కురువిందానికి విడబడిపోయే ధర్మం ఉండకూడదు.

సహజ గుణాలు

అల్యూమినియపు భస్మం స్ఫటికరూపం దాల్చినపుడు కురువిందం ఏర్పడుతుంది. ఇది వివిధమైన రూపాల్లో స్ఫటికత్వం పొందుతుంది. ముఖ్యంగా షడ్భుజిగానో, అవాగ్రంమాదిరిగానో, లేక పిరమిడ్లనుబోలిన రూపంలోనో ఏర్పడుతుంది. ఈ స్ఫటికాలు అటు పూర్తిగా కాంతినీ ప్రసరించనిచ్చే గుణం కలిగినవీ కావు, ఇటు కిరణప్రసారణయోగ్యమైనవీ కావు.



బ్రిటనులో ఒకానొక బంకమంటి కార్ఖానాయందు బంకమంటిని శుద్ధిచేసి, అవసరమైన పాకానికి తెచ్చుటకుగాను నిర్మింపబడిన పాదులు—అందుకై అమర్చిన సాధన సామగ్రి.

మధ్యరకానికి చెందుతవి. అంటే, కొంతవరకు మాత్రమే కాంతిని ప్రసరింపచేస్తవి.

కురువిందాలని గుర్తించటానికి ఒక చిత్రమైన రసాయనిక పరీక్ష ఉంది. బొగ్గును తీసికొని దానిలో ఒక గుంట చేసి, గుంటలో, మెత్తగా పొడిచేసిన కురువింద చూర్ణాన్ని ముందు పోయాలి. ఈ మిశ్రమాన్ని, బాగా ఎఱ్ఱపడేటట్లు కాల్చి, కోబాల్టు నైట్రేటు ద్రావణాన్ని ఒకటి రెండు చుక్కలు గనక వేస్తే, ఈ కాల్చిన ప్రదేశమంతా బాగా నీలంగా మారుతుంది. వీని తారతమ్య సాంద్రత 3.9 మొదలు 4.1 వరకు మారుతూఉంటుంది. పది, వజ్రపు కఠినత్వమైతే, తొమ్మిది, కురువిందపు కఠినత్వాన్ని సూచిస్తుంది. పీడనశక్తికీ, ఉష్ణశక్తికీ ఎట్టి మార్పూ పొందదు. ఆమ్లక్షారాలంటే అసలే భయం లేనిదీ కురువిందం.

ఉపయోగాలు

కురువిందాలు, కఠినతరమైనవి గావటంవల్ల ఎక్కువగా ఒరిపిడి, రాపిడిపనుల్లో ఉపయోగిస్తుంటారు. వీన్ని ఆభరణాల్లో అంత ఎక్కువగా వాడరు. వీనికి ప్రకాశమూ, రంగూ లేకపోవటంవలన ఆభరణాల్లో పనికి రాదు. కాబట్టి వీటికి అన్నిరత్నాల మాదిరికాకుండా, ఆభరణాలకంటె ఇతర ఉపయోగాల్లో ఎక్కువ పలుకుబడి ఉంది. ప్రస్తుతకాలంలో, వీటిని, గడియారాల్లో, విద్యుత్ పరికరాల్లో, పరిశోధనల కుపయోగపడేటటువంటి అతిసున్నితమైన సాధనాల్లోనూ ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కురువిందంలో అల్యూమినియంఉంటుంది కాబట్టి, రాగి, ఇనుము, అల్యూమినియం మూడు కలిసిన మిశ్రలోహాలని తయారుచేయుట కుపయోగిస్తారు. మంచిరకపు కురువిందాలు, రత్నాలని మెరుగుపెట్టటానికీ గాజుమొదలైన పదార్థాల అంచులను నునుపుచేయటానికీ, మెరుగుపెట్టటానికీ ఉపయోగంలో ఉన్నవి. కాని, పైపనులకు, ఇవి మరీ కఠినంగా ఉండటంవల్ల, సాధారణంగా, వీటిలోనే, మరొకరకం 'ఎమరీ' అనబడేదాన్ని ఉపయోగిస్తారు. మనం మామూలుగా 'మెరుగు కాగితం' అనేది వీటితోనే తయారుచేస్తారు.

వీటన్నిటిని మించిన కురువిందపు ఉపయోగం, విసరటానికిగాని, పొడిచేయటానికిగాని పనికివచ్చే చక్రాలు తయారు చేయటంలో. ఈ చక్రాలను మామూలుగా గ్రేడింగు చేసిన, కురువిందపు పలుకులు కొన్ని రకాలైనబంధనపదార్థాలతో (Binding material) కలిపి తయారుచేస్తారు. ఇవి మూడువిధాలుగా చేస్తారు. కురువిందపు పలుకులూ రేగడిమన్నూ కలిపి, ప్రత్యేకమైన బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతవద్ద ఉడుకబెట్టి తయారుచేసేవి మొదటి రకం. రెండోరకం, సోడియం సిలికేటును, బంధనపదార్థంగా తీసికొని చేస్తారు. స్వచ్ఛమైన లక్క (Shellac) గాని, రబ్బరుగాని బంధనపదార్థంగా తీసికొని, తయారుచేసేవి మూడో రకం.

కృత్రిమ కురువిందం

ఉపయోగాలు ఎక్కువై, ఉత్పత్తి తగ్గుతున్నకొద్దీ కురువిందాన్ని కృత్రిమంగా తయారుచేయటాన్నిగురించి శాస్త్రజ్ఞులు పరిశోధన మొదలెట్టారు. ఈ పరిశోధనల్లో హెన్రీ మాయిజన్ మరికొందరూ కృతకృత్యులైనారు. విదేశాల్లో ఈ కృత్రిమకురువిందాన్ని వ్యాపారసరళిలో 'ఎలండమ్, ఎలాక్సైట్, లియొనైట్, బోరొలాన్, ఆక్సాలమా' అని అంటారు.

కురువిందంలో, అల్యూమినియపు భస్మం ఉన్నదికాబట్టి ఈ భస్మం ఉండే ఖనిజం బాక్సైటునుంచి దీన్ని తయారుచేస్తారు. మామూలుగా వీటిని తయారుచేసే బట్టీల్లో కర్బనపుదిమ్మె ఒకటి ఉంటుంది. దీనిమీద శంఖాకృతిలోని ఒక మూతలాంటిది బోర్లించిఉంటుంది. ఇది కదల్చటానికి వీలుగా ఉంటుంది. దీనిలో భస్మీభూతమైన బాక్సైటు, బొగ్గు, ఇనుపరజను మొదలైనవన్నీ ఉంచుతారు. ఈ బట్టీలో, కర్బనపు ఎలక్ట్రోడ్స్ ద్వారా, విద్యుత్‌చాప మొకటి ఏర్పరచి 2200° ఉష్ణోగ్రత దాకా వేడిచేస్తారు. ఈ ఉష్ణోగ్రతవద్ద లోపలఉన్న మిశ్రమమంతా కరగిపోతుంది. బొగ్గు, బాక్సైటులోని, ఆక్సిడములను గ్రహించి బొగ్గుపులుసువాయువుగా మారుతుంది. సిలికన్ ధాతువు అడుగుకు దిగుతుంది. ఇకపోతే, పరిశుభ్రమైన అల్యూమినియపు భస్మం మాత్రం పైన ఉంటుంది. పనివాళ్లు తమ చాకచక్యానిబట్టి, ఈ మిశ్రమంలో, నూటికి 95 పాళ్ళు అల్యూమినియపు భస్మం, $1\frac{1}{2}$ పాళ్లు సిలికా అరపాలు ఇనుపభస్మం, 3 పాళ్లు టైటానియం ఉండేటట్టు తయారుచేస్తారు. మిశ్రమం బాగా కరగియున్నప్పుడు ఎలక్ట్రోడ్సును బయటికి తీస్తారు కొంతసేపున్న తర్వాత ఈ శంఖువులాంటి మూతనెత్తి లోపలి మిశ్రమాన్ని చల్లారుస్తారు. అల్యూమినియపు భస్మం గడ్డకట్టుతుంది. దీన్ని ఒకవారంరోజులైన తర్వాత చితుకగొట్టి, చిన్నచిన్న ముక్కలుగా తయారుచేస్తారు. ఇవే కృత్రిమ కురువిందపు ముక్కలు. కొందరు పారిశ్రామికులు రసాయనికంగా శుభ్రపరచబడిన అల్యూమినియపు భస్మంనుంచీకూడా కృత్రిమకురువిందాన్ని తయారుచేస్తారు.


ఇలా తయారైన కురువిందం సాధారణంగా కొంచెం గోధుమ ఎరుపుగా ఉంటుంది. 2050 డిగ్రీ దాకా వేడిచేసినపుడుగాని కరగదు. ఇది కఠినంగా ఉండటమేకాకుండా మంచి ఒరిపిడి పనిముట్టుగా ఉపయోగపడుతుంది. కురువిందాన్నిలా ఉపయోగించినప్పుడు దీనిమొలికి చాల చిత్రంగా అరుగుతుంది. పాతమొలికి కొత్తమొలికి ఏర్పడేటట్టుగా అరుగుతుంది. ఇందువల్లనే ఇది ఒరిపిడి పనులకు చాలా ప్రసిద్ధి. ముఖ్యంగా ఇది విసరటానికీ, నూరటానికి, పొడిచేయటానికీ, రుబ్బటానికి ఎక్కువగా ఉపయోగపడుతుంది.

ఉత్పత్తి

ప్రపంచంలో సాలీనా కురువిందపు అమ్మకం షుమారు 20,000 టన్నులుంటుంది. యునైటెడ్ స్టేట్సు, కెనడా, దక్షిణాఫ్రికా, ఇండియా, మెడగాస్కర్, రష్యా మొదలైనవి కురువిందాన్ని బాగా ఉత్పత్తిచేసే దేశాలు.

భారతదేశంలో కురువింద సంపద సమృద్ధిగా ఉంది. అనాదికాలంనుంచీ ఈ రత్నాలకు భారతదేశంలోగల ప్రాశస్త్యాన్నిగురించి ఉత్తమ గ్రంథాలనుంచి తెలిసికొంటున్నాం. ఈమధ్య పట్టిన గ్రహణంమూలాన, భారతదేశం అధఃపాతాళానికి అడుగంటిపోయింది. కురువిందోత్పత్తిలో క్రమమైన విధానమూ, పట్టుదలా ఇనుమడించినప్పుడు, తిరిగి భారతదేశం కొంతవరకైనా, తన వెనుకటి ప్రతిష్ఠ నిలబెట్టుకోగల్గుతుంది.

సాహిత్యమీమాంస:



అభ్యుదయ సాహిత్యము

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

అభ్యుదయ సాహిత్య మను పేరుతో భారత దేశములోని అన్ని భాషలలోను నేడు అభ్యుదయరచయితలు బయులుదేరినారు. కాని ఒక రచయిత ఎప్పుడు అభ్యుదయరచయిత కాగలడో, ఏవిధముగా కాగలడో, కొంత విమర్శింపదగిన విషయము. మానవుడు అన్ని వేళల అభ్యుదయమును వాంఛించువాడే. వర్తమాన సమయమున నేదో కొరత గలదని, దానిని పోగొట్టుకొనవలెనని యత్నము చేయువారందరు నభ్యుదయమును వాంఛించువారే. ఇది సర్వసామాన్యముగా మానవులందరకు గల తుల్యగుణమే. ఐనను "మే మభ్యుదయరచయితల"మని చెప్పికొనువా రిట్లేల పల్కుకొనవలెనో తెలియరాదు. దీనను ప్రాచీన కవులను అభ్యుదయ రచయితలన జెల్లు రా!

మహాకవి కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలమును చూచి గొయిటే నర్తించినాడు; నేటికిని ప్రపంచ సాహిత్యమున నీ నాటకము ఉత్తమోత్తమమని పేర్కొనబడుచున్నది. నేటివరకు దీనిని మించిన నాటకము రాలేదు. అట్టి మహాకవి కాళిదాసు అభ్యుదయ రచయిత కాగలడా? "అభ్యుదయ రచయితను కావలె"నని ఈ మహాకవి వాంఛించి, శ్రమజెందినాడా? విక్రమాదిత్యుని పాలన నిరంకుశమని, ప్రజాస్వాతంత్ర్యమును రాజు నశింపజేసినాడని తీర్మానములను ప్రతిపాదించినాడా?

"ప్రవర్తతాం ప్రకృతిహితాయ పార్థివః" అని శాకుంతలమును పూర్తిచేసినాడు! ప్రజాహితము గోరి రాజు ప్రవర్తించవలెనని కోరిన మాట వాస్తవమే. కాని రాజుల నసమ్మానించ కొనలేదు. ప్రజలను, ప్రజాస్వాతంత్ర్యమును విస్మరించలేదు. అగ్నిమిత్రుడు రాజుగానుండగా కోరదగినదేమియు లేదని మాలవికను పూర్తిచేసినాడు. రఘువంశీయులు ప్రజాహితమునే వాంఛించినారని చెప్పినాడు. కాగా కాళిదాసు అభ్యుదయ రచయిత కాడని చెప్పగలమా? ప్రాచీన కావ్యమైనంతమాత్రమున సాధువని, నవీన మైనంతనే దుష్టమనీ అనరాదని చెప్పుచు సత్పురుషులను, విద్వాంసులను, కావ్యమును విమర్శించవలసినదిగా కోరికొనినాడు. విద్వాంసులు తృప్తిపడు వంతవరకు తన ప్రయోగవిజ్ఞానమున తనకే విశ్వాసము లేదని చెప్పకొనినాడు.

ఇక షేక్స్పియర్ మహాకవి అభ్యుదయ రచయిత కాగలడా? మాస్కోలోని బోల్షోయి థియేటరులో నేడు కూడా సామాజికులు క్రిక్కిరిసి కూర్చొని, షేక్స్పియరు నాటకముల నానందించుట కలదు. ఇతని నాటకాలలో ఎలిజబెత్, జేమ్సుల పొగడ్త కలదు. రాచరికమును చక్కగా పోషించినాడు. ఆర్థిక విషయములను వదలి, మానవుల చిత్తవృత్తులే ముఖ్యము అని, వానినే ప్రధాన విషయముగా గ్రహించినాడు. ఇదేవిధముగాగాని, ఇంతకన్న హీనముగాగాని, ఎవరైనా మంచి నాటకములను వ్రాయగలరు. కాని అభ్యుదయనాటకము లెట్లుండునో తెలియదు. షేక్స్పియర్ పొందలుపారివి అభ్యుదయ రచనలు కాకపోయినను, మాస్కోలో ప్రదర్శింపబడుచున్నను, ఇట్టివారిని అభ్యుదయ రచయితలుగా నేటి ఈ నామధారులు స్వీకరించగలరా? వీరు తమ సంఘములో సభ్యులనుగా కాళిదాసాదులను చేర్చుకొనలేరు. అనగా నశేక మహాకవులకీ సంఘములో తావు లేనేలేదు.

రష్యాదేశపు నవలారచయితలలో నేగాక, ప్రపంచరచయితలలో సహితము ప్రథమశ్రేణివాడగు డోస్టోవిస్కీ అభ్యుదయ రచయితగా పేర్కొనబడవచ్చునా? డోస్టోవిస్కీ ఈనాటి రష్యాజార్ కొక లేఖ వ్రాసి, తన్మూలముగా కార్మిక కర్షకుల సానుభూతికి నోచిన మాట జగద్విదితమే. రష్యా కవిత్వ వీథులలో నూతన మార్గమును జూపిన పుష్కిన్ సహితము ఇట్లే ప్రవర్తించుటచే, అభ్యుదయ రచక కాజాలడు. కాని ప్రతి సంవత్సరము అతని వార్షికజయంతులను రష్యాప్రభుత్వ మేల జరుపుచున్నదో తెలియదు. రష్యాప్రభుత్వ మీ విధముగా అభ్యుదయ రచయితలను జారవిడుచుచున్నదా యేమి యను సందేహము రాక మానదు. సోవియెట్ రచయితల సభలో నొకసారి స్టాలిన్ ప్రస్తావించుచు నీ విధముగా పల్కినాడట: "మీకు స్వాత్మాభిమానము మిక్కుటముగా నున్నది. కాని మీ రచనలు తృప్తికరముగా లేవు. నే చదువునట్లుగా, శ్రద్ధతో, నియముగా మీరుకూడా షేక్స్పియర్ గ్రంథముల నేల చదువరు? తద్ద్వారా మీ రచనయైనా అభివృద్ధి నందగలదు." ఈ వాక్యములు చాలు. నిజమైన అభ్యుదయ రచన యేదో రాజ్యకార్యనిమగ్నుడగు స్టాలినుకు తెలిసినంతైనా మనకు తెలసిన, మన సాహిత్యములు, సాహిత్య విమర్శలు బాగుపడగలవు.

ఈ అభ్యుదయ రచయితల కార్యక్రమము చాలా విపరీతముగా నున్నది. ఈ మధ్యనే "భారతీయప్రభుత్వము ప్రజాస్వాతంత్ర్యమును అణగద్రొక్కుచున్నది" అని వీరు తీర్మానించినారు. ఇది సాహిత్య ప్రణాళికలో వీరికి ప్రథమసూత్రమో, ముఖ్యసూత్రమో! ఉత్తర భారతమున సమకూడిన వీరు మన ప్రభుత్వము యొక్క విదేశాంగవిధానమునకూడ విమర్శించుచు నొక తీర్మానమును తీసికొనివచ్చిన చాలా బాగుండెడిది. ఇట్లే వర్తకవ్యాపారములపై మరొక తీర్మానమవసరము. న్యాయశాఖ అభ్యుదయవంతము లగు తీర్పులను చెప్పవలెననికూడా వీరు తీర్మానించిన ఇంకా బాగుండెడిది. అనగా నేటి అభ్యుదయ రచయితలకు సాహిత్య మక్కరలేదు. కేవలము రాజకీయవాదులు, స్వప్రయోజనాపేక్షతో, నూతన నామమును ధరించి బయులుదేరినారని తేలకమానదు.

రష్యాలో ప్రసిద్ధపండితులు మహాభారతము ననువదించుచున్నారు. ప్రాచీన సంస్కృత సాహిత్యములోని శ్రేష్ఠగ్రంథముల ననువదించుచున్నారు. మన అభ్యుదయ రచయితలకు వీనిలో అభ్యుదయముకన్పించకపోయినను, రష్యాలోనివిజ్ఞులకివి అభ్యుదయ రచనలే యని స్పష్టము కాకపోదు అనగా అభ్యుదయ శబ్దము సాహిత్య విశేషణమైనపుడు, కేవలభౌతికాభ్యుదయము కాని, కేవల ఆర్థికాభ్యుదయము కాని అర్థముగా చెప్పకొనరాగు. భౌతికమానసిక శక్తులకు సమన్వయమును కూర్చి, మనోవికాసమును, ఉత్తేజనమును చేకూర్చగలిగిన సాహిత్యమే అభ్యుదయసాహిత్యము. పరదేశాక్రాంతమైన భారతభూమిలో, నడుముకట్టి నిలబడదగిన ధీరుడు లేకపోయినాడని ద్రౌపదిద్వారా భారవి మహాకవి ఆక్రోశించినాడు దీనితో గుప్త సామ్రాజ్యము అవిర్భవించినది. కేవలము వాచ్యముగా ప్రభుత్వమును కవితలో తూలనాడినంతమాత్రమున-సాహిత్యము కానేరదనుటకీ యుదాహరణము చాలును.

ఈ అభ్యుదయముయొక్క రహస్య మెరింగిన ప్రాచీన భారతీయాలంకారికులు "విశ్వశ్రేయః కావ్యం" అనినారు. విశ్వశ్రేయస్సుమాత్రమే మానవప్రవృత్తికి పరమావధి, ఉద్దిష్టవిషయము. విశ్వశ్రేయస్సు ఆధ్యాత్మికము. ఈ ఆధ్యాత్మిక ప్రతీతిలోనే భౌతికజగత్తు అంతర్లీనమై అర్థవంతము కాగలదు. షేక్స్పియర్ మహాకవి యొక్క విషాదాంత నాటకములలోను, మహాకవి కాళిదాసరచనలలోను, మహాభారతమున, నిట్టిదే కానవచ్చుటచే, రష్యాలో సహిత మీకవులు వీరి కావ్యములు చక్కగ నాస్వదింపబడుచున్నవి.

పశువుల దివాణం

(7 వ పేజీ తరువాయి)

ఎలకలు నేస్తాలన్నట్లు ఓట్లవల్ల నిర్ధారణైంది. నేస్తాలు కావన్నట్లు నాల్గుజంతువులు వ్యతిరేకంగా ఓట్లు వేశాయి. అవి—మూడు కుక్కలూ, పిల్లీ. కాని తర్వాత ఆ నాలుగూ కూడా అటూ ఇటూ వోట్లు వేసినట్లు తేలింది.

మళ్లా ముసలిపంది ఉపన్యసించడం ప్రారంభించింది:

"నేస్తాలూ! ఇంక నేను చెప్పవలసింది ఆట్టే లేదు. మళ్లా హెచ్చరిస్తున్నా: మానవుని యెడల శత్రుత్వం వహించి ఉండవలసిన విధి మీది. ద్విపాదులు ఎవరైనాసరే, మనకి శత్రువులు. చతుష్పాదులు, లేక రెక్కలున్నవి మన నేస్తాలు. మానవునిపై దాడిసలిపినప్పుడు మనం మాత్రం, అతని యుద్ధరీతిని అనుసరించకూడదు. మానవుల యుద్ధానికీ, మన యుద్ధానికీ పోలికే ఉండకూడదు. అతనిని జయించినతర్వాత అతని దౌర్బల్యాలను మనం అలవరచుకోకూడదు. ఏ జంతువుకూడా గృహంలో నివసించకూడదు; తల్పంమీద పరుండకూడదు. దుస్తులు వేసుకోకూడదు, మద్యపానం చేయకూడదు; పొగకు ముట్టకూడదు; డబ్బు ముట్టకూడదు; మానవులతో వర్తకం చేయకూడదు. మానవుని ఆచార వ్యవహారాలన్నీ చెడుగుకి దారితీస్తాయి. అన్నిటికంటే, ఏజంతువూ తనతోటి జంతువుమీద నిరంకుశత్వం వహించకూడదు. బలమైందవనీయండి, దుర్బలమైందవనీయండి, తెలివికలదవనీయండి, తెలివిలేని దవనీయండి—మనమందరం సోదరులమే! సౌభ్రాతృత్వం అలవరచుకోండి. ఏజంతువూ, ఏ ఇతరజంతువునీ చంపకూడదు. సమస్తజంతువులూ సమానములు.

"ఇంక రాత్రి కన్న కలనుగురించి చెపుతాను వినండి. మానవుడంతరించిన తర్వాత ప్రపంచకం ఏరీతి నంటుందో కలగన్నాను. చాలా కాలంక్రితమే మరిచిపోయిన ఒక విషయాన్ని జ్ఞప్తికితెచ్చుకుందుకు, కన్న కల చాలా ఉపయోగపడింది. నా చిన్నతనంలో మా అమ్మ, తక్తిత్కపందులూ కలిసి, ఒక పాట పాడేవి. మొదటి మూడు చరణాలూ, రాగంతప్ప, వాళ్లకికూడా ఆపాట సాంతంగా వచ్చేదికాదు. చిన్నప్పుడు, మా అమ్మ, వాళ్ళతోపాటు నేనూ ఆ పాట పాడేదాన్ని. కాని వయస్సు మీరుతూన్నకొద్దీ ఆ వచ్చినంతపాట కూడా మరిచిపోయాను. కాని, నిన్నరాత్రి హఠాత్తుగా ఆ కలతోపాటు ఆ పాటకూడా జ్ఞాపకానికొచ్చింది. మాటలు గుర్తుకొచ్చాయంటే నమ్మండి! కొన్ని తరాలక్రితం జంతువులకికూడా భాష ఉండేదికాని ఈ జీవపతనామంలో మాటలు పోగొట్టుకొని మూగజీవాలమైపోయాము. ఆ పాట ఇప్పుడు పాడుతాను. ముసలితనంచేత నా గొంతు బాగుండకపోవచ్చును ఐనాసరే, మీకా రాగం నేర్పుతాను. అప్పుడు మీరంతా కలసి గొంతెత్తి శ్రావ్యంగా పాడుకొందురుగాని. ఆ పాటపేరు మూగజీవాలు."

ముసలిపంది గొంతు సవరించుకుని పాడడం మొదలెట్టింది. బొంగురుగా, అంత శ్రవ్యంగా లేకపోయినా, ఆ పాట జంతువులలో ఉత్తేజం గలిగించింది.

"ముల్లోకములలోని
మూగజీవములార!
మనిసిదాస్యము వీడి
ముందు నడువగ రండు!
నేడో రేపో నరుడు
నాశనమ్మౌతాడు
నాడునాడుల భూమి
మన వశమ్మౌతాది!—
పడిన కష్టముతోడ
నిండు మనకడుపెల్ల
పాడిపంటల కొరత
వచ్చి నిల్వదు చెంత!
జీవకోటిలో లేవు
జాతిమతవర్గాలు
స్వేచ్ఛగా జీవించ.
సమయ మరుదెంచె!—"

ముసలిపంది పాట పాడుతూండగానే సమావేశమైన జంతువులన్నీ వీరావేశంతో లేచి నిలబడ్డాయి. అధ్యక్షుడు పాటపాడడం ఆపగానే, పశువులసావిడి కప్పు యెగిరిపోయేలా, ఏకకంఠంతో జంతువులన్నీ పాటపాడడం మొదలెట్టాయి.

జంతువుల గానం విని ముసలి రత్తయ్య నిద్రనుంచి ఉలిక్కిపడిలేచి, నక్కో మన్నో కోళ్ళని తినేందుకు లోపల దూరిందేమోనని కర్రపుచ్చుకు బైల్దేరాడు. రత్తయ్య వస్తూండడం చూసి, జంతువులన్నీ ఎవరి స్థానాలకవి పోయి నిద్రపోయాయి.

పరశురాముడు

(10వ పేజీ తరువాయి)

నే: భీష్ములవారూ......

ప: అద్గో మళ్ళీ—ఏకో అడిగిన ట్లవగడం దాన్లో నేదో మతిభ్యం. విప్పిచూస్తే మాక్కష్టం తోచేది. భీష్ములవారు—పరే యేం? అతని పంగ తెంకూ ప్రత్యేకించి?

నే: అబ్బే యేమీ లేదు. గట్టివారేనా అని.

ప: అరి పలవా! అతడు గట్టివాడో, కాడో యెరగవ్, జగద్విఖ్యాత కీర్తివంతుణ్ణి! మమ్మల్నే దీటుగా ధిక్కరించగలిగినవాణ్ణి?

నే: దీటుగానంటే!

ప: అంటే నీ మొంగం. (మొంగమటు తిప్పును)

నే: ఆ పోరాటం—

ప: ఆ, యెందుకొచ్చిందో కావాలి—ఏమీ యెరగవ ట్లడగాలి! ఆడ దొచ్చి మొత్తుకుంటే, ఆపాపతుం వహించడం న్యాయంగదా అనుకున్నామని మే మనాలి! మా మాటతడు పాటించకుంటే కుంధంతానికి దిగామనా! పై సంగతంతా చెప్పించాలి! నాయనా, నీకిట్లాటి చర్చవల్ల ప్రయోజన మేమిట్రోయ్! నూరను, వెయ్యను—మా శక్తి, కీర్తి యెక్కడికీ పోవు.

నే: వాస్తవం. కానీండి, ఆ కర్ణున్నట్లా చేశా రేమండీ పాపం?

ప: పాపమా? వాడు చేసిం దేం పని? బ్రాహ్మణ్ణని యెందుకు చెప్పకున్నాడు?

నే: ఏదో చదువొస్తుందికదాని. మీరు శూద్రులకు చెప్పరుగా?

ప: ఔనుమా నియమ మది. మే మేం వాణ్ణి రమ్మని బతిమాలామా? ఆ నియమం లేనివాడి దగ్గరకే వెళ్ళకపొయ్యాడూ? అబద్ధమాడి చేరడమేం? అది మోసం చేయడంగాదూ? స్వార్థంకోసం మోసంజేయడం న్యాయ మంటావా?

నే: తెలిసింతర్వాత భీ అరతలకి పొమ్మనక శాపంగూడా యెంగుకు.

ప: (పండ్లు బిగపట్టి) ఓరి దద్దమ్మా, ఊరికే పంపిస్తే యేమైనట్లురా? వాడికి చుట్టు తగలక్కర్లేదురా!! దేనికోసం వచ్చాడో, మోసం జేసి దేన్ని నేర్చాడో అది నిష్ప్రయోజనమైతే న్యాయం జరుగుతుంది. అందుక నట్లా చేశాం. సరేనా?

నే: అదాండీ చిత్తం. తమరు ఈశ్వరుని దగ్గ రభ్యసించారాండి విలువిద్య?

ప: (చివాలున లేచి) ఇదుగో, ఎందుకీ ప్రశ్న? ఎవరిదగ్గరో నేర్చాం. మా పనంతవింది. నీ విట్లాగే ఉండేకొద్దీ ఏవో అడుగుతూంటావ్. శిష్యుల పాఠ మేమైందో, వస్తే మంచిది.

నే: (ఆశ్చర్యంతో) ఔరా కార్తవీర్యార్జునుడంది నిజమే? ఈయ నుగ్రరాముడే.

(నివృత్తిరుణ.

రామపాదసాగరం

శ్రీ క్రొవ్విడి లింగరాజు

రామపాదసాగరంయొక్క ఉపయోగాలను గూర్చి భవిష్యత్తులో ముఖ్యంగా విద్యుచ్ఛక్తివల్ల ఆంధ్రదేశానికి కలిగే ఆర్థిక సంపదను గూర్చి ప్రత్యేకంగా వివరించనక్కరలేదు. అది అందరూ అంగీకరించిన విషయమే. రామపాదసాగర నిర్మాణం సాధ్యమా అసాధ్యమా, అనే విమర్శకు కూడా చోటు లేదు. అది నిర్మాణ సాధ్యమనీ ప్రపంచంలో ప్రఖ్యాతి చెందిన ఇంజనీర్లందరూ మన గోవిందరాజయ్యంగారితో సహా ఏకీభవిస్తూనే ఉన్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లునోట్లో శని అన్నట్లు అది ఎందుకు ఇంకా ప్రారంభం కాలేదా? ఎందుకు శంఖుస్థాపన జరలేదు? అనే విషయమే యోచింపదగినది: హీరాకుడ్ దామోదరవ్యాలీ ప్రాజెక్టు మొదలైన పెద్ద స్కీములను ఇండియా గవర్నమెంటువారే స్వంత అధినివేశంలోనే ప్రారంభించారు. వాటికి రామపాదసాగరంలో జరిగిన విమర్శలేమీ జరగలేదు. అది సాధించవలసిన విషయం కనుక సాధించేదృష్టితో, ఒకవిధమైన వైజ్ఞానిక పట్టుదలతో పనికి ఉపక్రమించినారు.

ఆ రీతిగానే రామపాదసాగరం నిర్మాణం పని ప్రారంభించవలసి ఉన్నది. కాని దక్షిణదేశానికి సహజమైన అపరిమిత జాగ్రతవల్లనే ఈ ప్రాజెక్టు ఇంతవరకు ఉపేక్షించబడ్డది. ఉత్తరోత్తరా దీనివల్ల పెట్టుబడిమీద ఎంత గిట్టుబాటు అవుతుందనే చర్చ ఇంకను జరుగుచుండుట శోచనీయం. హైద్రాబాదువారి అడ్డంకు ఏదో ఉన్నదని రాష్ట్రప్రభుత్వమువారు చెప్పుచునే ఉన్నారు. హైద్రాబాద్ సమస్య నిర్మాణ ప్రారంభం అయినాక 8 సం॥ ముల అనంతరము బయలుదేరవలసిన వ్యవహారము. 8 సం॥ ల అనంతరం హైద్రాబాదుకు ఇండియన్ యూనియనుకు గల రాజకీయ సంబంధం ఇదే రీతిగా ఉండుననే అభిప్రాయంతో ఈనాడు ఈ విషయమును నిర్ణయించుట రాజకీయముగా మెచ్చదగిన విషయము గాదు. అది కేవలము ఆలస్యమునకు అవకాశము మాత్రమే ఉపయోగపడుచున్న వాదన.

క్రొత్తగా బస్తర్ విషయమై ఒక బూచి లేచింది. ఆ బస్తర్ విషయం గూడా నిలుపుదలకు, ఆలస్యమునకు బలమైన కారణము కాదు.

క్రొత్తగా మధ్యరాష్ట్రమువారు ఏవిధమైన ఇంజనీరింగ్ తర్జన భర్జనలు చెయ్యకుండానే పునాదివేసినవైన గంగా ప్రాజెక్టువల్ల గూడ రామపాదసాగరము ప్రాజెక్టు పునర్విమర్శనకులోను గావలెనను విమర్శలో సందర్భశుద్ధి లేదు. రామపాదసాగర నిర్మాణంవల్లనే గోదావరిలో నీరు పాతికపాలు మాత్రమే ఉపయోగమునకు రానున్నది. పైన గంగవల్ల మరి కొంత పోవచ్చు గాని రామపాదసాగరంయొక్క ఉపయోగమునకు ఏ విధమైన లోటు న్నూ రాజాలదు. మెషినరీ రావలెను అనే కారణమొకటి చెప్పబడుచున్నది. అది కూడా పెద్ద అంతరాయము కాజాలదు. నిడదవోలునుంచి గాని కొవ్వూరునుంచి గాని వెంటనే రైలు నిర్మాణంచేసి మద్రాసు ప్రభుత్వం స్వంత బాధ్యతపైగాని, ఇతరులవల్లగాని ఒక ప్రత్యేక సిమెంట్ ఫ్యాక్టరీని నిర్మాణముచేసి కొండలు పిలిచిన యెడల మెషినరీతో సహా వచ్చి అమెరికన్ నిర్మాతలం ఈ పని పూర్తిచెయ్యగలరు. ఆనకట్ట నిర్మాణములో అనుభవమును గడించిన భారతీయ ఇంజనీర్లు, కంట్రాక్టర్లు వారికి తోడ్పడినచో నిర్మాణము సుసాధ్యము కాగలదు.

అన్నిటికన్న ప్రధానమైనది మద్రాసు ప్రభుత్వమువారి సంకల్పము: మన రాష్ట్రప్రభుత్వము తలపెట్టి కార్యక్రమమునకు ఉపక్రమించినప్పుడు ఈ ప్రాజెక్టుకు ఏవిధమైన అడ్డూ ఉండదు. ఈ ప్రాజెక్టు వెంటనే నిర్వహింపబడవలెననే వారికి సంగమేశ్వరం ప్రాజెక్టుగాని, తుంగభద్ర ప్రాజెక్టుగాని ఆలస్యం కావలెనని కోరరు. గోదావరిలోని నీరు కృష్ణకును, కృష్ణలోని అదనపునీరు పెన్నకును, పెన్నలోని నీరు కొల్లేరువరకునూ కలుపదగిన విశాలదృష్టిగల ప్రాజెక్టుగనుక దీనికిని ఎవ్వరూ ఏవిధమైన అభ్యంతరమునూ చెప్పజాలరు. ఈ ప్రాజెక్టయిన మెషినరీతో ఈ రాష్ట్రములోనే గాక ఈ దేశములోని ఎట్టి నదియైనను ప్రజలకు లాభదాయకముగా చెయ్యవచ్చుననుట నిస్సంశయము. శ్రీ రామమూర్తిగారివంటి సమర్థుడూ తన సేవను ఉచితముగా రాష్ట్రప్రభుత్వము కిచ్చినప్పుడు ఈ అవకాశమును మద్రాస్ ప్రభుత్వము వారు స్వీకరించుదురని నమ్ముచున్నాను.

సంగమేశ్వరం

శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య

సంగమేశ్వరం ప్రాజెక్టు అన్నా కృష్ణా పెన్నార్. ప్రాజెక్టు అన్నా ఒకటే. మద్రాసు చీఫ్ ఇంజనీరు వెంకటాచార్యగారికి ఈ రెండు పేర్లంటే ఇష్టంలేదు. పై రెండు పేర్లు చెప్పినప్పుడల్లా గత 40 సం॥లనుంచీ ఒక్క సారిగూడా ఈ ప్రాజెక్టు బారెడుదూరమైనా సాగకుండా పోవడమే అతని అయిష్టానికి కారణం. సంగమేశ్వరం పేరులో ఉండే అక్షరాల సంఖ్య దుశ్శకున సూచకంగా ఉన్నది. అందుచేత వెంకటాచారిగారు మరొక పేరు సృష్టించారు. దాని పేరు సిద్ధేశ్వరం, సోమేశ్వరం అని.

అంతటితో పోకుండా ఇంకో పని చేశారు. లోగడ సంగమేశ్వరం అనే గ్రామందగ్గర కట్టదలచిన ఆనకట్టను సరాసరి రెండు మైళ్లు దిగువకు మార్చి సిద్ధేశ్వరం అనే గ్రామం దగ్గర నిర్మించదలచుకున్నారు. సత్వర కార్యసిద్ధికి సిద్ధేశ్వరంలోని సిద్ధేశ్వరుడూ, నెల్లూరి జిల్లాయందలి సోమశిల అనే గ్రామంవద్ద ఉండే సోమేశ్వరుడూ ఆశీర్వదించగలరని వీరి ఆస్తిక సమ్మకం.

ఈ ప్రాజెక్టు రెండు నదులకు సంబంధించినది. కృష్ణకు అడ్డంగా సిద్ధేశ్వరందగ్గర ఒక ఆనకట్టకట్టి అందువల్ల అచ్చట ఏర్పడ్డ జలాశయంనుంచి కృష్ణనీటిని పెన్నకు మరల్చి, పెన్నానది నెల్లూరుజిల్లాలో తూర్పుకనుములను తొలుచుకొని ప్రవేశించే చోట కొండలమధ్య మరియొక్క పెద్ద ఆనకట్టను నిర్మించి అచ్చట బ్రహ్మాండమైన రిజర్వాయర్ను ఏర్పరచి ఆ నీటిని ఉత్తరపు వెట్టువరకూ సుమారు 90 మైళ్ళ దూరము, దక్షిణము కోల్రూన్ నదివరకు సుమారు మున్నూరు మైళ్ళదూరం ప్రవహింపజెయ్యడమే ప్రాజెక్టుయొక్క ఉద్దేశ్యం.


ఈ ప్రాజెక్టుయొక్క వ్యయం సుమారు 80 కోట్లు అగునని అంచెనా వెయ్యబడ్డది. నానాటికి పెరుగుచుండే అదనపు ఖర్చులనుగూడా చేర్చుకుంటే 100 కోట్లకు మించకపోవచ్చు. దీనివల్ల సాగుబడి కాగలదని అంచెనావెయ్యబడ్డ క్రొత్త భూమి 30 లక్షల ఎకరాలు. ఇందులో 10 లక్షలు ఒక్క నెల్లూరుజిల్లాకే సంబంధించినది. మిగతాది కడప, కర్నూలు, చెంగల్పట్టు జిల్లాలలోను, చిత్తూరు, దక్షిణార్కాడు, ఉత్తరార్కాడు జిల్లాల్లో కొంతవరకున్నూ నీటి వసతులను కల్గించగలదు. రెండు ఆనకట్టలకు చేరి 18 కోట్లు వ్యయమగును.

సిద్ధేశ్వరం దగ్గర ఆనకట్టలో సోమేశ్వరం దగ్గర కట్ట సగమే అవుతుంది. సిద్ధేశ్వరం ఆనకట్ట సరాసరి చట్టురాయి మీదనే కట్టవచ్చు. అందువల్ల పునాదికి అధిక్య ఖర్చు అట్టే ఉండదు. కాని సిద్ధేశ్వరందగ్గిర ఆనకట్టకు 125 అడుగుల లోతువరకు ఇసకలోనే పునాదిని నిర్మించవలసి ఉంటుంది. అదృష్టవశాత్తు ఇటువంటి ప్రదేశం మున్నూరు అడుగుల పొడవువరకు మాత్రమే ఉన్నది.

ఈ ఆనకట్టయొక్క తలిమా అస్థిభారం అంతా యాభై, ముప్పై, ఇరవై అడుగుల లోతులోనే గట్టి చట్టు ఏర్పడినది. సుమారు 7 మాసములనుంచీ సోమేశ్వరందగ్గర కర్నూలు జిల్లాలో పరిశోధనపనులు ప్రారంభమై పూర్తి కావచ్చినవి. సోమేశ్వరందగ్గర విమానసర్వేపని జరుగుచున్నది. రిజర్వాయరు పూర్తిగా కడప జిల్లా ఎల్లలోనే ఉండుటవల్ల ఆ జిల్లాలో రిజర్వాయరు నీటిఅంచు ఎంతవరకూ వ్యాపించగలదో, ఏఏ గ్రామాలకు నీటిమునక తగులునో సర్వే పూర్తికాబడినది ఇదేవిధంగా సిద్ధేశ్వరం వద్దగూడా మన ప్రభుత్వమునకు సంబంధించినంతవరకు విచారణ పనులు జరుగుచున్నవిగాని, కృష్ణానది ఉత్తరకట్ట నైజాం పరిహద్దులో ఉన్నందువల్ల అచ్చట మునకప్రదేశాన్ని నిర్ణయించుటకు ప్రస్తుతం సాధ్యపడలేదు. అంతేగాక ఇచ్చటి ఆనకట్ట నిర్మాణానికి నైజాం అనుమతి అవసరం. సోమేశ్వరంవద్ద ఆనకట్ట పూర్తి అగులోపల ఈ అనుమతిని పొందవచ్చునని ఇంజనీర్ల ఆశ.

కృష్ణానదినుంచి పెన్నకువచ్చు నీరు సుమారు 300 అడుగుల వెడల్పుగల ప్రత్యేక కాల్వగుండా రావలసి ఉంటుంది. మిట్టకందాల అనే ప్రదేశంలో సుమారు 70 అడుగుల లోతువరకూ 11 మైళ్ల పొడుగున కాల్వ త్రవ్వవలెను. సోమేశ్వరం ఆనకట్టవద్ద ఏర్పడే రిజర్వాయరులోంచి నీరు భవనాశి అను ఏటిగుండా పైకెక్కి మిట్టకందాల పీఠభూమిగుండా పారి, కుందేరు అను ఏటిలో పడి సరాసరి కడప జిల్లాలో నికమలాపురం సమీపంలో పెన్నకు వచ్చి చేరును.

కృష్ణలో ప్రవహించే నీటిలో పై ప్రాజెక్టువల్ల సుమారు 100 కి 40 వంతులు మాత్రమే పై విధంగా తరలించవచ్చునని అంచెనా వెయ్యబడ్డది. ఈ ప్రాజెక్టు నిర్మాణము సంవత్సరాంతమున ప్రారంభం కావచ్చునని అనుకొనుచున్నారు. దీని నిర్మాణంలో నిర్మాణానికి సంబంధించిన చిక్కులు, ఇబ్బందులూ ఏవీ లేవు. సుమారు 7 సం. లలో రెండు ఆనకట్టలూ పూర్తికాగలవని ఇంజనీర్ల అభిప్రాయం. ఇది సిద్ధిస్తే ప్రతి సంవత్సరం కాటకానికి లోనగుచుండే ప్రాంతాలు సస్యశ్యామలం కాగలవు.



రామపాదసాగరు ప్రాజెక్టు స్థల నిర్మాణవిశేషాలను చూపెట్టు మ్యాపు

ఏకాంకిక:

అభ్యుదయం

శ్రీ వసంతరావు వేంకటరావు

గడచిన కథ

[తన సోదరియగు జానకికి, తాను నూతనంగా కనిపెట్టిన మారణాస్త్రాన్ని గూర్చి చెప్పటానికి ఆచార్య సత్యం ఉబలాట పడుతుంటాడు. మూడు సంవత్సరాలక్రితం ఆ రోజుననే ఆమె ఏకైక కుమారుడు హరి యుద్ధంలో మరణించాడు. అతని మరణవార్త వివరాలు అతని స్నేహితు డొకడు ఆమెకు కొద్దికాలం క్రిందటనే వివరించిన వైనం ఆచార్య సత్యం తెలుసుకుని, తన నూతన అస్త్రాన్ని గురించి ఆమెకు తెలియజేయకుండా వుండటమే మంచిదని భావించాడు కాని ఆమె బలవంతంవల్ల తన నూతన ఆవిష్కరణను గురించి ప్రస్తావిస్తూ, దాని ప్రయోగంతో భూఖండమంతా ఒక్కమాటుగా ధ్వంసమైపోతుందని చెపుతాడు. ఆ తరువాత...]

జానకి: ఆసియా, అమెరికాలవంటి ఖండాన్నే?......

సత్యం: ఆహా!

జానకి: నాశనం చేయడమే...హరిని చేసినట్లు?

సత్యం: అయ్యో! నీకంత మనో వైకల్యం కూడదమ్మా, జానకీ! జగత్తుని యథాతథంగా చూచి, అవగాహన చేసికొని, భవిష్యత్ కార్యక్రమం నిర్ణయించుకోవాలి. మన దేశం, ప్రపంచంలో తన ఉన్నతస్థానాన్ని నిలబెట్టుకోవాలంటే, దానికై ఎట్టి సాధనాలనైనా ఉపయోగించాలి. నా నూతన సృష్టిని దేశానికర్పించడంలో నే నత్యంత దేశభక్తిని ప్రదర్శిస్తున్నానని నా నమ్మకం. చూడూ, నే కనుగొన్న సూత్రప్రకారంగా ఒక బాంబు చేస్తాను; గత యుద్ధంలో జర్మనులు పంపినంత అమానుష పరిమాణం గల బాంబు కాదు; సామాన్యమైన బాంబు దానిలో విషవాయువు లుండవు; ప్రమాదకరమైన క్రిము లుండవు. దాని నొక శక్తివంతమైన విమానంనుండి పడవేయాలి— ఎట్టి విమాన మన్నది నా ప్రసక్తి కాదు. మళ్ళా యుద్ధం వచ్చినప్పుడు...

జానకి: మళ్ళా యుద్ధం!......

సత్యం: ఔను. పది, పదిహేను వత్సరాలలో యుద్ధం రాదూ!...సరే. యుద్ధం వచ్చినప్పుడు-గత మహాసంగ్రామంలో జపానీయులు పెర్ల్ హార్బర్‌లోనున్న అమెరికన్ నావలను విధ్వంసం చేసినట్లు...మనం వైరి దేశంపై ఈ బాంబు లక్కడక్కడ పడేసి యుద్ధాన్ని ప్రకటించడమే! అమెరికన్ నావలు కొన్ని మాత్రమే నాశన మయేయి; కాని, పట్టణాలకు పట్టణాలనే నిర్మూలించగల శక్తి నా బాంబు కుంది...కాదు...కలికానికైనా లేకుండా అజాతిని నాశనం చేస్తుందేమో!...

జానకి: ఆ!

సత్యం: నా బాంబు పేలినప్పుడా పేలుడికి కొన్ని జిల్లాలు భస్మమై, ధూమమై, మాయమైపోతాయి. తదనంతరం మహాశక్తివంతమైన అదృశ్యకిరణప్రసారం విక్షేప మౌతుంది. ఆ కిరణాలు జనంతో అతిదూరం వ్యాపిస్తాయి. ఆ ప్రసారానికి గురియైన మానవులు పాలిపోయి, కృశించి, క్షీణించి పోతూంటారు. కాని, అది విధ్వంసకకిరణ ప్రసారంయొక్క ఫలితమని వారు గ్రహించలేరు. వారిని రక్షించే ఉపాయము ఉండదు! యమదూతల పాశాలనైనా తప్పించుకోవచ్చునేమో కాని, కిరణశరాలనుండి ఒక్క జీవియైన బయటపడలేడు. ఒక్క బాంబుతో ఒక్క రాజధానినే సమూలంగా నిర్మూలించవచ్చు. ఒక్కటే బాంబు, జానకీ!

జానకి: అంటే పురుషులు, స్త్రీలు, బాలురు, యావన్మందీ?...

సత్యం: అహా! ఇంతకూ తర్కించి చూస్తే ఈ కాలంలో సైనికునికి పురపౌరునికి వ్యత్యాసమేముంది చెప్పు? కర్మాగారాలలో యుద్ధసామగ్రిని తయారుచేసే బాలికకు, యుద్ధరంగములో వాటిని ప్రయోగించే మానవునికి భేదమేముంది? జానకీ, కొలదిమంది నాకాశంలోనికంపి, మహాపట్టణాలను విధ్వంసం చేయుటకనువైన సూత్రాలు లిఖింపబడ్డ పత్రాలతో నే నిక్కడ కూర్చున్నానన్నది భయానక భావం సుమీ! అట్టి విధ్వంసక విధానం యావత్ప్రపంచంలో నా ఒక్కనికే తెలియును.

జానకి: నీవలెనే, ఈ విధంగా బుద్ధినుపయోగిస్తున్నవారితర దేశాలలో లేరా?

సత్యం: ఉండవచ్చును. కాని, ఇట్టి విధ్వంసక సామర్థ్య మున్న అస్త్రాన్ని మరెవ్వరూ సృష్టిస్తారనుకోను. ఈ నిర్మాణాన్నే 1939 లో చేయగలిగియుంటే ఆ సంవత్సరాంతంలోగానే యుద్ధం సమాప్తమై యుండే దనుట నిశ్చయం. మచ్చుకొక్కడైన లేకుండా జర్మను జాతి యావత్తూ నశించిపోయేది.

జానకి: మనశత్రువు లెవరైనా ఇట్టి మారణాస్త్రాల కనుగొని మనమీదనే ప్రయోగిస్తే?

సత్యం: కాదనలేము. కాని, ఈ అస్త్రం మనదేశీయుల చేతిలో నుంది కనక, యుద్ధం వస్తే, శత్రువు మనపై బాంబులు వేసే లోపుగా మనమే వారిపై ఈ మహాస్త్రాన్ని ప్రయోగించాలి...దానితో సరి...

జానకి: హరిని హతమార్చి ఉచ్ఛేదించిన షెల్లును నీవంటివాడే సృష్టించేడు కాబోలు!

సత్యం: (భుజం తట్టుచూ) ఆడే వద్దన్నాను; ఆ విషయం స్మరించవద్దు. ఈ కుంపటి వద్ద కొచ్చి, కాచుకొని, జీవితానంద పథాలలో విహరించు ప్రయత్నం చేయవమ్మా!

జానకి: ఆనందమా! సత్యం, నీ వెంత మేధావివైనప్పటికీ ఈ ప్రపంచంలో నీ దొక మూర్ఖతమ జీవిగావా అనుకొంటాను?

సత్యం: పోదూ, నీమొహం!

జానకి: నేను తెలిసైనదానిని కాను. పతిసుతులను నిండు మనస్సుతో ప్రేమించుట కన్నవేరెరుగని నావంటి సామాన్యపడతి నీకు సోదరి కావడం ఒకప్పు డసంగతంగా కనిపిస్తూంటుంది నాకు. కాని, విశృంఖలుడై గతించిన నా ఏకైక పుత్ర మరణాన్ని విశాల రాజకీయ దృష్టితో చూడమని ఉద్బోధించినప్పుడు నీ వొక కరమమూర్ఖుడ వనుకొంటాను. అయ్యో, నీవు ఊహారహిత మందబుద్ధివే కావు, రక్తోష్ణం చల్లారిని జడుడవు...జడాలకైనా కొంత కరుణ ఉంటుందేమో!...పైగా, అత్యల్పకాలంలో పట్టణాలను నాశనం చేయుగల బాంబును సృజించేనని నన్నానందించమన్నప్పుడు నిన్నేమనుకోవాలో ఊహించలేను!...నీలో మానవత్వం నశించింది......క్రౌర్యం, దౌష్ట్యం పూర్తిగా మూర్తీభవించేయి!......

సత్యం: జానకీ!

జానకి: ఒక్క నిమిష మాగు. బుద్ధిచాతుర్యం లేని నావంటి సామాన్యపడతియొక్క యోచనాక్రమాన్ని అనుగమించ ప్రయత్నించమని నా కోరిక...నా ప్రార్థన. హరివిషయమై నావలె నీవుకూడ యోచించరాదూ?

సత్యం: అది నీకూ కూడా శ్రేయస్కరం గాదు.

జానకి: కాదూ!!...ఒక్కసారి వాని బాల్యాన్నూహించుకొంటే శరీరం పులకరిస్తుంది. ఆయన నేను లేబ్రాయంలో ఎంతో సుఖంగా ఉండేవారము. కడుపులో హరి పడ్డాడని గురించినప్పుడు అనిర్వచనీయ ఆనంద భయడోలికలలో నూగులాడేము. ఒక్కొక్క నిశాసమయాన్ని మే మిద్దరం పరుండగా మేల్కాంచి, ఆయనకు నే వర్ణించనున్న చిన్న కూనను గూర్చి ఎట్లు యోచించేదానినో, ఆ రాబోవు కూన నెంత ప్రేమించే దానినో, తన్మూలంగా తండ్రిపై నెంత అనురాగం వహించే దానినో తలచుకొంటే శరీరం జలదరిస్తుంది. గర్భస్థమైయున్న శిశువు పుత్రుడే నని ఒకప్పుడు ధీమా కలిగేది. పుత్రుని చూడకుండా మరణిస్తానేమో యని, వాడు తల్లి నెరుగని బిడ్డడైపోతాడని ఒక్కొక్కప్పుడు భయకంపితురాలనౌతూండే దాన్ని. తుదకు హరి జన్మించేడు: చక్కని చుక్క. నామీదనే ఆధారపడ్డాడు... పుత్రజననాని కాయన గర్వించేరు; కాని నే పొందినంత ఆనంద గర్వాతిరేకాలు ఆయనకు లేవు...హరి దిన దిన ప్రవర్ధమానంగా పెరుగుతూంటే, చూసి, మురిసిపోయేవారము... సత్యం! హరి సర్వాంగసుందరంగా నుండేవాడు కదూ?

సత్యం: ఔనమ్మా; చక్కని శరీరసౌష్ఠవం.

జానకి: వాని భవిష్యత్ గురించి ఎంత యోచించేవారము; గొప్పవాడు కావాలని ఆశించేము. అందరూ వానిని ప్రేమించేవారు. సత్యం నీవుకూడా ఎంతో మురిసిపోయేవాడివి కదూ?

సత్యం: అహా! హరి చాలా అందంగా నుండేవాడు. కాని, నీ వా విషయం.........

జానకి: అప్పుడు జబ్బు పడ్డాడు. రోగమే వానిని కడుపున పెట్టుకొంటుందని భయపడ్డాము. పాపం, హృదయాన్ని సరిగ్గా వెలిబుచ్చు నేర్పు లేని ఆయన తిండిమెక్కినట్లు తిరిగేవారు. అబ్బా-నేను చెప్పలేను. కాని, సత్యం, హరి కోసం ప్రార్థించేను; ఎంత ప్రార్థించేనంటే నా మనస్సంతా ప్రార్థనైపోయింది. ఎట్టకేలకు వ్యాధినుండి తేరుకొన్నాడు; ఆరోగ్యవంతుడయేడు...విద్యలో చక్కగా ఉత్తీర్ణుడౌతూ వచ్చేడు...తొలిసారి క్రికెట్టు ఆడినప్పుడు ముఖమల్ కోటు చూచి మురిసిపోతూ, ఆట కాగానే అధికోత్సాహంతో, సంరంభంతో వచ్చి పది పరుగులు చేసేనని చెప్పిన దృశ్యం కళ్ళకు కట్టినట్లుంది. నా హరి మొదటిపందెంలోనే పది పరుగులు చేసేడు సత్యం! తోడి విద్యార్థులంతా గౌరవించేరు. ప్రాచీనులు మెవరిదో అన్నట్లు ఖులాసాగా సాయం విహారానికి పోతూన్న హరితో నేను కూడా వెళ్ళినప్పుడెంత హసించేనో? ఆ ఆనందాన్ని పట్టలేక ఆయన ఒక మొహరు బహూకరించేరు. (కన్నీరుతో) చిన్నారి హరి!...

సత్యం: నీ మనస్తాపానికి మేర లేనట్లుంది. ఆ విషయ మింక స్మరించకు జానకీ!

జానకి: కాశీవిశ్వవిద్యాలయంలో ప్రవేశించేడో లేదో యుద్ధం ముంచుకొచ్చింది. సైన్యంలో చేరేడు. వానిగూర్చి గర్వించడమో, విచారించి శోకించడమో తెలిసిందికాదు; ఎక్కువగా గర్వించేవారిమనుకో! తరువాత తరువాత నాయకుని దుస్తులలో నున్నప్పుడెంత ప్రేమించేదానినో, మొదటిలో పెద్దబోళ్ళ ముతకకోటుతో నున్నప్పుడు సైతం హరి నంతే ప్రేమించేదానిని. ఫ్రాన్సుకి ప్రయాణమైనప్పుడు దుఃఖాన్ని దిగమ్రింగి వాని ధైర్యాన్ని ప్రతిఫలిద్దామని ప్రయత్నించేను. చిన్నమందహాసానికై బ్రహ్మాండమంత ప్రయత్నం చేయవలసి వచ్చింది; ఎట్లో ఒక్కసారి నవ్వేను. నా హాసము శాశ్వతమని, సహచరులవద్ద చిన్నపుచ్చునని విశ్వసిస్తాడని ఊహించి, చిన్ననవ్వు నవ్వి, హరి ఆగమనానికి జర్మనులు కంపిస్తారని పరిహాసమందేను. కాని, సత్యం, నిజంగా నేనే భయపడేదాన్ని! హరి యుద్ధంలోనున్న కాలమంతా కంపితహృదయంతో యమబాధపడేదాన్ని. టెలిగ్రాఫ్ బంట్రోతును చూస్తే గుండె జారిపోయేది. తొలిసారి సెలవు మీద యింటికొచ్చేడు. చిన్నారి హరి ఎంతమారిపోయే డనుకొన్నావు? పుష్టిగా పెరిగేడు; అయినా కోమలత్వం కోల్పోలేదు. వానికద్ద సిగ్గుపడేదాన్ని. ఎంతో చూచేడు, ఎంతో నేర్చుకొన్నాడు. నాకు ఊహగా నుండగల పురుషుడైనాడని నా గర్వం ఇనుమడించింది. సెలవు దినాలను ఆమితోత్సాహంతో గడిపేము. సెలవు ముగియవస్తూందికదా అని దిగులు చెందడానికైనా తీరికలేకపోయింది. హరి వెళ్ళినప్పుడు కొద్దిగా కంటనీరు పెట్టినప్పటికీ సురక్షితంగా నాయన తిరిగి వస్తాడన్న నమ్మకంతో వియోగాన్ని అంతగా పాటించలేదు. కెప్టన్ అయినతరువాత రెండవసారి సెలవు తీసికొనివస్తాడని విశ్వాసంతో నున్నాను. హరిని చేజార్చుకొన్నా మనుకొంటూన్న మీ బావగారుకూడా హరి తిరిగి వస్తాడని విశ్వసించ మొదలుపెట్టేరు. కాని,...హరి రాలేదు... ఫ్రాన్సు చేరుకోగానే యుద్ధరంగంలో ప్రవేశించవలసివచ్చింది. ఒకవారంలో మరణించేడు. పూర్తిగా నాశనం కావింపబడ్డాడు...ఆ చంపినవారు హరి నెన్నడు చూడనైనా చూడలేదు; వానిని చంపినట్లు సైతం వారెరుగరేమో! నా జీవనజ్యోతి, నా నోములపంట, నా ఆనందసుధ...ఒక్కలిప్తలో...పోయేడు! నా ఆశాప్రేమలు, నా కష్టసుఖాలు ఒక్కలిప్తలో భగ్నమయేయి! హరిని పెంచి, పోషించి, విద్యాబుద్ధులు గఱపి గర్వించేను...ఒక్క క్షణంలో నా పుత్రరత్నం, సుందరసుకుమార హరి నాశనం గావింపబడ్డాడు! సత్యం! సత్యం! దానిని విశాలదృష్టితో చూడలేను కదూ? అయ్యో. నాకు నిత్యం గోచరించేది...జాగ్రత్ స్వప్నాలలో కనిపించేది...నా హరియొక్క రక్తసిక్త విశృత నష్టశరీరం మాత్రమే!

సత్యం: నీ భావాన్ని నే గ్రహించలేక పోలేదు జానకీ! కాని మనం ఉద్రేకాన్ని కొంత తగ్గించుకోవాలి. ఇంతకూ దేశానికై హరి ప్రాణత్యాగం చేసేడని మనశ్శాంతి కొంత కలుగుతుందికదా!...చాలమంది వైరులను సంహరించే ఉంటాడు!

జానకి: రామరామ! దాని వలన నాకేమి ప్రయోజనం సత్యం? నావలెనే ఒక నిర్భాగ్యురాలు దుర్భర పుత్రవియోగంచే క్రుంగిపోతుందంటే నాకెట్టు సంతోషం కలుగుతుంది? లేదు లేదు. ఆమెతో చేయికలిపి నీవంటి వారిపై కక్ష సాధించాలనిపిస్తూంది!

సత్యం: నావంటివారా?

జానకి: ఔను. విశాలదృష్టిగల నీ ప్రభృతులు. మీరు శుద్ధ మూర్ఖులు. తెలివిలేని నావంటి వారు, దైవానుగ్రహంచే హరివంటి చక్కని చుక్కలను సృష్టిస్తే, అపార మేధావంతులయిన మీరు వారిని నాశనం చేస్తారు. అందుచేతనే నీ వొక మూర్ఖుడవంటాను.

(22 వ పేజీ చూడుడు)

వివాహము-కూటాంతరత

శ్రీ వావిలాల సోమయాజులు

ప్రపంచంలోని నేటి నాగరకజాతులూ అనాగరకజాతులూ, వివాహవిషయంలో కొన్ని ప్రాథమిక నిబంధనలను ఏర్పరచుకున్నారు. జీవయాత్రలో సహపథికనుగానీ, పథికుణ్ణిగానీ ఎన్నుకోటానికి వ్యక్తిప్రణయము (Individual Sex Love) మూలాధారం కాకపోవటమే దీనికి కారణము. జాతిరక్షణ, దేవతాపితృ తర్పణమూ, సంతానమూ ఈ నిబంధనలకు పునాదులు.

వైవాహిక విధానాలను మూలంగా (1) కూటాంతర వివాహములు (Endogamous marriages), (2) కూటబాహ్య వివాహములు (Exagamous marriages) అని విభజించవచ్చును. ఈ రెంటిలో మొదటి పద్ధతి ననుసరించి వ్యక్తికి వివాహము స్వకూటమిలోనుంచి జరుగుతుంది. అంటే అతను వివాహం చేసుకునే కన్యక అతను ఏకూటమికి చెందిఉంటాడో దానికే చెందిఉండవలెనని నియమమున్నదన్నమాట. రెండవదానిలో వ్యక్తికి అతని కూటమిలోనుంచి వివాహము జరుగరాదు. అంటే అతను వివాహమాడే కన్యక అతని కూటమిలో జన్మించినది కారాదన్నమాట.

ఈ రెండు రకాలైన పద్ధతులూ ఒకే కాలంలో ఒకే దేశంలో ఉండటానికి అవకాశం ఉన్నది. అంటే ఆ దేశంలోని కొన్ని జాతుల్లో కూటాంతరతను, కొన్ని జాతుల్లో కూటబాహ్యతను అనుసరించి వివాహాలు జరుపుకుంటారన్నమాట.

అందుకనే వైవాహిక విషయంలో అంతఃకూటమి (Inner-Circle), బహిఃకూటమి (Outer-Circle) ప్రతి దేశంలోనూ ఉండే జాతుల్లో కనిపిస్తున్నవని హెన్రీమెయిన్ అనే వైవాహిక శాస్త్రవేత్త అభిప్రాయపడ్డాడు.

లోకంలో అనేక జాతులవారు ఇతర జాతులవారితో వైవాహిక సంబంధంగానీ, కామ సంబంధం (Sexual Relation) గానీ ఉండటానికి వీలు లేకుండా అనేక నియమాలను ఏర్పరచుకున్నారు. ఇటువంటి జాతివైరాలు, ఉచ్చనీచలు అనాగరకజాతుల్లోనే కాదు. నాగరకజాతులనిపించుకున్న వాటిలోనూ పాదుకట్టినవి.

రోమనులు గొప్ప విజేతలు. వారు జయించిన దేశాలలోని జాతులనుంచీ వివాహయోగ్యలైన కన్యకలను వారు వివాహంచేసుకోవటముగానీ, వారి కన్యకలను జయించినవారికి ఇవ్వటముగానీ జరగలేదు పైగా రోమను కన్యకలను జితులకు ఇచ్చి వివాహంచేయటము చట్టసమ్మతముకాదని తీర్మానించినారు. వారి కన్యకలను బానిసలగా స్వీకరించి వారితో కామోపభోగాన్ని అనుభవించటాన్ని వారి న్యాయశాస్త్రం అంగీకరించింది.

ప్రతిజాతీ ఇతరజాతిని తనకంటే తక్కువ జాతిగా పరిగణించటం లోకంలో పరిపాటి. అందుమూలకంగా ఇతర జాతులతో వైవాహిక సంబంధాలను అరికట్టటానికి యత్నిస్తుంది. కొన్నిజాతులు ఇతర జాతులతో వైవాహిక ప్రణయాన్ని అడ్డుకోవు. కానీ అటువంటి వివాహాన్ని న్యూనతా దృష్టితో చూడటము కద్దు. ఇవి జాతుల సహజలక్షణాలు.

ఇటువంటి పట్టింపులు కేవలం రక్తసంబంధంతో తరతరాలనుంచీ సాంసారికయాత్ర గడుపుతూ వస్తున్న తక్కువ జాతివారిలో విశేషంగా కనిపిస్తుంది. స్త్రీ పురుషులలో గమనిస్తే ఈ నిరసనభావం స్త్రీలలో విశేషంగా గోచరిస్తుంది.

సాధారణంగా లోకంలో జరిగిన జాత్యంతర వివాహాలనూ (Inter-National marriages), వర్ణాంతర వివాహాలనూ (Inter-caste marriages) పరిశీలిస్తే ముఖ్యంగా ఎక్కువ సందర్భాలలో భర్త ఉన్నతమైన కుటుంబాలకుగానీ, జాతికిగాని చెందిఉంటాడు. దీనికి మూలకారణం మానసికశాస్త్రవేత్తలు ఇలా చెప్తున్నారు:

"స్త్రీ తనను తక్కువ చేసుకోటానికి నిరాకరిస్తుంది. పురుషునికి అంతటి సునిశితత్వంగానీ, జాత్యభిమానము, వర్ణాభిమానముగానీ ఉండదు."

ఇందుకు నిదర్శనంగా ఉత్కృష్ట ప్రజాస్వామిక దేశమని ప్రఖ్యాతిగన్న అమెరికాను తీసుకుందాము. ఆ దేశంలో నీగ్రోపురుషులను వివాహమాడిన శ్వేతజాతి స్త్రీలు అల్పసంఖ్యాకులు. దక్షిణరాష్ట్రాలలో అటువంటి వివాహాలను ఆచారమూలంగా బహిష్కరించారు. అయితే అంతమాత్రాన శ్వేతజాతి స్త్రీలకు నీగ్రోజాతి పురుషులతో కామసంబంధం లేదని చెప్పటానికి వీలులేదు. మరికొన్ని రాష్ట్రాలలో ఆచారం మాట అటుంచినా న్యాయశాస్త్రంకూడా అంగీకరించదు.

ఈ కూటాంతరతకు (Endogamy) ముఖ్యంగా జాతిగర్వమూ, దేశౌన్నత్యగర్వమూ కారణాలు. జాతిగర్వము మూలంగా అన్యజాతులమీద అసహనభావం కలగటం సహజలక్షణం. అదే రీతిగా దేశౌన్నత్యగర్వం కారణంగా విదేశీయులంటే సౌహార్దము లేకపోవటమూ, వైముఖ్యమూ, వైమనస్యమూ కలిగిఉండటమూ సమస్తదేశాలవారికి లక్షణము. అందులో ఆచారవ్యవహారాలలోనూ, నాగరికతలోనూ, ఆధ్యాత్మిక, ఆధిభౌతిక జీవిత విధానాలలోనూ విశేషమైన అంతరం ఉన్న జాతుల మధ్యా దేశాలమధ్యా ఈ అసహనభావమూ, వైమనస్యవైముఖ్యాలూ విశేషంగా గోచరిస్తూ ఉంటవి.

జంతుజాతుల్లోనూ ఒకజాతికి చెందినా ఒక విలక్షణతఉన్న ప్రత్యేక జంతుకోటికి (Distinct Species) మరొక విలక్షత కలిగిన ప్రత్యేక జంతుకోటితో కామసంబంధం కనిపించదు. అది ఆయా జాతులకు సహజావబోధము (Instinct). అదేరీతిగా రూపంలో స్వజాతికంటే భిన్నమైన జాతిలోని వ్యక్తులతో కామసంబంధాన్ని వైవాహిక సంబంధాన్నిగానీ, కలిగిఉండటానికి జాతులు అసహ్యించుకుంటవి. స్త్రీ జాతిలో ఉండే కామసంబంధమైన సహజావబోధము పురుషజాతిలోని కామసంబంధమైన సహజావబోధంకంటే భిన్నమైనది. అందువల్ల స్త్రీలకు విదేశీయులతో రక్తసంబంధమంటే పట్టుదల విశేషము.

ఇందుమూలంగా మానవజాతిలోనే అనేక రకాలైన విలక్షణవర్గాలు (Species) ఉన్నవని కాదు. కొన్ని కొన్ని ఇళ్ళల్లో అలవాటుపడ్డ జంతువుల్లోకూడా పరస్పరమూ నిధువనక్రీడకు అంగీకారము పరస్పరంగా కనిపించదు.

అయితే ఈ సహజావబోధానికి కారణం ఏమిటి ? శాస్త్రజ్ఞులు దీనికి 'సామ్యము' (Similarity) ముఖ్యకారణంగా పలుకుతున్నారు. కామవిషయంగానూ జాతులుగానీ, వ్యక్తులుగానీ ఒకవిధమైన సామ్యమును ఆదరిస్తారని వారి అభిప్రాయము. సంతానశాస్త్రజ్ఞులు ఇది ఒక విధమైన శారీరక న్యాయము (Physiological Law) అన్నారు. సంతానోత్పత్తికి ప్రతి కృతి (Reproduction) ప్రాథమికాంగము. దీనికి సామ్యము అత్యావశ్యక మని వారి అభిప్రాయము.

ఈ సామ్యము ప్రత్యేక జాతులమధ్యనే కాదు, ఒక విలక్షణత ఉన్న వర్గంలోనైనా అత్యవసరమని శాస్త్రజ్ఞులు పలుకుతున్నారు. పరస్పరసంయోగము (Inter-Crossing) చేయించదలచుకున్నా ఈ సామ్యమును ముఖ్యంగా గమనించవలసి ఉంటుందని వారి ఊహ.

వృక్షజాతిలోగానీ, జంతుజాతిలోగానీ ఒక విలక్షణమైన వర్గాన్ని (Species) మరొక విలక్షణమైన వర్గంతో పరస్పరసంయోగం కలిగించవచ్చును. అటువంటి సందర్భాలలో సంతానం విశేషంగా కలుగుతుందనిగానీ, ఎక్కువ సంఖ్యకు అవకాశం ఉంటుందనిగానీ సిద్ధాంతీకరించటానికి వీలులేదనీ, దానికి భిన్నంగా జరగటం కద్దనీ, అందుకు అనేక నిదర్శనాలు కనిపిస్తున్నవనీ ప్రపంచ వివాహ చరిత్రకారుడు వెస్టర్‌మార్కు అభిప్రాయము.

సర్వసామాన్యంగా ఆచారంలో అనేక జాతుల్లో వివాహము జాతికి బాహ్యంగా జరగటంలేదు. కొన్నిటిలో అంతర్వర్గాలను కూడా వ్యతిక్రమించి జరగటంలేదు. కొన్నిటిలో వాటి ఊళ్ళను మించి జరగవు. వంగరాష్ట్రంలో బరయాక్ జాతివారు విదేశీయ స్త్రీని వివాహం చేసుకున్నవాడిని కులంలోనుంచి వెలికి బహిష్కరిస్తారుట. అతడు ఆ విదేశీయభార్యను బహిష్కరిస్తేగాని తిరిగి కులంలో చేర్చుకోటానికి అంగీకరించరట. అంటే ఒకవ్యక్తి కులంలోనుండి వెళ్లిపోయినా అంగీకరిస్తారుగాని, విదేశీయ స్త్రీని తమ కులానికి కోడలినిగా స్వీకరించరన్నమాట.

ఒకజాతిలో పుట్టిన ఆడపిల్లలు విదేశీయుణ్ణి వివాహమాడటమనే ఊహనుకూడా అసహ్యించుకుంటారు. అస్సాములోని ఆభీరులు, కూడవోలు వారి జాతుల్లోని కన్యకలు విదేశీయుని వివాహమాడటానికి ఉద్దేశిస్తే సూర్యచంద్రులు ఆకాశంలో ప్రకాశించరనీ, భూకంపాలు కలిగి లోకం తారుమారై పోతుందనీ నమ్ముతారు. ప్రమాదవశాత్తు అటువంటి దుస్థితి సంభవిస్తే దానికితగ్గ ప్రాయశ్చిత్తాలూ, శాంతులూ, ఉపశాంతులూ జరుపుతారు. లేకపోతే జాతి కంతటికీ శాంతిగానీ, భద్రతగానీ లేదని వారి విశ్వాసము.

ఈ విధంగా జాత్యేతర, వర్ణేతర, వర్గేతర వివాహాలను అరికట్టటమనే ఆచారం వ్యక్తిపరమైనది కాదు. జాతిపరము, వర్ణపరము, వర్గపరము. అంటే ప్రతిజాతీ జాతిలోని స్త్రీలను వెలికి పోనీయటానికి ఇష్టపడలేదనటం.

పురాతన అరబ్బుజాతివారు వారిలో వారికి రక్తసంబంధం అభివృద్ధి కావటానికి గ్రామాన్ని దాటిన వివాహబంధాన్ని సంఘం అంగీకరించలేదట ! మొరాకోలో బర్బరులు తమ జాతితో అన్యులకు ప్రసక్తి కలగకుండా ఉండటానికి గ్రామంలో ఉన్న వాళ్లతోనే వివాహసంబంధం జరిగితీరాలని నియమించుకున్నారట. ఇది ముఖ్యంగా తండ్రివైపునే జరుగుతుంది. గ్రామంలోనైనా తండ్రివైపు వారినే వివాహమాడవలసి ఉంటుంది. అందువల్లనే జీలోపహద్ కుమార్తెలకు తన తండ్రి వంశంలోని వారినే వివాహం చేసుకోవలసిందని సలహా యిచ్చి వారసత్వ విషయికమైన కష్టంనుంచి గట్టెక్కవలసి వచ్చింది. ఇటువంటి వివాహాలలో గ్రామాంతరత, పితృీయాంతరత కనిపిస్తుంది. అందువల్ల శాస్త్రజ్ఞులు దీనిని పితృీయస్థానివాంతర వివాహాలని (Patri-local marriages) అని నామకరణం చేసినారు.

జాతుల్లోని కూటాంతరతకు మతంకూడా ఒక ప్రబలకారణము. తండ్రి మతంలోనుంచి కుమారుడు బాహ్యుడౌతాడనే ఉద్దేశంతో కొన్ని జాతులు కూటాంతరతను అంగీకరించినవి. న్యాయశాస్త్రకర్త మోజెస్, ఇస్రవైటులకు కానవైటులతో వివాహసంబంధం పనికిరాదని శాసించాడు. దీనికి ముఖ్యకారణము ఇస్రాయెలు తరువాతికాలంలో అనేకమంది పాగనులు కానవైటులతో కలిసినారట.

పందొమ్మిదవ శతాబ్ది ప్రథమభాగంలోకూడా యూరప్ దేశంలో ఇజ్రయెటులకు క్రైస్తవులకు వివాహబంధాలు ఉండేవికావట. నెపోలియన్ చక్రవర్తి క్రీ. శ 1807 సంవత్సరములో పండితపరిషత్తులను ఏర్పాటుచేయించి వారి ఇరువురిమధ్యా జరిగే వివాహాలు చట్టసమ్మతాలైతే చాలుననీ, మతసంఘసమ్మతాలు కానవసరము లేదనీ తీర్మానం చేయించి శాసించినాడు.

క్రీ. శ. 1844 లో రాబినికల్ సమ్మేళనం జరిగింది. తత్ఫలితంగా క్రైస్తవ, జ్యూజాతుల మధ్య జరిగే వివాహాలు అంగీకృతాలైనవి. ఏకేశ్వరోపాసకుల మధ్య జరిగే వివాహాలన్నీ చట్టసమ్మతాలని ఆ సభ అంగీకరించింది. కానీ తల్లిదండ్రులు సంతానాన్ని జ్యూ మతంలోకి తీసుకోరావలసిన షరతుమాత్రము పెట్టుకున్నారు. సంఘసంస్కర్తలు దీనికి వ్యతిరేకంగా వాదించారు. అంతటితో జ్యూలు తక్కినవ్నలతో వివాహసంబంధాలు చెయ్యరని తేలిపోయింది. అందుమూలంగా యిరోపా ఖండంలో ఈనాటికీ అనేక ప్రాంతాలలో—ముఖ్యంగా రష్యాలో—జ్యూలకూ క్రైస్తవులకు వివాహసంబంధాలు కనుపించవు, బహుసకృత్తు.

క్రైస్తవులు జ్యూలకూ క్రైస్తవులకూ వివాహసంబంధాలు పనికిరావని తీర్మానించారు. దీనికి కారకులు కాన్‌స్టంటైన్ ప్రభృతులైన చక్రవర్తులు. మధ్య యుగసాహిత్యంలో జ్యూ జాతిమీద విశేష ప్రచారం సాగింది. సాహిత్యాన్ని పరిశీలిస్తే క్రైస్తవ కన్యకలు జ్యూ జాతిని ఎలా అసహ్యించుకున్నారో, ఎలా అసహ్యించుకోవాలో కూడా వ్యక్తమౌతుంది. క్రైస్తవులు పాగనులతోనైనా వివాహం చెయ్యవచ్చునని అంగీకరించారుగాని జ్యూలతో వివాహాలు పనికిరావని నిబంధించారు.

సెంటుపాల్ మహాశయుడు క్రైస్తవులకు హీదనులతో వివాహము పనికిరాదని శాసించినాడు. అటువంటి వివాహము ప్రమాదవశాన జరిగితే దానిని 'అవివాహితతో నెరపిన కామ సంబంధము' (Fornication) గా పరిగణించవలసి ఉంటుందన్నాడు. క్రైస్తవ మత వ్యాప్తిని ఉద్దేశించి అటువంటి వివాహాలు జరిగించటానికి కొంత ప్రోత్సాహ మిచ్చినాడు.

కాథలిక్కులు హెరిటిక్కులమధ్య వివాహాలు పనికివస్తవని క్రైస్తవ సంఘం అంగీకరించింది. వారు క్రైస్తవమతాన్ని అంగీకరించవలసి ఉంటుందన్నారు. కొన్ని క్రైస్తవపరిషత్తులలో దీనికి వ్యతిరేకంగా తీర్మానించారు. ఇటువంటి వివాహాలకు మతప్రవక్తల అనుమతి అవసరమన్నారు. అటువంటి వివాహాలు మతవక్తల ముందు జరిగితేతప్ప అంగీకరణయోగ్యాలు కావని ట్రెంటులో జరిగిన పరిషత్తు తీర్మానించింది.

కానీ కాలక్రమేణ 'పోపులు' ధర్మాంతర వివాహాలను (Mized Marriages) అంగీకరించారు. పుట్టే సంతానము పొందే విద్యాదికాలనుజూచి చర్చి అసహ్యించుకున్నది. ప్రొటెస్టెంట్లు మొదట ధర్మాంతర వివాహాలకు వ్యతిరేకించారుగాని క్రమక్రమంగా ఆమోదించారు. ఈ వివాహాలు ఈనాడైనా రోమను కాథలిక్, ప్రొటెస్టెంటు దేశాలలో చట్టసమ్మతాలైన వివాహాలకు (Legal marriages) భిన్నంగా లేవు. గ్రీకుదేశానికి సంబంధించిన చర్చి వారిలో మతసంబంధమైన నిబంధనలు ఈనాటికీ కొంతవరకు కనిపిస్తూ ఉన్నవి.

అంతర్వివాహాన్ని ఇస్లాంమతం మొదటినుంచీ ఈనాటివరకూ అరికడుతూవచ్చింది. 'ఇస్లాం మతధర్మాన్ని స్వీకరించని స్త్రీని వివాహమాడవద్దని' కొరాను పలుకుతున్నది. ఇస్లాం మత ధర్మాన్ని స్వీకరించినంతమాత్రంతో సరిపోదు ఆ స్త్రీ ముసల్మాను ధర్మశాస్త్రాలమీద ఆస్థ కలిగిఉండాలి; నమ్మకము కుదిరినదై ఉండాలి.

ఈ మూలసిద్ధాంతాలను ఆధారం చేసుకొని సున్నీ షియ్యా న్యాయశాస్త్రవేత్తలు కొన్ని నిబంధనలు చేశారు. ఈ రెండు వర్గాలవారు విగ్రహారాధనం చేసే జాతుల్లోని స్త్రీలను వివాహం చేసుకోకూడదని అనుశాసించారు దీనినిబట్టి ఎటువంటి సందర్భంలోనూ మహమ

(21 వ పేజీ చూడుడు)

అన్నమయ్య జోల

శ్రీ తిమ్మావఝుల కోదండరామయ్య

తాళ్ళపాకవారి కవిత తామ్రఫలకములలోనే యుండి తెలుగుచాటున దాగియుండలేదు. ముగ్ధమోహనముగా సింగారించుకొని యక్షర సుందరమై యలరారుచు దేశిసుమముల గొప్పు ముడిచి మేనిమెఱుగుల మేలిముసుగు మినిమి వెలార్పగా తెలుగు తెరువుల నొయ్యారముగా నడకసాగించినది. మూర్తిమంతమైన యీ ముగ్ధసౌందర్యమునకు త్రిలింగములోని మున్నూటికోటి ప్రజానీకము మురిసిపోయినది. తెలుగుపలుకునెలత యీ శ్రీరతీయముల నలవలచుకొని తన నిలయమును కలకల లాడించినది.

అన్నమయ్య జోల యిది అడుగడుగు దండాల వానినే కాదు యావదాంధ్రమును ఉయ్యెలలూచి జోకొట్టి నిద్రపుచ్చినది. తెలుగు నెలతలు ఈ జోలపాడి తమ బిడ్డల మురిపించి యేడుపుడిపి సుఖశయిదల జేసినారు. తెలుగు సిసువులీ జోల నాలకించి మెయిమఱచి మిన్నలలో విహరించినారు.

జో అచ్యుతానంద జోజో ముకుంద
రారా పరమానంద రామ గోవింద. జో.

ఈ పల్లవితోడి జోలపాటను, మన తెలుగులోగిళులలో నేటికిని వినుచుందుము. తెలుగు నెలతల నోళులతో నిపజీవితమై యిది నాటికిని, నేటికిని సాతురముగా జాలువారుచున్నది. అమృతానందము చేకూర్చుచున్నది. చేకూర్చగానుచున్నది. వారి వరిపోషణమే లేకున్నచో నిది యేనాడో యడగారి యుండెడిది. ఈ జోల పాడుట విని యత్యయానంద మనుభవించుటే కాని యీ రచన మెవరి దన్న జిజ్ఞాస నేటిదనుక నేరికిని కలుగలేదు. ఇందఱి నోళులలో పడి నలుగుచున్నను నీ రచనము అన్నమయ్య దనుట నేటికి నెవరికి తెలియకుండుట నిజముగా నచ్చెరువు కలిగింపగలదు! ఇది యడగారి పోకుండ తమ మోము వాకిళుల నెలకొలిపి నిలిపిన తెలుగు నెలతలకు జోహారులు!

శ్రీ విస్సా అప్పారావు పంతులుగారి మాతామహులు తమ సొంతమునకై వ్రాసి యుంచుకొనిన పాటలను పరిశీలించుచుండగా శ్రీ పంతులుగారి కిది యదాటున దొరికినది. ఈ రచనము అన్నమయ్య దగుట గురుతించి పరమానంద భరితులై వారు ఈ జోలను శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారికి వినిపించిరి. శ్రీ శాస్త్రిగారివలన దీనియునికి యెరిగి శ్రీ పంతులుగారి కడనుండి దీని ప్రతి వ్రాసి తెచ్చుకొని వారి యనుమతిపై నిది ప్రకటించుచున్నాను. వారికి కృతజ్ఞతాపూర్వకవందనములు.

? రాగం—అటతాళం

జో అచ్యుతానంద జోజో ముకుంద
రార పరమానంద రామ గోవింద జో.
నందు నింటను జేరి నయము మీఱంగ
చంద్రవదనలు నీకు సేవచేయంగ
నందముగ వారిండ్ల నాడుచుండంగ
మంద పాకు దొంగ మాముద్దురంగ
పాలవారాశిలో పవళించినావు
బాగుగా మునుల కభయ మిచ్చినావు
మేలుగా వసుదేవు కుదయించినావు
బాలుడై యుండి గోపాలుడైనావు
అట్టు గట్టిన మీగ డట్టె తిన్నాడే
పట్టి కోడలు మూతిపై రాసినాడే
అట్టె తినె నని యత్త యడుగ విన్నాడే
గట్టిగా 'నిది దొంగ, కొట్టు' మన్నాడే
గొల్లవారిండ్లకును గొబ్బునకు బోయి
కొల్లలుగా త్రావి కుండలను నేయి
చెల్లునా మగనాండ్ర జెలగి యీశా! యీ
చిల్లతనములు నేయ జెల్లునట వోయి!
రేపల్లె పతులెల్ల గోపంబు తోను
'గోపమ్మ మీ కొడుకు మా యిండ్లలోను
మాపుగానే వచ్చి మా మానములను
నీ పాపడే చెఱిచె నేమందు మమ్మ!'
ఒకని యాలిని దెచ్చి నొకని కడ బెట్టి
జగడములు గలిపించి సతిపతుల బట్టి
పగలు నలుజాములును బాలుడైనట్టి
మగనాండ్ర జేపట్టి మదనుడైనట్టి
అంగజుని గన్న మా యన్న యిటు రారా
బంగారు గిన్నెలో బాలు పోసేరా
దొంగ నీ వని సతులు పొంగుచున్నారు
ముంగిట నాడరా మోహనాకారా!
గోవర్ధనంబెల్ల గొడుగుగా బట్టి
కావరంబున నున్న కంసు పడగొట్టి
నేడు మిథిలాపురము నేల జేపట్టి
కేవితో నేలిన దేవకిపట్టి!
అందముగ దాళ్ళపాకాన్నయ్య చాల
శృంగార రచనగా జెప్పె నీ జోల
సంగతిగ సకలసంపదలు నీ వేళ
మంగళము తిరుపట్ల మదనగోపాల!

సాహిత్యాలంకారముల జంజాటము నుండి చేయూతలు విడిలించుకొని యితని కవితాకన్య దేశిసొగసుల జేసికొని యీ రచనలో సహజ సుందరమై యొప్పారుచున్నది. అన్నమయ్య శృంగారాధ్యాత్మసంకీర్తనాది యితర రచనములను జూచి దీనిని జూచినయెడల రెంటికి గల భేదము సుస్పష్టముగా గోచరించును. సాహిత్యపు బలుపు లేనందుననే యిది సరళమై, సుందరమై యందరి హృదయముల నవలీలగా జూఱగొనినది.

ఈ జోల బహుశః అన్నమాచార్యుల కాలమునందు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానములో నానాడు భాగవతులలో బహుళ ప్రచారములో నుండిన 'అన్న ఉంజల్ తిరునాళ్ళ' (హంసదోలోత్సవ) సందర్భమున నన్నమాచార్యులు శ్రీస్వామివారిపై పాడినదై యుండవచ్చును. సాళువ నరసింహరాయలవారు క్రీ. శ. 1473 విజయలో నీ డోలోత్సవమును తిరుమల దేవస్థానములో తొలిసారిగా జరిపిరి. అప్పటి నుండి ప్రతివర్షము నదియొక సంప్రదాయక్రింద పరిణమించినది. ఈ డోలోత్సవము ప్రతివర్షమును తమిళమాసము చిత్రశుక్లషష్ఠినాడు ప్రారంభమై యేడుదినములు జరుగును. ప్రారంభదివసమునకు పూర్వదినము రాత్రి అంకురార్పణము జరుగును. ఆ యుత్సవదినములలో శ్రీస్వామివారికి ప్రత్యేక కైంకర్యములు మహావైభవముతో జరుగును. ఈ వెచ్చములకై సాళువ నరసింహరాయలవారు కలవాయిపర్రులలోని దొమ్మరపట్టి యను గ్రామమునుకూడ శ్రీ స్వామివారికి సమర్పించిరట!

ఈ డోలోత్సవ మిట్లు ప్రత్యేకదివసములలో ప్రధానోత్సవముగా మాత్రమే గాక బ్రహ్మోత్సవ దినములలో కడపటినాడును మకర సంక్రమణ దినమునను జరపునటుల సాళువ నరసింహరాయలవారే యేర్పఱచిరి.

ఈ డోలోత్సవము సాళువ నరసింహరాయలకాలములోనే తొలిసారిగా ప్రారంభింపబడుటచేతను, వారి కాలములోనే యన్నమయ్య శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానములో సంకీర్తనాచార్యులుగ వెలయుచుండుటను నీ జోల తదుత్సవప్రారంభదినములలో పాడియుండవచ్చు నని యూహింపవచ్చును. సాళువ నరసింహరాయలవారిచే నూతనముగా ప్రారంభింపబడు నీ డోలోత్సవ విషయము విని దేశము నాలుగుమూలలనుండి భాగవతులనేకులు విచ్చేసి తత్సందర్భమున నన్నమయ్య పాడిన యీ జోలను విని పరవశులై తదాస్వాదమును జీవితమెల్ల ననుభవింపగోరి వారీ పాట నేర్చుకొనియుందురు.

తెలుగు నెలత లీ జోలను అనుదినము తమ నినుఁగుల నిద్రపుచ్చుటకు పాడుచు దాని కమృతత్వమును ప్రసాదించియుందురు. ఈ పాట బహుళప్రచారము గాంచిన విధ మిదియే యై యుండునని యూహించుచున్నాడను.

అచ్యుత దేవరాయలకాలములో తాళ్ళపాక వారికి కొన్ని గ్రామములు సర్వమాన్యములుగా చెల్లుచుండినవి. మెకంజీ దొరగారు సేకరించిన లోకల్ రికార్డులలో నిట్లు కలదు.

'నృసింహరాయల కొమారుడు అచ్యుత దేవమహారాయలు విజయనగరమందు వజ్రశింహాసనారూఢుండై పృథివి సామ్రాజ్యం చేయుచుండగా కౌమలాపురం తాలూకాలో బ్రాహ్మలుకు యిచ్చిన అగ్రహారంలున్ను, వారి వారి నాయంకరానకు యిచ్చిన వివరం.

తాళ్ళపాకంవారు అనె యింటిపెరు గలిగిన నంద్దవైదికి బ్రాహ్మడు కవిశ్వరునికి సర్వమాన్యంగా యిచ్చిన గ్రామముల వివరం.

౧. కౌమలాపురానకు దక్షిణం నాల్గు పరువుల దూరమున మాచనూరు గ్రామము.

౨. యీ గ్రామానికి పడమర పరువు దూరమున పూర్వం ప్రౌఢదేవరాయలనాడు అల్లిదొన అగ్రహారికులకు యిచ్చిన వెంటపల్లి గ్రామం.

౩. యిందుకు నైరుతి ౧ మాగమున తుంమ్మలూరు గ్రామం.

౪. యిందుకు ఉత్తరం పాపదుర్తి గ్రామం.

౫. దువ్వూరు తాలూకు కామనూరు గ్రామం.

౬. చిటివెల తాలూకు తంగటూరు.

ఈ ఆరుగ్రామములున్ను తాళ్ళపాకవారికి సర్వమాన్యంగా నడుస్తువుండెవని ఆ గ్రామస్తులు వాడుతు వున్నారుగాని శిలా శాసనముల రుజు అగపడలెదు. యీ తాళ్ళపాకవారు కవిశ్వలు బహు ప్రఖ్యాతిగా జనులు వాడుకొనెది కలదు.'—తాళ్ళపాకవారి కానాడు ప్రజావర్గములో నెట్టి పలుకుబడి యుండెడిదో లోకలు రికార్డులలోని పైజన వాక్యమును బట్టి యూహింపగలము.

తాళ్ళపాక అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యుడు అచ్యుత దేవ రాయలవారి జీవితకాలములో సంకీర్తనాచార్యుడుగ వెలయుచుండినవాడగుటచే నీ గ్రామములు కూడ నచ్యుత దేవరాయల వారిచే నతనికే యొసగబడి యుండవచ్చునని యూహించుట సత్యదూరము కాజాలదు.

దేవస్థాన శాసనసంపుటములో నచ్యుత దేవరాయలు పూండి, సంగముకోట యను గ్రామములను పెద తిరుమలాచార్యునకు తామ్రశాసనము చేసి యొసగినట్లును, నతడు తనకు సర్వమాన్యములుగా చెల్లుచుండిన యీ గ్రామములను క్రీ. శ. 1532 సం॥ లో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సమర్పించినట్లును పేర్కొనబడినది. కాని యీ గ్రామముల ప్రసక్తి యందు గానరాలేదు. శాసన దృష్టాంతములు కానరాకున్నను లోకలు రికార్డులలోని జనవాక్యమును బట్టి తాళ్ళపాకవారికి ఆయారు గ్రామములను అచ్యుత దేవరాయలవారు ఒసగినట్లును నవి వారికి సర్వమాన్యములుగా చెల్లుచుండినట్లును విశ్వసింపవలసియున్నది.

అన్నమయ్య రచనములు—ఇతనివే కావు—తాళ్ళపాకవారి రచనములెల్ల సాహిత్య ప్రాధాన్యము గలిగి వెలయుచున్నవి. తిరుపతి ప్రాచ్యవిద్యా పరిశోధనాల్యాధ్యక్షులు తమకడ నున్న తాళ్ళపాకవారి రచనముల నెల్ల వెలువరిచి నిజమైన శ్రద్ధ వహలసియున్నది. ఇటువంటి గొప్ప గొప్ప సంస్థలు పుస్తక ప్రకటనము వ్యాపారదృష్టితో గాక సేవాదృష్టితో లక్షింపవలసియున్నది. తెలుగువారై యుండి తెలుగు పరిశోధన విషయమున వారే యిట్టి వైఖరితో నుండుట నిజముగా ననుశోచనీయము. తెలుగువారము మనము లేని యవకాశములు లేకపోగా ఉన్న అవకాశములను గూడ పూర్ణముగా వినియోగించుకొనలేక పోయినయెడల నిక చెప్పెడి దేమున్నది? ప్రాచీనకావ్య సముద్ధరణము గావించుకొని పరిశోధనమున నితరభాషలు ముందంజ వేయుచుండ మనము ఆకుచాటుపిందెల వలె మరగియుండి గుడుగుడుగుంచము లాడవలసిన దేనా? ఒక సంవత్సరమునకు పూర్వ మెప్పుడో ముద్రితమై గ్రంథము వెలువడగా అన్నమాచార్యుల శృంగారసంకీర్తనములు అను గ్రంథము ఇటీవలనే వెలువడిన మరొక గ్రంథముతో భారతికి గతమాసము విమర్శనార్థము పంపబడుట శ్రీ ప్రాచ్యవిద్యాపరిశోధనాలయాధ్యక్షులకు తెలుగుపరిశోధనముపై శ్రద్ధలేమి, వైముఖ్యములకు నిదర్శనము కాదా! తాళ్ళపాక వారి రచనముల ప్రకటనము కొంతకాలము నిలిపి యుంపబడినదని వినుటచే నింతదూరము వ్రాయవలసివచ్చినది. మనసుండవలెనుగాని, రాజు దలచుకొన్న దెబ్బలకు కొదవా? సమర్థులు, పరిశోధనమున పరినిష్ఠితప్రజ్ఞాధురీణులు తెలుగు పరిశోధనశాఖలో నుండగా వారిని సంపూర్ణముగా వినియోగించుకొని వారిచే నెంతగానైనను పరిశ్రమ చేయించి పుస్తకముల బ్రకటింజేయవచ్చును. అట్లు చేసినవారు సాహిత్యప్రపంచమునకు నెంతేని సేవ చేసిన వారగుదురు. తాళ్ళపాకవారి రచనములనెల్ల పరిష్కరింపించి వెలువరిచిన సహృదయసాహిత్య ప్రపంచమెంతేని వారికి కృతజ్ఞము కాగలదు. లేకున్న ఆంధ్రప్రజానీకమునకు వారు నేడు కాకున్న నే నాటికైనను సమాధానము చెప్పవలసియుండును. దేవస్థానాధికారులును తాళ్ళపాక వారి రచనముల ప్రకటనమునెడ నితోధికముగా శ్రద్ధ చూపి యవి త్వరలో వెలువరుచు మార్గముల నరయుదురుగాక! ఏతత్కావ్య ప్రకటన నిర్వహణమున వారు ప్రమత్తులై యుందురుగాక!

కొత్త పాతలు

బీజపుగములో బోలుగుంబాక్ అనే గుమ్మటము ప్రపంచములోనున్న గుమ్మటములలో పెద్దది. గుమ్మటముమీద ఒక మనిషి నిలబడి క్రిందవారిని ఎంత బిగ్గఱగా పిలిచినా వినిపించదు, క్రిందినుండి పైవాడిని పిలచినా అంతే! గుమ్మటము లోపలకు ఒక మనిషి వెళ్లి చెవి దానికి చేర్చి బయట ఒకడు పెదవి గుమ్మటముదగ్గిర వుంచి గుసగుసలు ఎంత నెమ్మదిగా మాట్లాడినా 20 గజముల దూరములో నున్నవారికి స్పష్టముగా వినిపిస్తుంది!

కొరవల్లివాడ పల్లిబాబు

హైద్రాబాద్‌లో నవరాత్రాలు

(9-వ పేజీ తరువాయి)

ఆ రాత్రి ఏవో శనగలే తలా కాసిని తిని స్టేషన్ ప్లాట్‌ఫారంమీద పడుకున్నాము. మాకు కొంచెందూరంలో నిజాం మిలిటరీ స్టేషన్ గార్డు చేస్తూవున్నారు. వాళ్లకు సహాయంగా రజాకర్లనుకుంటాను. కొంతమంది బాతాఖానీ కొడుతూ కూర్చున్నారు. ఆ రాత్రి ఎందు చేతనో విపరీతంగా తలనొప్పి రావటంవల్ల నాకు నిద్రే పట్టలేదు. రాత్రి మూడుగంటలైంది. నేను శిరోవేదనచే బాధపడుతూ కూర్చున్నాను. ఇంతలో కొంచెందూరంలో వున్న నిజాం మిలిటరీవాళ్లు, రజాకార్లు ఈ విధంగా మాట్లాడుకోవటం వినిపించింది.

"అరే! ఇన్కా నెహ్రూ దాల్ ఖానేవాలా బొమ్మన్ హైనారే."

"అరే! పటేల్ భీ దాల్ ఖానేవాలా హైనా! వో మద్రాస్‌కా ప్రకాశం భీ దాల్ ఖాతారే! ఉనేతో బైఠ్‌తా నై, బైఠేతో ఉఠ్‌తా నై, హసీ సాల్కా బుడ్డా. యే సబ్ అకే హమ్‌సే లడ్తే?"

"అరే! కాష్మీర్‌మే ఇన్ లోగోఁనే క్యా కియారే"

['అరే! వీళ్ళ నెహ్రూ, పప్పు తినే బ్రాహ్మడే కదా!'

'పటేల్ కూడా పప్పు తినేవాడే కదా! ఆ మద్రాసు ప్రకాశంకూడా పప్పు తింటాడు కదా! లేస్తే కూర్చో లేడు. కూర్చుంటే లేవ లేడు. ఈ పప్పురాయళ్ళంతా, మనతో యుద్ధం చేస్తారూ!'

'అరే! కాష్మీర్ లో వీళ్ళంతా ఏమి చేశారు!']

ఇది వాళ్ళ సంభాషణ. ఇండియన్ యూనియన్ అన్నా, యూనియన్ నాయకులన్నా అక్కడి వారిలో ఎటువంటి అభిప్రాయం వున్నదీ, వాళ్ళు ఎంత మతోన్మాదంలో, చీకటిలో, వున్నదీ తెలుసుకోడానికి పై సంభాషణ చాలు ననుకుంటాను.

మేము మధిర, మీడిపల్లి, రాయపట్నం, అల్లీనగరం, ఖాజీపురం, మాటూరు, మీనవోలు, తక్కెళ్లపాడు, ఇనగాలి, రామన్నపాలెం, భీమవరం, గోసవీడు, ముత్తుగూడెం, బంజరు, బయ్యన్నగూడెం, రఘునాథగూడెం, మున్నగు గ్రామాలు చూచాము. అన్నిగ్రామాల స్థితి ఇంచుమించు లేమిడిచర్లలాగే వున్నది. చెరువులలో నీరు వుంది. కాని పొలాలన్నీ బీళ్ళుగా పడివున్నవి. పచ్చటి గడ్డి పొలాల్లోకి దృష్టిని ఆకర్షిస్తున్నది. కాని ఆ గడ్డిని తిని ఆనందంతో నేమరువేయటానికి పశుగణం లేదు. గ్రామాలు వున్నవి, కాని నిర్జనంగా శ్మశానశాంతితో. ఆ తగులబడిపోయిన గ్రామాలమధ్య తిరుగుతూ వుంటే మేము నిజంగా జరిగిన దృశ్యాలు చూస్తున్నామా! లేక తెరపై ఏదైనా సినిమా చూస్తున్నామా! అనే సందేహం అడుగుఅడుగుకూ కలుగుతూ ఉండేది.

రఘునాథగూడెం అనే గ్రామం (మధిర తాలూకా)లో 20-7-48 తేదీని నిజాం పోలీసులు వచ్చి అప్కారీపన్నుకై పురుషులు లేనందువల్ల వాళ్ళ భార్యలను, తల్లులను బలవంతంగా 15 మందిని లారీలలో ఎక్కించుకొని రజాకార్ల కేంద్రమైన కల్లూరు క్యాంపుకు తీసుకొనివెళ్ళి అక్కడే 10 రోజులు వుంచుకున్నారు. ఒకవంక శ్రీ భన్సాలీయెడల అతివినయంగా వర్తిస్తున్నట్లు నటిస్తూ ఒకమూల మామూలు హింసాకాండ, మానభంగాలు చేస్తూవుండటం శ్రీ భన్సాలీ సహించలేకపోయినాడు. రజాకార్ల దౌర్జన్యాలు, అహింసావిధానంవల్ల అణగిపోవని, యూనియన్ ప్రభుత్వం జోక్యం కలుగజేసుకొని విచ్ఛిన్నకత్తులతో సైన్యాన్ని నిజాం [...]లోనికి నడిపించి అగణిత ప్రజానీకాన్ని రక్షించ[...]సి వుంటుందనే స్థిరనిశ్చయానికి వచ్చి ఒక [...]ర్థ సత్యాగ్రహిగా, అహింసావాదిగా, [...]తకాలు, పాపకృత్యాలు చూడలేక తన, [...]ర్యటనను మానుకొని నిరశనవ్రతం అవ[...]సి వచ్చింది.

[...] నిజాం సర్కార్ యూనియన్[...]చి 8 మైళ్ళనుంచి ముప్పది మైళ్ళ [...] పర్చుకుంది. ఈ ఖాళీ అయిన [...] అసలు ఇప్పుడు ప్రభుత్వం



భాషారాష్ట్ర విచారణ సంఘము

విశాఖపట్టణములో తమ పని సాంగముగా ముగించుకొని 5-వ తేదీ సాయంకాలము మద్రాసలో విమానము దిగిన భాషారాష్ట్ర విచారణ సంఘ సభ్యులు.

అంటూ లేనేలేదని చెప్పాలి.

నిజాం యొక్క ఈ ఎత్తు కేవలం పిరికితనంవల్ల, యూనియన్ సరిహద్దులలో గల సైనిక శక్తికి భయపడి అని చెప్పటకు వీలులేదు. కమ్యూనిస్టు పార్టీమీద నిజాం ప్రభుత్వం నిర్బంధములను తొలగించుటవల్ల ఈ ఖాళీప్రదేశంలో ఈనాడు హైదరాబాదులోని కమ్యూనిస్టులు, యూనియన్‌లో కమ్యూనిస్టులు విచ్చలవిడిగా తిరుగగలగటానికి అవకాశం లభించింది. ఒక విధంగా ఇండియన్ యూనియన్‌కు నిజాం సైన్య స్థావరాలకు మధ్య ఒకవిధమైనటువంటి కమ్యూనిస్టు ఫ్రంటును తయారుచేయుటయే నిజాం సర్కార్ కూటనీతి అని అనుమానించుటకు కూడా తగిన ఆధారాలు లేకపోలేదు.

దిన్కా సర్కార్ - రాత్‌కా సర్కార్—మాకు నిజాంలో పరిపాలనను గురించి ప్రతిచోటా ఆ రెండుమాటలే వినుపిస్తూ వుండేవి. దిన్కా సర్కార్ అంటే పగటి ప్రభుత్వం; రాత్‌కా సర్కార్ అంటే రాత్రి ప్రభుత్వం అని. పగలు రజాకార్లు దోచుకోవటం. రాత్రిళ్లు కమ్యూనిస్టులు దోచుకోవటం ఈ పని ఈనాడు నిజాంలో జరుగుతున్నది.

ఈ రెండు సర్కారులమధ్య సైన్యంలో పడ్డ ఈగలాగు నిజాం నవాబు ఇంకా ఎన్నాళ్ళు మన గలుగుతాడో కాలమే నిర్ణయించగలదు.

ఈ ప్రభుత్వాన్ని మార్పుచేసి మాపుచేయనిదే ఇటు యూనియన్ ప్రజలకూ, అటు నిజాం సంస్థాన ప్రజలకూ శాంతి లేదనే విషయం నిర్వివాదం.

యూనియన్ సరిహద్దులలో లక్షలకొలది గతసంవత్సరమునుంచీ పడియున్న కాందిశీకుల స్థితి చాలా హృదయవిదారకంగా వుంది. తల దాచుకొనుటకు ఆస్కారము లేక తిన తిండీ కట్ట బట్టా లేక సకలబాధలు పడుచున్నవారు ఎందరో వున్నా, అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వమూ తమకు సంబంధించని విషయంగా మిన్నకుండటం శోచనీయము.

లేఖలు

ఆర్. యస్. యస్.

ఆర్యా,

అన్యాయంగా అపనిందపాలైంది. అవ్యక్తుల ఆగ్రహ ఆవేశాలకు గురి అయినది. నిష్కారణంగా నిషేధించ బడింది. అధికారుల ఆజ్ఞలకు శిరసావహిస్తూ అనేక వేల అమాయకులను చెరసాలలకు పంపింది. కార్యాలయాలు దహించ బడినా, కార్యకర్తలు కష్టపడినా, చివరకు పవిత్రులు దూషించబడినా, ప్రాణాలకే ముప్పు వచ్చినా, అవమానాలను దిగమ్రింగి పూర్తి సహనంతో కేవలం మహాత్ముని అహింసా సిద్ధాంతాన్నే అవలంబించి (గాంధీజీ అనుచరులనకొనే) ఆ బుకఖారాయళ్ళకు బుద్ధి గరపేది. సుమారు 40 లక్షల సహచరులను కలిగి గూడ దేశక్షేమాన్నే కాంక్షిస్తూ నిశ్శబ్దంగా ఎన్నెట్లో 7 నెలలు గడిపింది.

కాని మన ప్రజాప్రభుత్వం నేటివరకు దాని అంతర్యాన్ని అర్థం చేసుకో కలిగిందా? దానికి—కాదు—అఖిల భారతానికే తను చేసిన ద్రోహాన్ని గుర్తించిందా? దానిని గురించి బాపూజీ, పటేల్‌జీ వెల్లడించిన అభిప్రాయాలను అర్థం చేసుకొనగలిగిందా? స్వార్థాన్ని త్యజించి, గత 23 సం. గా జాతి సేవకు పాటుబడుతోందని తెలుసుకొన్నదా?

బాపూజీ హత్యా ఫలితంగా దేశమంతా శోక సముద్రంలో మునిగి ఉంటే అవకాశవాదుల అల్లరిని అణచలేక మన ప్రభుత్వం ఆ సంస్థను అణచివేయ జూచింది. పోనీ ఏదైనా నేరం మోపగల్గిందా—ఊహు. ఇది చాలక సంఘ పెద్ద గురూజీపై గాంధీజీ హత్యా నేరం మోప ప్రయత్నించి విఫలమైంది. తర్వాత ఆయన గారిని 'నాగపూరులోని జైలు నుంచి విడిచి కూడా 'నాగపూరు జైలు' నందుంచుట కనీదీనక మనిపూనుకున్నట్లున్నది. ఈ పిచ్చి పనుల వలన ప్రభుత్వానికి ప్రత్యేకఫలితం లేకపోగా నగుబాట్ల పాలు కాగలదు.

నేటికి చాల కాలం వృథా అయింది. భారత రాజకీయాలు వాటు తప్పిపోతున్నాయి. పరిస్థితులు విషమిస్తున్నాయి. ఇప్పటికైనా మన ప్రభుత్వం నిద్రలేచి, గత తప్పిదాలకు పశ్చాత్తాప పడి యువకుల హృదయ బాధను తెలుసుకొని (1) సంఘంపై నిషేధం రద్దుచేసి, (2) గురూజీకి స్వేచ్ఛ నిచ్చి యువకుల పూర్తి సహకారాన్ని పొందటమే ప్రభుత్వం చేయదగిన పని.

నారాయణ,

గుంటూరు.

గ్రంథస్వీకారం

నవభారతం

రచయిత : సీతంరాజు సుబ్రహ్మణ్యశర్మగారు. ప్రకాశకులు : సుదర్శన పబ్లిషర్సు, 10/3 తంబుశెట్టి వీథి, మద్రాసు 1. వెల రూపాయిన్నర.

నిరుడు ఆగస్టు 15 వ తేదీన మనకు స్వాతంత్ర్యం లభించింది మొదలు ఈ ఆగస్టు 15 వరకు దేశంలో జరిగిన యావత్తు సంఘటనల సమీక్ష ఈ పుస్తకం ఒక్క సంఘటనలే కాదు, ఈ కొత్తరికంలో మన ప్రభుత్వాన్ని ఎదుర్కొన్న వివిధసమస్యలు, వాటి పరిష్కారానికి ప్రభుత్వం వారు అవలంబించిన అనేకవిధానాలు కూడ ఈ వార్షిక సమీక్షలో ఆమూలాగ్రంగా వివరింపబడినవి. విషయసేకరణలోను, సేకరించిన విషయాలను క్రమపద్ధతిని విస్పష్టంగా కూర్చడంలోనూ రచయిత మంచిశ్రద్ధచూపించినాడు. నవభారతంయొక్క పోకడను, దేశీయపరిస్థితుల తీరును గ్రహింపగోరెడి ప్రతి ఆంధ్రునికీ దీని మూలంగా సమగ్రవిషయ జ్ఞాన మేర్పడి తీరు ననుటకు సందేహం లేదు.

వివాహము-కులాంతరత

(19 వ పేజీ తరువాయి)

దీయ స్త్రీగాని, పురుషుడుగానీ ధర్మాంతర వివాహాన్ని చేసుకోటానికి అవకాశం ఆ ధర్మ శాస్త్రజ్ఞులు కల్పించలేదని వ్యక్తమౌతున్నది.

హిందువులలోనూ కులబాహ్యవివాహము—మూలస్పష్ట్యస్వీకరించినప్పుడు—జరగటానికివీలు లేదు. హిందూజాతిలోని వర్ణవ్యవస్థకు మూలాధారము అదే. హిందువులలో కులాంతర వివాహమే ప్రధాన ధర్మము.

అయితే, అది కేవలము ఒక వర్ణముతో ఆగిపోలేదు. ప్రతివర్ణములోనూ కొన్ని ఉపవర్ణములు (Sub-castes) ఏర్పడినవి. సర్వసాధారణముగా వివాహము ఉపవర్ణ, ఉపవర్ణముల మధ్యనే నిలచిపోతుంది. ఎప్పుడైనా, వర్ణాంతర, వర్ణాంతర వివాహాలు ఉపవర్ణాలమధ్య జరగవచ్చునేమోకాని అనాదిలో ఏర్పడ్డ వర్ణ, వర్ణాలమధ్య అంతర్వివాహాలు పనికిరావు. ఉపవర్ణాలలోను కొన్నిటినుంచి కన్యను స్వీకరించవచ్చునుగాని కన్యకను ఆ ఉపవర్ణంలోని వరునకు ఇచ్చే అవకాశం లేదు.

ఒక వర్ణము అనేక ఉపవర్ణాలుగా విభజితమైన సందర్భాలలో 'అనులోమము' (Hyper-Gamy) కనిపిస్తుంది. అందువల్ల తల్లిదండ్రులు కన్యకలను వారికంటె అధికులని పేరుపడ్డవారికి ఇవ్వవలసి ఉంటుంది. లేకపోతే తక్కువ వానికిచ్చి సాంఘికంగా తమ వంశాన్ని అల్పుడైన వియ్యంకుని వంశస్థితికే తీసుకోపోవలసిఉంటుంది. అందువల్ల పురుషులు తమ వంశంలోని పిల్లలనూ తమకంటే తక్కువ వంశంలోని పిల్లలనూ వివాహం చేసుకునే అవకాశం ఏర్పడి ఉండేదన్నమాట. ఇది ఉత్తరభారత జాతుల్లో కనిపిస్తుంది. దక్షిణభారతములోనూ, అస్సాములోనూ ఇటువంటి ఆచారమున్నట్లు గోచరించదనివివాహ చరిత్రకారుని అభిప్రాయము.

మెడగాస్కరు ద్వీపములో జాతులు మూడు విధాలు (1) ప్రభువులు, (2) మధ్యస్థులు, (3) బానిసలు. బానిసలలో కూడ ఉపవర్ణా లున్నవి. వీరిలో వర్ణబాహ్య వివాహాలుగాని, బానిసలమధ్య ఉపవర్ణాంతరవివాహాలుగానీ లేవు. తూర్పు ఆఫ్రికా మసై జాతుల్లో కమ్మరము, వడ్రంగము, ఇత్యాది కర్మకారవృత్తిగలవారు అంతర్వివాహాలు చేసుకోటానికి వీలులేదు.

పొలీనీషియాలో ప్రభువర్గంవారు జనసామాన్యాన్ని మరొకజాతికి చెందినవారినిగా చూస్తారు. అందువల్ల అన్యోన్య వివాహబంధాలు లేవు. తిహతీలో స్త్రీ తక్కువ జాతివాడిని వివాహం చేసుకుంటే కలిగే సంతానాన్ని చంపటానికి ముందు అంగీకరించవలసి ఉంటుంది.

క్రీ. పూ. 445 ప్రాంతాలలో గ్రీసుదేశం మహావైభవాన్ని అనుభవించే దినాల్లో ప్లీబనులూ, పెట్రీషియనులూ అని రెండు తెగలుగా ఉండేవారు. ఒకరితో ఒకరికి వివాహ సంబంధాలు ఉండేవి కావు. సిసెరోవంటి విజ్ఞాని క్రొత్తగా బానిసత్వం పోగొట్టుకున్నవారితో వివాహబంధాలు జాతీయులకు పనికిరావనినాడు. శాసనసభ్యత బానిసస్త్రీని వివాహమాడటంవల్ల పొయ్యేది. అదేరీతిగా బానిసత్వవిముక్తుని అతని పోషకురాలు వివాహంచేసుకునే అధికారం లేదు. వివాహము పనికిరా దనినారేగాని గ్రీసు రోమను శాస్త్రవేత్తలు స్వతంత్రులు, బానిసలు—అనే రెండు జాతులమధ్య ఒకవిధమైన కామ సందంధము (Contu Bernium) ఉండవచ్చునని అంగీకరించినారు.

ప్రాచీనకాలంలో ట్యుటానిక్ జాతులవారు ఎవరైనా స్వతంత్రుడు బానిసతో వివాహ సంబంధం నెరపితే అతనిని బానిసనుగా చేసేవారు. అటువంటి పనికి స్త్రీ పూనుకున్నప్పుడు ఆమెను చంపివేసేవారు.

స్కాండినేవియన్ జాతుల్లో ఎక్కువ కాలం బానిసత్వం నిలవలేదు. జర్మనీలో అది 'సెర్ఫ్‌డం' గా మారింది. పుట్టుకతో సామ్యత (Equality of Birth) ఉంటేగాని వివాహానికి అవకాశంలేదు. జర్మనీ స్కాండినేవియాలలో క్రమక్రమంగా ప్రభుజాతి భిన్నమైపోయింది. ప్రభుజాతి వ్యక్తికీ, బానిసకూ ఏ కారణంచేతనైనా వివాహబంధం ఏర్పడితే దానిని దుష్టబాంధవ్యము (Mis-alliance) గా

భావించేవారు. ప్రప్రథమంలో అటువంటి వివాహాలు చేసుకున్నవారు ఆర్థికదుర్దశకు పాత్రులైనారు. చాలాకాలంవరకు వారి సంతానానికి పౌరసత్వహక్కులు లభించలేదు.

చాలా సందర్భాలలో వర్గసంబంధమైన కూటాంతరవివాహ విధానానికి (Class Endogamy) జాతివైషమ్యమూ, దేశవైషమ్యమూ కారణాలు. అన్యదేశీయ దండయాత్రల ఫలితంగా సాంఘికవిభేదాలు ఏర్పడి ఉంటవి. జయించినవారు ప్రభువులూ, జితులు బానిసలూ ఔతూంటారు. వారి ఇరువురి మధ్యా వైవాహికబాంధవ్యాలు ఉండేవి కావు.

సంస్కృతభాషలోని వర్ణశబ్దానికి 'రంగు' అని అర్థము. దీనినిబట్టి వర్ణభేదం ఎలా ఏర్పడి ఉంటుందో మనం ఊహించవచ్చును. ఉత్తమ వర్ణంగల ఆర్యులు అనార్యులను జయించి బానిసలనుగా పరిగణించి ఉంటారు. తరువాతికాలంలో వర్ణశబ్దం కులవిభేదాలను తెలియజేస్తూ వచ్చింది.

ఆర్యజాతి ఏర్పడక పూర్వం భారతదేశంలో నీలవర్ణులైన జాతులవారుండేవారు. వారే దస్యులు. కాలక్రమేణ వారు ఆర్యులకు బానిసలైపోయినారు. విజేతలైన ఆర్యులలో మొదట స్త్రీల సంఖ్య అతిస్వల్పంగా ఉండేది. ఆ కారణంచేత అనార్య జాతి కన్యకలనూ, స్త్రీలనూ వివాహం చేసుకున్నారు. తరువాత తరువాత అటువంటి అగత్యం లేక పోవటంవల్ల అంతర్వివాహ విధానాన్ని వారు అరికట్టినారు. అంటే కూటబాహ్యవివాహాన్ని అంగీకరించటం మానివేసినారన్నమాట.

నార్మనుల దండయాత్రకు పూర్వం ఆంగ్ల దేశానికి శాక్సనులు ప్రభువులు. తరువాత నేటి జర్మనీ ప్రాంతీయులూ, గాలులూ అయిన నార్మనులు ఆ దేశాన్ని జయించినారు, ప్రభువులైనారు. రోమను జాతిలోని పెట్రీషియనులు మొదట ప్రభువర్గంవారు కారు. వారు రోము పట్టణాన్ని పట్టుకొని అక్కడ ఇతః పూర్వపాలకులైన శాబైనులను ఓడించి బానిసలుగా చేరుకున్నారు. వారు కాలక్రమేణ ప్లీబను లైనారు.

విజేతలు అన్ని దేశాలలోనూ వారి వారి పూర్వీకుల సాంఘిక మత, రాజకీయ సంప్రదాయాలను అనుసరిస్తూ సామాన్య జనం దగ్గరనుంచీ దూరంగా ఉంటూ వచ్చినారు. వారితో సహపంక్తి భోజనముగానీ, వివాహాలుగానీ జరిపేవారు కారు. అంటే ఆ విజేతలు ఎవరి మధ్య నివసిస్తున్నారో వారిని విజాతీయులనుగానూ, అన్యదేశీయులనుగానూ భావించేవారన్నమాట.

ప్రతి జాతికీ, ప్రతివర్గానికీ, కొన్ని ప్రత్యేకాచారాలూ అభిమానాలూ లోకంలో గోచరిస్తున్నవి. వారి వారి జీవనవిధానాలు వేరు; వారి వారి ఉత్సాహోద్రేకాలు వేరు. వాటిని బట్టి ప్రతిజాతీ, ప్రతివర్గమూ తనను ఉత్తమ శ్రేణికి చెందిన దానినిగా భావించుకొని, ఇతర జాతులమీదా, వర్గాలమీదా దాడిచేస్తూఉంటవి. ఆ జాతుల్లో పుట్టిన కవులూ, గాయకులూ ఆ మారణకృత్యాలను 'వీరగాథలు'గా భావించి కీర్తనం చేస్తుంటారు. ఈ ఉత్తమత్వాభిమానం మూలంగా జాతులమధ్య వివాహబంధాలు ఉండవు.

ఈ విధంగానివాహబంధాలు లేక పోవటం వల్ల ఆయాజాతులు విశేషమైన నీతి నియమాలు కలిగినవని భావించటానికి వీలులేదు. ఇందుకు ఉదాహరణముగా బెడాయిన్ జాతిని జూడవచ్చును. ఆజాతి స్త్రీ కొద్దిమూల్యానికి టర్కీ దేశస్థునికిగాని, మరొక విరోపా దేశస్థునికిగానీ ఆమె శరీరాన్ని అమ్ముకోవచ్చును. దానిని సంఘం అంగీకరిస్తుంది. కానీ ఆ విదేశీయుని వివాహం చేసుకుంటే తప్పిదము క్రింద పరిగణిస్తుంది. ఘోరశిక్ష విధిస్తుంది.

నేటి నాగరికత జాతులమధ్య, దేశాలమధ్య, మతాలమధ్య, సంఘాలమధ్య ఉన్న గోడలను బ్రద్దలుకొట్టే ప్రయత్నం చేస్తున్నది. అందుమూలంగా-అన్నిదేశాలలో కాకపోయినా కొన్ని దేశాల్లోనయినా—యుక్తవయస్కులైన స్త్రీ పురుషులు ఇరువురూ వారి వారి ఇష్టానుసారంగా మతసాంఘిక నిబంధనలకు తల ఒగ్గనవసరం లేకుండా వివాహం చేసుకొనే అవకాశం లభించినది. ఆ వివాహాలు చట్టసమ్మతాలైనవి. వెనుక వారు పడవలసిన ఆర్థికకష్టనష్టాలవల్ల కలిగే భయం దూరమైపోయినది.

ఈ మార్పు అత్యంత ప్రధానమైనది. మానవ జీవిత చరిత్రలో ఈ వైవాహిక విధానంలోని పరిణామము మూలంగా నూతనాధ్యాయం ప్రారంభించింది.

జాత్యహంకారమూ, కులగర్వమూ (Class-Pride) ధర్మ,అసహనము (Religious intolerance) స్త్రీజాతి బానిసత్వమూ, అనులోమమూ (Hypergamy) కారణంగా ఏర్పడ్డ కూటస్థ వివాహాలక్షణం రూపుమాసిపోవటమంటే ఇక ప్రపంచంలోని ఏజాతిలోనూ 'రాజాకూ రడ్డికీ' భేద ముండదన్నమాట. ప్రభుజాతి, బానిస జాతి అనే విభేదం లేదన్నమాట. సాంఘిక జీవనంలో అత్యంతమైన మార్పు కలుగుతుంది. ప్రాచీక సాంఘిక దౌర్జన్యాలకూ, దురంతాలకూ ఇక తా వుండదు. వ్యక్తిగత స్వాతంత్ర్యానికి ఏ లక్షణమూ వేరుపురుగుగా పరిణమించలేదు. మానవజాతులమధ్య వ్యక్తులమధ్య సహనభావం విశేషంగా అభివృద్ధిపొంది ప్రపంచంలోని మానవజాతులన్నీ కలిసిపోయి ఏకైక కుటుంబంగా కాకపోయినా విశేషసహనభావంతో వర్తించటానికి అవకాశం కలుగుతుంది. అటువంటి పరిణామానికి వైవాహిక విధానంలోని కూటబాహ్యత (Exogamy) రాచబాట వేస్తుంది.

అభ్యుదయం

(18 వ పేజీ తరువాయి)

సత్యం: ఔను జానకీ! ఇట్టి విపరీత భావాలలో మ్రగ్గుచున్న నీవు నన్ను కాని, నా కృషినికాని అభినందిస్తావనుకొనడం పొరపాటు. కాని, నా దేశీయులకే జ్ఞానముంటే నా సృష్టి యొక్క విలువను గ్రహిస్తారు. పశుప్రాయుడైన గ్రామీయునికి సైతం నా బాంబుమూలంగా నా పేరు తెలుస్తుంది. 'సత్యంబాంబు' గురించి జనులు ప్రసంగిస్తూంటారు...జానకీ! దీని కుక్కవగా ధనం ఒకేసారి పుచ్చుకోవాలి. చిన్న బాంబును కనిపెట్టిన మిల్సు ప్రతి బాంబుకి రాయల్టీ పుచ్చుకొన్నాడు. నేనట్లుచేస్తే నష్టపోతాను. కొలదిమాత్రం విధ్వంసక సామర్థ్యంగల మిల్సు బాంబులను లక్షలకొలది ప్రయోగించవలసి వచ్చింది. కాని, నాబాంబు ఒక్కటైతే చాలు, పట్టణాలు నాశనమౌతాయి. అందుచేతనే, రాబట్టవలసిన ధనమంతా మొదటిసారే తీసికోవాలి. జయాపజయాలను నిర్ణయించడంలో ఎందుకూ కొఱగాని యుద్ధనావపై కోట్లకొలది రూపాయిలు వెచ్చిస్తూన్నప్పుడు అనతికాలంలో జయలక్ష్మిని చేపట్టుట కవకాశమిచ్చే ఈ బాంబుకై నేనెంత డబ్బడగాలి?...ఏమంటావు జానకీ!...ఏమాత్రం నేను కోరవచ్చు. దాని విలువకు తగినట్లు ఎలాగా ఇయ్యలేరు. అది నిశ్చయం... ఏ బిరుదులిస్తారేమో!......నీవే నేనైతే ఏమి కోరుతావు జానకీ?

జానకి: నాకొడుకు నిమ్మంటాను.

సత్యం: అబ్బబ్బా!...అదే వద్దన్నది. ఆ విషయం స్మరించకు! గతం నాస్తి. భవిష్యత్తు గూర్చి యోచించాలి. చూడూ...అపారమైన ధనం ఇవ్వరు కాబట్టి అడిగినా ప్రయోజనం లేదు. అడగకుండానే కొలదిమాత్ర మిస్తారు కాబట్టి అది అడగను...నీ ఉద్దేశ మేమిటి జానకీ! ఆ నిర్ణయం వారికే విడిచిపెట్టుట మంచిదేమో!

జానకి: ఏమో నాకు తెలియదు.

సత్యం: అదేమిటి జానకీ! ఈ విషయంలో కొంత శ్రద్ధవహించరాదా? నాకిది చాలా ముఖ్యమైన విషయముగదా!...నాకొక బిరుదుకూడా యియ్యాలి......పోనీ. మూపై లక్షల రూపాయలిమ్మంటే!

జానకి: ఏం! మూపైరూపాయలన కూడదూ?

సత్యం: ఛీ! నీవు దుర్భరంగా నున్నావు. ఇంత అన్యాయమా జానకీ! నీవు శోకంతో నున్నావని ఇంతసేపు ఓర్చుకొన్నాను. ఓర్పుకైనా మితి ఉంది. తెలుసునా? నన్ను అభినందించ లేదు సరికదా, మన చేతిలో లేనిదానికై విలపించి విలపించి నిన్ను నన్నూ క్లేశపరుస్తున్నావు. తుద కాలక్ష్మిని కూడా వేధిస్తున్నావు. జానకీ! నీ మంచికై చెప్తున్నాను: అనవసరముగా నీ విట్లు కలత చెందకూడదు. అది నీకు మంచిదికాదు, నీ సహచరులకూ,నాకూ మహాకష్టంగా ఉంటుంది... ఎంతో మంది యువకులవలెనే నీ పుత్రుడుకూడా మరణించేడు. నిజమే. కాని జీవితశేషమంతా దుఃఖంతో గడపలేము!...నా పని నేను చూసుకోవాలి

జానకి: నీ బాంబువా!

సత్యం: ఔను.

జానకి: బాలయువకవృద్ధ స్త్రీ పురుషులను భిన్నభిన్నం చేయకపోతే వారి శరీరాలను ఉక్కచేసే బాంబా?

సత్యం: యుద్ధం ధర్మమూ అని నా అదృష్టమది. ఇంతకూ మనిషి ఎట్లు చస్తేనేమి చెప్పు, జానకీ! బాంబుకి గురియై శిథిలశరీరులై మరణించినా, కత్తిపోటుకి రక్తప్రావంతో ప్రాణాలు గోల్పోయినా చావు చావేకదా! యథార్థానికి రెండు విధానాలలో బాంబే కరుణార్ద్రమైనదేమో!...యుద్ధంయొక్క అభిప్రాయం జనక్షయం; స్వల్పతమకాలంలో అధికతమ జీవులను చంపగల పక్షమే యుద్ధాలలో జయం పొందుతుంది. నా బాంబు నుపయోగించిన పక్షం త్వరితంగాను, కచ్చితంగాను యుద్ధం చేయగలదు. మన దేశోపయోగానికై యిట్టి బాంబు సృష్టించిన నేను అపార దేశసేవ చేసేనని ఎవ్వరైనా అంగీకరించక తప్పదు. హరి మరణంగూర్చిన విశేషాలు ఈ ఉదయం విన్నావని, నేడు హరిస్మారకదినమునిగాని, లేనియెడల నీవు సైతం జనాభిప్రాయంతో ఏకీభవించియుందువు.

జానకి: సత్యం, ఈ సృష్టిగురించి నీకుతప్ప యింకెవ్వరికీ తెలియదుకదూ!

సత్యం: నే నెరిగినవరకంతే!

జానకి: నీవీ రహస్యాన్ని బయటపెట్టకుండా నాశనం చేస్తే, మరణభయం లేకుండా హరివంటి యువకులు వేలకొలది నిర్భయంగా హాయిగా జీవించవచ్చు కదూ?

సత్యం: ఏమో నాకు తెలియదు...అదేదో విపరీతయోచన: దానిలో సారంలేదు...నా బాంబు కన్న ఘోరమైనవి యితరులు సృష్టిస్తారు.

జానకి: కాని, నీవు కనుగొన్న రహస్యాన్ని అణచిపెట్టితే?

సత్యం: అణచిపెట్టడమా?

జానకి: ఔను, నీ సూత్రాలను నాశనంచేసి, అట్టి విధ్వంసక సూత్రాలను కనిపెట్టి నాశనం చేసి, అట్టి విధ్వంసక సూత్రాలను కనిపెట్టినాశనం చేసేవన్న విషయం ప్రకటిస్తే మనఃపరివర్తనానికి......ఎక్కువ...

సత్యం: అయ్యో జానకీ! జ్ఞానహీనులు, మతావేశపరులు నన్ను అభినందించవచ్చు, గాని, జ్ఞానాధికులు నాకు పిచ్చెత్తిందనుకొంటారు! జన సామాన్యం నన్నొక మూర్ఖునిగాను దేశద్రోహిగాను పరిగణిస్తుంది.

జానకి: సత్యం, నీ సృష్టిని నాశనంచేయమని నా ప్రార్థన.

సత్యం: ఏమని?...

జానకి: సర్వనాశనం చేయుమని ప్రార్థిస్తాను. హరి ఆత్మశాంతికైనా నీ వా పని చెయ్యి.

సత్యం: జానకీ! శోకంచే నీకు మనో వైకల్యం కలిగిందనుకొంటాను. నా సృష్టిని నాశనం చెయ్యడమా!

జానకి: నీబాంబు అమాయక జీవాన్ని నాశనంచేస్తుంది. సత్యం! అందుకా బాంబునే నాశనం చేయుమని సాంజలినై ప్రార్థిస్తున్నాను.

సత్యం: నీ మొహం! పో పో!

జానకి: ఐతే, నీవంతు నేనే నాశనం చేస్తాను. (బల్లి నెత్తి విసరికొట్టగా దానిపై నున్న ఉపకరణాలు శిథిలమౌతాయి (గాజు పగిలిన శబ్దం.)

సత్యం: (ఆశ్చర్యంతో) ఏమిటీ పాడుపని!

జానకి: నీ దుర్మార్గ సృష్టిని నాశనం చేస్తున్నాను.

సత్యం: (కఠినంగా నవ్వుతూ) దానివలన నాశనంగాదు జానకీ! ఆ రహస్యమంతా నా బుర్రలో నుంది. నీవు చేసిన దేమంటే శుభ్రంగా నున్నదిది పాడుచేసేవు. కేవలం అవివేకమంటాను!

(కూర్చుని, పగిలిన ఉపకరణాలు ఎత్తుతాడు)

జానకి: (వెనక నిల్చుని) అదంతా నీ బుర్రలో నుందా?

సత్యం: మూర్ఖురాలైన స్త్రీతప్ప ఎవ్వరైనా ఆ విషయం గ్రహించేవారు...ఈ విధంగా చిందరవందరచేసి...

జానకి: అదంతా నీ బుర్రలో నుందా?

సత్యం: ఔనౌను...అదే పునశ్చరిస్తూండక నేల శుభ్రం చెయ్యడానికి నాకు సాయంచెయ్యి.

జానకి: (మెల్లగా) సత్యం! నే నడిగింది చేయవా?

సత్యం: ఏమిటీ మూర్ఖం జానకీ! ఇదంతా ఎత్తడాని కా బల్లమీద నున్న గుడ్డ తే.

(అతను శుభ్రంచేస్తూంటే బల్లవద్ద కామె పోతుంది. బల్లపైనున్న పొడుగాటి కత్తి చూచి, అతర్కితంగా దానిని పట్టుకొని పరిశీలిస్తుంది.)

సత్యం: (తొందరగా) వేగం రా! అక్కడేం చేస్తున్నావు?

జానకి: ఇదేదో...ఈ కత్తి...వైపు చూస్తున్నాను.

సత్యం: దానిని తరువాత చూడవచ్చు. ఆ గుడ్డ త్వరగా తే...హరి జ్ఞాపకార్థం తెప్పించిన పూలగుత్తి బల్లక్రింద పడింది. దానిని కూడా విసిరికొట్టేవు...ఛఛా!

జానకి: హరి పూలగుత్తా! (చేత కత్తి పట్టుకొని సత్యం వైపు వెళ్ళును)

సత్యం: ఔను.

జానకి: నీ రహస్యాన్ని ప్రకటింపకపోతే ఆ పూలగుత్తి గురించి బాధ పడను...నీ మనస్సులో లయం చేస్తివా, ఆ సమర్పణ మత్యంత శ్రేష్ఠమైనది.

సత్యం: అబ్బే, వీలులేదు. క్షుద్రమైన ఒక కాల్పనిక చిత్త వికారాని కొగ్గి నా సృష్టిని నాశనం చేయడమా! అవకాశం లేదు!

జానకి: లేకపోతే, అది జీవాన్నే నాశనం చేస్తుంది, సత్యం!

సత్యం: దానికి దీనికి సంబంధ మేమిటి?... ఆ గుడ్డ తే!

(ఆమె చేతిలో నున్న గుడ్డను లాగి తీసికొంటాడు. రెండవచేతిలో నున్న కత్తిని చూడడు.)

జానకి: నీవు దానిని నాశనం చేయవా, సత్యం?

సత్యం: (కర్కశంగా) చెయ్యను!


జానకి: (కత్తి వానిపై కత్తి) అయితే నేనే......

(ఆర్తనాదంతో కత్తితో పొడుస్తుంది. ఒక్క అరపుతో అతను క్రింద పడతాడు. పిచ్చెత్తినట్లు ఏడుస్తూ భిన్నమైన పూలగుత్తిని తీసి, గుండెకు హత్తుకొని, వికారపు చూపులతో—)


జానకి: హరీ! నీ కైకా కపోయినా, నీవంటి వారికై చేయవలసి వచ్చింది, హరీ... చేయవలసివచ్చింది...హరి హరీ!...

(తెర)


విదేశాల్లో విశేషాలు




పారిసులో జరిగిన మార్షల్ సహాయ మహాసభలో ఒకదృశ్యము.



అక్స్ఫర్డులోని ఇండియన్ ఇన్స్టిట్యూటు మ్యూజియములో ప్రదర్శితమైన నేపాలు కళా ఖండాలలో కొన్ని. ఇందులో ముఖ్యముగా బుద్ధుని పూజాద్రవ్య పరికరాలు చూడదగినవి.



లండను-పార్లమెంటుభవనాల దాపుల్లో ఉన్న 'సింహహృదయుడైన' రిచర్డు శిలా విగ్రహపు చేతిలోఉండిన ఖడ్గం ఆ మధ్య, 1940 లో జర్మను బాంబుదెబ్బ తగిలి వంగిపోయింది ఆ ఖడ్గాన్ని మరామత్తుచేసి, శిల్పులు తిరిగి యథాస్థానంలో ప్రతిష్ఠిస్తున్న దృశ్యమిది.



బుడాపెస్టులో డాన్యూబు నదీతీరాన ఉన్న పార్లమెంటు భవనం.



హార్వెలులోని ఆటం పరిశోధనాగారంలోనికి పోబోతూ, అక్కడి ఆచారాన్ని అనుసరించి, గేటుకాపలా ఉన్న సెక్యూరిటీ పోలసుజవానుకు తన నిజాయితీచీటీని చూపుతున్న ఆటంశాస్త్రవేత్త సర్ జాన్ కాక్‌క్రాఫ్టు.

★

లండనులో ఇటీవల జరిగిన వ్యాయామ వినోద క్రీడల ఇంటర్నేషనల్ కాంగ్రెసు సభాసందర్భంలో సభాప్రారంభాన పసిపిల్లల వినోదక్రీడా కలాపాలను అతి శ్రద్ధగా పరిశీలిస్తున్న కొందరు ప్రతినిధులు. →

★



Regd. No M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St. G. T. Madras